సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 318
గురువారం 8-2-2024
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'


బుమ్రా నంబర్‌వన్
ఐసీసీ టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్‌లో భారత పేసర్ - 14లో


20 లక్షల మందికి ఏఐలో శిక్షణ
ఏఐ నియంత్రణపై అవగాహన అవసరమన్న సత్యనాదెళ్ల - 15లో



'రోటి, కపడా, ఔర్ మకాన్' ఎవరు అవునన్నా, కాదన్నా ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇదో నినాదం. ప్రజలకు వీటిని సమకూర్చడం పాలకుల కనీస బాధ్యత. ఇవి అందుబాటులో ఉన్నప్పుడే ఏ కుటుంబమైనా అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేయడానికి ఉపక్రమిస్తుంది. వీటిని విస్మరించి, గ్రాఫిక్స్‌తో ఎన్ని మేడలు కట్టినా అవి నీటి మూట లేనని చరిత్ర చెబుతోంది. ప్రజల ఆనందాన్ని, వారి బాగోగులను చూసి ఆనందించే వాడే అసలైన పాలకుడని కూడా చరిత్ర వెల్లడిస్తోంది. తాడిత, పీడిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు బాసటగా నిలిచినప్పుడే ప్రజా రంజక పాలన అనిపించుకుంటుంది.

విద్య, వైద్యం, వ్యవసాయం.. ఈ మూడు రంగాల్లో చేయూత అందిస్తే చాలు, ప్రజలు స్వయం సమృద్ధి దిశగా అడుగులేస్తారని విశ్వవ్యాప్తంగా విఖ్యాత ఆర్థిక నిపుణులు నొక్కి వక్కాణిస్తుండటం తరచూ వినిపిస్తోంది.

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభ్యున్నతికే ఎన్నో దేశాలు, రాష్ట్రాలు సతమతం అవుతున్న వేళ.. ఇంతకు మించిన సంక్షేమాభివృద్ధిని సాకారం చేస్తూ మన రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందుకు వేస్తోంది. నవరత్నాల పథకాలు, సప్త స్వరాల్లాంటి థీమ్‌ల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన జీవనాన్ని అందించాలనే తపన, తాపత్రయం.. బడ్జెట్‌లో కళ్లకు కడుతోంది.



ఏడు రంగుల ఆంధ్ర ధనుస్సు

అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా రూ.2.86 లక్షల కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్

విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటికి ప్రాధాన్యం

ద్రవ్య, రెవెన్యూ లోటు తగ్గించే చర్యలు

2 లో

నాలుగు నెలలకు రూ.88,215 కోట్ల వ్యయానికి ప్రతిపాదన


శాసనసభలో బడ్జెట్ ప్రవేశ పెడుతున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

మొత్తం బడ్జెట్ రూ.2,86,389.27 కోట్లు

మూలధన వ్యయం రూ.30,530.18 కోట్లు

రెవెన్యూ వ్యయం రూ.2,30,110.41 కోట్లు

రెవెన్యూ లోటు 24,758.22 కోట్లు

ద్రవ్య లోటు రూ.55,817.50 కోట్లు

రంగాల వారీగా కేటాయింపులు (రూ.కోట్లలో) ₹

విద్య	గ్రామీణాభివృద్ధి	వ్యవసాయం, అనుబంధ రంగాలు	గృహ నిర్మాణాలు	బీసీ సంక్షేమం	ఎస్టీ సంక్షేమం
33,898	17,816	14,236	7,062	29,001.31	4,133.73
వైద్యం, ఆరోగ్యం	పట్టణాభివృద్ధి	సాగునీరు	సంక్షేమం	ఎస్సీ సంక్షేమం	మైనారిటీల సంక్షేమం
17,916	9,546	12,038	44,668	9,291.55	2,242.36

మరో భారతీయ విద్యార్థి అమెరికాలో దుర్మరణం



ఎన్నో ఆశలతో అమెరికాలో అడుగు పెడుతున్న కొందరు భారతీయ విద్యార్థుల భవిత అర్ధంతరంగా ముగిసిపోతోంది. ఆ విషాదపర్వంలో మరో ఉదంతం తాజాగా చోటుచేసుకుంది. భారతీయ మూలాలున్న విద్యార్థి సమీర్ కామత్ అమెరికా కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం ఇండియానా రాష్ట్రంలో విగతజీవిగా కనిపించారు.

- వివరాలు 6లో

6,100 పోస్టులతో డీఎస్సీ

షెడ్యూల్ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం	2,280	2,299	1,264	215	42
	సెకండరీ గ్రేడ్ టీచర్లు	స్కూల్ అసిస్టెంట్లు	ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు	పీజీటీ	ప్రిన్సిపాల్ పోస్టులు

నేడు టెట్‌కు, 12న డీఎస్సీకి నోటిఫికేషన్ల జారీ

- అదే రోజు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- 27 నుంచి మార్చి 9 వరకు టెట్ పరీక్షలు
- మార్చి 15 నుంచి 30 వరకు డీఎస్సీ పరీక్షలు
- మార్చి 14న టెట్, ఏప్రిల్ 7న డీఎస్సీ ఫలితాలు
- రెండు పరీక్షలు కంప్యూటర్ బేస్డ్ విధానంలోనే నిర్వహణ.. ఏప్రిల్ చివరి నాటికి మొత్తం నియామక ప్రక్రియ పూర్తి


వివరాలను వెల్లడిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మొత్తం 6,100 పోస్టుల భర్తీకి డీఎస్సీ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ పోస్టుల్లో 2,280 సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), 2,299 స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ), 1,264 ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ), 215 పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), 42 ప్రిన్సిపాల్ పోస్టులు ఉన్నాయి. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)తో పాటు డీఎస్సీ–2024 నోటిఫికేషన్లకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు గురువారం టెట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈనెల 12న ఇవ్వనుంది. టెట్, డీఎస్సీకి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ https://cse.ap.gov.in ద్వారా చేసుకోవాలి. ఈ మేరకు బుధవారం సచివాలయంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ సురేష్ కుమార్ వివరాలు వెల్లడించారు. నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచే ఆయా పరీక్షలకు ఆన్‌లైన్ దరఖాస్తులు కూడా స్వీకరిస్తారు. మొత్తం ప్రక్రియను పూర్తిచేసి, ఏప్రిల్ చివరి నాటికి అభ్యర్థులకు పోస్టింగ్ ఇస్తామని, వారు వచ్చే విద్యా సంవత్సరంలో బోధన కూడా చేపడతారని మంత్రి బొత్స తెలిపారు. అందుకు అనుగుణంగా షెడ్యూల్ ఖరారు చేశామన్నారు. రాష్ట్రంలో చివరిసారిగా 2022 ఆగస్టులో టెట్ నోటిఫికేషన్ ఇచ్చి

మిగతా 15వ పేజీలో ▶

చేయూతనిచ్చాం.. ఆసరాగా నిలిచాం

సంక్షేమ శకం

వివక్షకు దూరంగా..

ఇదిగో.. సామర్థ్య ఆంధ్ర

వెలుగు జిలుగుల అన్నపూర్ణ

ఐదేళ్లలో 'సుపరిపాలిత ఆంధ్ర'గా..

బడ్జెట్‌పై మరిన్ని కథనాలు 2,10,11 పేజీల్లో


ఇదం జగత్


కండువాలను ఆయన అలానే వేస్తారు.. నీకిష్టముంటేనే వేస్కో!!

న్యాయవాదులు సమ్మె విరమించాల్సిందే

లేకుంటే చర్యలు తీసుకోండి

- రాష్ట్ర బార్ కౌన్సిల్, బీసీఐలకు హైకోర్టు స్పష్టీకరణ
- భూ యాజమాన్య హక్కుల చట్టం విషయంలో మధ్యంతర ఉత్తర్వులిచ్చాం
- అయినా ఈ అంశంపై సమ్మె కొనసాగించడమేంటి?
- సమ్మె చేస్తున్న న్యాయవాదులపై హైకోర్టు ఆగ్రహం
- విచారణ 14కి వాయిదా



సాక్షి, అమరావతి: ఏపీ భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని వ్యతిరేకిస్తూ సమ్మె చేస్తున్న న్యాయవాదులపై హైకోర్టు మండిపడింది. సమ్మె విరమించి తీరాల్సిందేనని అల్టిమేటం జారీ చేసింది. సమ్మె విరమించని పక్షంలో ఆ న్యాయవాదులపై చర్యలు తీసుకోవాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ), రాష్ట్ర బార్ కౌన్సిల్‌ను ఆదేశించింది. ఏపీ భూ యాజమాన్య హక్కుల చట్టం విషయంలో

మిగతా 3వ పేజీలో ▶

మీరెలా చెబితే అలా..!

లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పంపకాలపై బీజేపీ అగ్ర నేతలతో చంద్రబాబు

- రాత్రి 11.30 నుంచి అరగంట పాటు అమిత్ షా, జేపీ నడ్డాలతో ఢిల్లీలో భేటీ
- 6 నుంచి 8 ఎంపీ సీట్లు, 25 వరకు అసెంబ్లీ సీట్లు ఇవ్వాలన్న బీజేపీ నేతలు.. పొత్తులకు అంగీకరిస్తే ఎలాంటి షరతులకైనా సిద్ధమన్న చంద్రబాబు
- పవన్‌తో మాట్లాడి చెబుతామన్న అమిత్ షా, నడ్డా
- అంతకుముందు ఢిల్లీలోని ఓ హోటల్‌లో బాబు రహస్య భేటీ.. గంటన్నరపాటు ఎవరితో భేటీ అయ్యారో ఎంపీలకూ తెలియని వైనం

- వివరాలు 3లో


ఢిల్లీలో టీడీపీ అధినేత చంద్రబాబు



కాంగ్రెస్‌కు కాలం చెల్లింది

రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటన

ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కాంగ్రెస్ ఎప్పటికీ వ్యతిరేకమే

రిజర్వేషన్లను జవహర్‌లాల్ నెహ్రూ వ్యతిరేకించారు

ఉత్తరం, దక్షిణం అంటూ దేశాన్ని విభజించడానికి కాంగ్రెస్ కుట్రలు.. వారంటీ తీరిపోయినవారి మాటలను దేశం వినిపించుకోదు

6 లో


సాక్షి
గురువారం
| 8 | ఫిబ్రవరి | 2024
విజయవాడ
www.sakshi.com



“మిమ్మల్ని మీరు తెలుసుకోవడానికి గల ఉత్తమ మార్గం, ఇతరుల సేవలో మిమ్మల్ని మీరు కోల్పోవడం”
– మహాత్మా గాంధీ



బడ్జెట్ 2024-25



ఐదేళ్లలో ‘సుపరిపాలిత ఆంధ్ర’గా..


గడప గడపకు ప్రభుత్వ సేవల ద్వారా బాధ్యతాయుత పాలన

దీనిద్వారా ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులు వెళ్లి వారి సమస్యలు గురించి ఆరా

ఎటువంటి లోపాలు లేకుండా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు

జిల్లాల విభజన, కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు ద్వారా పాలనకు మరింత జవాబుదారీతనం

సీఎం జగన్ ప్రభుత్వ ఐదేళ్ల పాలనా సంస్కరణలను ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి బుగ్గన





సాక్షి, అమరావతి : 2019.. అప్పటికి రాష్ట్ర విభజన జరిగి ఐదేళ్లు పూర్తయింది. విభజన గాయాలు మానేందుకు, సాంత్వన చర్యలు తీసుకునేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. పైగా.. పరిస్థితిని పెనం మీంచి పొయ్యిలోకి నెట్టింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధానంగా దృష్టిపెట్టారు. ఈ సమస్యలను అధిగమించాలంటే మూస పద్ధతిలో కాకుండా సరికొత్త విధానంలో మాత్రమే అభివృద్ధి సాధించగలమని ఆయన తన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా బలంగా విశ్వసించారు. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లుగా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ముఖ్యంగా సుపరిపాలనలో భాగంగా పాలనలో వికేంద్రీకరణ ప్రవేశపెట్టడం అత్యంత ప్రధానమైనది. ప్రభుత్వాన్ని ప్రజల వద్దకు సీఎం జగన్ తీసుకెళ్లారు. గ్రామస్థాయి నుంచి ప్రభుత్వాన్ని పటిష్టపరిచారు. విస్తృతస్థాయిలో పాలనా విభాగాలను పునర్వ్యవస్థీకరించి సమాజంలోని వివిధ వర్గాల వారికి సాధికారత అందించి రాష్ట్రాన్ని ‘సుపరిపాలిత ఆంధ్ర’గా తీర్చిదిద్దారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ బుధవారం తన బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రం ‘సుపరిపాలిత ఆంధ్ర’గా ఎలా రూపాంతరం చెందిందో స్పష్టంగా వివరించారు.

పాలనా వికేంద్రీకరణ..

ప్రజలు సాధికారిత, వికేంద్రీకరణ, సుపరిపాలన అభివృద్ధికి అత్యంత ముఖ్యమైనవి. వీటిని ప్రజల చెంతకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామస్థాయి నుంచి ప్రభుత్వాన్ని పటిష్టపరచడం, విస్తృత స్థాయిలో పాలనా విభాగాలను పునర్వ్యవస్థీకరించడం, సమాజంలోని వివిధ వర్గాల వారికి సాధికారతనందించింది. పాలనా వికేంద్రీకరణలో భాగంగా జిల్లాలు, పోలీసు వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ మాత్రమే కాకుండా స్థానిక సంస్థలను బలోపేతం చేసింది. కమ్యూనిటీ కాంట్రాక్టుల విధానం, స్థానిక పాలనలో పౌరుల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించింది. అలాగే..

- దాదాపు 1,35,000 మంది ఉద్యోగులతో 15,004 గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటుచేసింది. వీటిల్లో 2.66 లక్షల మంది వలంటీర్లను నియమించింది. తద్వారా అర్హులైన లబ్ధిదారులందరికీ ఎలాంటి లోపాలు లేకుండా సకాలంలో పారదర్శకంగా సంక్షేమ పథకాలకు తోడు పౌర కేంద్రీకృత సేవలు గడప గడపకు అందిస్తోంది.
- అందుబాటులో ఉన్న వనరులను సముచితంగా వినియోగించి జిల్లాల సంఖ్యను 13 నుంచి 26కు.. రెవెన్యూ డివిజన్లను 52 నుంచి 77కి పెంచి పరిపాలనాపరమైన పునర్నిర్మాణాన్ని చేపట్టింది. ఇది ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడంతో పాటు ప్రభుత్వాన్ని మరింత జవాబుదారీగా, సమర్థవంతంగా చేసింది.
- నూతన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాల నిర్మాణం ప్రజలకు సేవలను మరింత చేరువ చేస్తాయి.
- ఇక పౌరుల రక్షణ, భద్రతను పెంపొందించడానికి అవసరమైన చోట్ల రాష్ట్ర ప్రభుత్వం కొత్త పోలీసు సబ్-డివిజన్లు ఏర్పాటుచేసింది.
- ప్రతి జిల్లాలో దిశా పోలీసుస్టేషన్లు ఏర్పాటుచేయడమే కాక రాష్ట్రవ్యాప్తంగా పుణ్యక్షేత్రాలు మరియు పర్యాటక ప్రాధాన్యత కలిగిన 20 ముఖ్య ప్రాంతాల్లో పర్యాటక పోలీసుస్టేషన్లు ప్రారంభమయ్యాయి.
- భద్రతా మౌలిక సదుపాయాలు పెంచడం ద్వారా ప్రజాభద్రత మరింత మెరుగుపడింది.

గడప గడపకు మన ప్రభుత్వం..

- ఈ కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు పౌరుల నుంచి నేరుగా ప్రాథమిక సౌకర్యాలు, మౌలిక సదుపాయాల అవసరాలను తెలుసుకుని వాటిని సమకూర్చడం ద్వారా బాధ్యతాయుతమైన పాలనను అందిస్తున్నారు.
- ఈ కార్యక్రమంలో భాగంగా 58,288 పనులను రూ.2,356 కోట్ల అంచనాతో మంజూరు చేయగా, ఇప్పటివరకు రూ.729 కోట్లతో 17,239 పనులు పూర్తయ్యాయి.
- రాష్ట్రంలో స్థానిక సంస్థలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు నాల్గవ రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సులను ఆమోదించి, ఐదవ రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని కూడా ఏర్పాటుచేసింది.

వివక్షకు దూరంగా..

మాట ప్రకారం మేలు చేసిన సీఎం జగన్: ఆర్థిక మంత్రి బుగ్గన

ప్రతిపక్ష నేత నియోజకవర్గంలో రెవిన్యూ డివిజన్, పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు

సమానత్వం పాటిస్తామని చెప్పడానికే కుప్పం గురించి ప్రస్తావిస్తున్నా

సాక్షి, అమరావతి: గత ఎన్నికల ప్రచార సమయంలో చెప్పిన మాదిరిగానే ముఖ్యమంత్రి జగన్ రాజకీయాలు, ప్రాంతాలు, కులమతాలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందించినట్లు బడ్జెట్ ప్రసంగంలో బుగ్గన పేర్కొన్నారు. పాలనా వికేంద్రీకరణకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన చర్యలను వివరిస్తూ ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తావించారు. ప్రతిపక్ష నాయకుడి నియోజకవర్గమని వదిలేయకుండా కుప్పంను రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించడంతోపాటు పౌరుల రక్షణ, భద్రత కోసం కొత్త పోలీసు సబ్ డివిజన్, పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అందరినీ సమానంగా చూస్తోందనేందుకు ఇదే ఉదాహరణ అని చెప్పారు. సంక్షేమ ఫలాలను వివరిస్తూ కొందరు లబ్ధిదారులకు చేకూరిన ప్రయోజనాన్ని బుగ్గన వీడియో ప్రజంటేషన్ ద్వారా తెలియచేశారు. ఇలాంటి ఉదంతాలు రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోనూ కనిపిస్తాయన్నారు.

- తీవ్ర ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జి.ఎర్రగుడి గ్రామానికి చెందిన వడ్డే రాజేశ్వరి పొదుపు సంఘాల రుణాల మాఫీ, పింఛన్, ఆసరా కింద లభించిన సాయంతో గొర్రెలను కొనుగోలు చేశారు. తనను కష్టాల నుంచి ఈ ప్రభుత్వం గట్టెక్కించిందని ఆమె సంతోషంగా చెబుతోంది.
- విశాఖ జిల్లా భీమిలి మండలం టి.నగరపాలెంకు చెందిన పల్లా కృష్ణవేణి చేయూత కింద అందిన మొత్తంతో కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకుంది. అమ్మ ఒడి సాయం కూడా అందుతోంది. కుట్టు మిషన్ ఉంది. రోజుకు రూ.1,000 దాకా సంపాదిస్తున్నానని, కిరాణా దుకాణంతో తమ బతుకులు మారాయని సగర్వంగా చెబుతోంది.
- విశాఖపట్నం ఆరో వార్డు మధురవాడకు చెందిన వాండ్రాసి అన్నపూర్ణ తాము టీడీపీ మద్దతుదారులైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు ఇతర పథకాలనూ అందిస్తోందని ధన్యవాదాలు తెలియచేస్తోంది.
- నడవలేని స్థితిలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు చెందిన వృద్ధురాలు కవుజు బేబీ అనే మహిళకు ప్రతి నెలా రూ.3,000 పెన్షన్, ఇతర పథకాలను ఇంటి వద్దే అందిస్తుండటంతో ఈ ప్రభుత్వం తనను ఎంతో ఆదుకుంటోందని కృతజ్ఞతలు తెలిపింది.
- విశాఖకు చెందిన రోబంకి చిరంజీవులు అనే వృద్ధ దంపతులకు వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా కంటి ఆపరేషన్లు, ఆరోగ్యశ్రీ ద్వారా కాలికి ఆపరేషన్ నిర్వహించడంతోపాటు ఆసరా, పెన్షన్ అందిస్తుండటంతో ఈ ప్రభుత్వం కన్న కొడుకులా ఆదుకుంటోందంటూ సంతోషంగా చెబుతున్నారు.
- ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి పంపడంతో ఒంటరిగా ఉన్న తాను దేవాలయాల వద్ద యాచిస్తూ జీవనం సాగించానని, ఈ ప్రభుత్వం వచ్చాక రూ.3,000 పెన్షన్ ప్రతీ నెలా ఇస్తుండటంతో భిక్షాటన మానుకుని గౌరవంగా బతుకుతున్నానంటూ విజయనగరం జిల్లా బాడంగి మండలం వాడాడ గ్రామానికి చెందిన బత్తిన అప్పమ్మ చెబుతోంది.

ఏడు రంగుల ఆంధ్ర ధనుస్సు

సాక్షి, అమరావతి: సాధారణ ఎన్నికలకు ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రూపుదిద్దుకుంది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ 2024 - 25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను బుధవారం అసెంబ్లీకి సమర్పించారు. ద్రవ్యలోటు, రెవెన్యూ లోటును తగ్గించేందుకు ప్రయత్నం చేసిన ఆర్థిక మంత్రి మేనిఫెస్టోలో పేర్కొన్న నవరత్నాల అమలు ద్వారా గత ఐదేళ్లలో సాధించిన ప్రగతి, ఫలితాలు, సంక్షేమాన్ని బడ్జెట్ ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. కొత్త ఆలోచనలు, వినూత్న విధానాలను అమలు చేయడం ద్వారా అతి తక్కువ వ్యవధిలో ప్రభుత్వం సంతృప్త స్థాయిలో ప్రజలందరి జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నుంచి ఏప్రిల్ – జూలై వరకు నాలుగు నెలలు పాటు వ్యయానికి రూ.88,215 కోట్ల పద్దును అసెంబ్లీ ఆమోదానికి ప్రతిపాదించారు. భారీ అంచనాలకు వెళ్లకుండా వాస్తవాలకు అనుగుణంగా బడ్జెట్ ప్రతిపాదనలకే పరిమితమయ్యారు. ఎప్పటిలాగానే విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం, సాగునీటి రంగాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు.

- 2024-25 ఓటాన్ అకౌంట్ మొత్తం బడ్జెట్‌ను రూ.2,86,389.27 కోట్లుగా బుగ్గన ప్రతిపాదించారు. మూలధన వ్యయం రూ.30,530.18 కోట్లు, రెవెన్యూ వ్యయం రూ.2,30,110.41 కోట్లుగా ప్రతిపాదించారు. రెవెన్యూ లోటు 24,758.22 కోట్లు ఉంటుందని, ద్రవ్య లోటు రూ.55.817.50 కోట్లుగా ఉంటుందని పేర్కొన్నారు. ద్రవ్యలోటు జీఎస్‌డీపీలో దాదాపు 3.51% ఉంటుందని, రెవెన్యూ లోటు జీఎస్‌డీపీలో దాదాపు 1.56 శాతం ఉంటుందని అంచనా వేశారు. 2023-24 సవరించిన అంచనాల మేరకు రెవెన్యూ లోటు జీఎస్‌డీపీలో 2.19 శాతం, ద్రవ్య లోటు జీఎస్‌డీపీలో 4.18 శాతం ఉంటుందని తెలిపారు.
- సాధారణ విద్యకు బడ్జెట్ కేటాయింపుల్లో పెద్ద పీట వేశారు. సాధారణ విద్యా రంగానికి రూ.33,898 కోట్లు కేటాయించారు. సంక్షేమ, అభివృద్ధి రంగాలకు తగినన్ని నిధులు కేటాయించారు. గ్రామీణాభివృద్ధికి రూ.17,816 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ.9546 కోట్లు, వైద్య, ఆరోగ్య రంగానికి రూ.17,916 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.14,236 కోట్లు, సాగునీటి రంగానికి రూ.12,038 కోట్లు, మొత్తం సంక్షేమ రంగానికి రూ.44,668 కోట్లు కేటాయించారు. విద్యుత్ రంగానికి రూ.6,595 కోట్లు, రవాణా రంగానికి రూ.10,334 కోట్లు కేటాయింపులు చేశారు. పరిశ్రమలు, వాణిజ్యం, మౌలిక సదుపాయాల పెట్టుబడులకు రూ.3,940 కోట్లు కేటాయించారు.

బడ్జెట్ స్వరూపం

మొత్తం బడ్జెట్	రూ. 2,86,389 కోట్లు
రెవెన్యూ వ్యయం	రూ. 2,30,110 కోట్లు
మూలధన వ్యయం	రూ. 30,530 కోట్లు
ద్రవ్య లోటు	రూ. 55,817 కోట్లు
రెవెన్యూ లోటు	రూ. 24,758 కోట్లు
జీఎస్‌డీపీలో రెవెన్యూ లోటు	1.56 శాతం
జీఎస్‌డీపీలో ద్రవ్య లోటు	3.51 శాతం

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆర్థిక సేవలకు కేటాయింపులు ఇలా..

వ్యవసాయ అనుబంధ సర్వీసులకు	రూ.14,236.76 కోట్లు
గ్రామీణాభివృద్ధి	రూ.17,816.04 కోట్లు
జలవనరులు, వరద నియంత్రణ	రూ.12,038.73 కోట్లు
ఇంధన	రూ.6,595.58 కోట్లు
పరిశ్రమలు, మినరల్స్	రూ.2,611.00 కోట్లు
రవాణా	రూ.10,334.42 కోట్లు
శాస్త్ర సాంకేతిక, పర్యావరణం	రూ.16.32 కోట్లు
సాధారణ ఎకో సర్వీసెస్	రూ.4,744.47 కోట్లు
మొత్తం	రూ.68,393.31 కోట్లు

వెలుగు జిలుగుల అన్నపూర్ణ ఆంధ్ర

ఈ 57 నెలల్లో పండుగలా మారిన వ్యవసాయ రంగం

- అడుగడుగునా అన్నదాతను చేయిపట్టి నడిపించిన ప్రభుత్వం
- కొత్త పుంతలు తొక్కుతున్న వ్యవసాయ అనుబంధ రంగాలు
- వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా, పెట్టుబడి సాయం



సాక్షి, అమరావతి: ‘విత్తు నుంచి విపణి వరకు ప్రతి రైతుకు అడుగడుగునా అండగా నిలిచాం. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండుగ అని నిరూపించాం. ధరల స్థిరీకరణ నిధి, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాల ద్వారా వ్యవసాయానికి స్థిర, సురక్షిత వాతావరణాన్ని కల్పించాం. రైతుల జీవనోపాధిని మరింత బలోపేతం చేయడం, గణనీయమైన ఉత్పత్తి ద్వారా రైతుల ఆదాయం పెంపొందించడం.. తద్వారా వారి జీవన ప్రమాణ స్థాయిలను మెరుగుపర్చేందుకు ఒక సమగ్ర వ్యూహంతో ముందుకెళ్తున్నాం’ అని ప్రభుత్వం స్పష్టం చేసింది. వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యవసాయ రంగంలో సాధించిన అద్భుత ఫలితాలను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ‘అన్నపూర్ణ ఆంధ్ర’ థీమ్‌తో అసెంబ్లీలో వెల్లడించారు. బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.14,237 కోట్లు కేటాయించామని చెప్పారు. ‘వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ కంటే మిన్నగా ఏటా 3 విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తోంది. ఇలా 2019 నుంచి ఇప్పటి వరకు 1.60 లక్షల కౌలు రైతులు, 93 వేల అటవీ భూమి సాగు రైతులతో సహా 53.53 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.33,209.81 కోట్ల సాయం అందించింది. ఈ పథకం కింద ఇప్పటికే ప్రతి రైతు కుటుంబానికి రూ.65,500 లబ్ధి చేకూరింది. చంద్రబాబు హయాంలో ఎన్నికల ముందు హడావుడిగా ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకం కింద 46.75 లక్షల మందికి రూ.వెయ్యి చొప్పున, ఆ తర్వాత 43,25,612 మందికి రూ.3 వేలు చొప్పున రూ.1,765.29 కోట్లు మాత్రమే జమ చేసింది. మొత్తంగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఈ ఐదేళ్లలో రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేసింది’ అని వివరించారు.

పథకం/కార్యక్రమం	లబ్ధిదారులు	అందిన సాయం (రూ.కోట్లలో)
వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం	54.55 లక్షలు (గతంలో 30.85 లక్షలు)	7,802.05 (గతంలో రూ.3,411.20 కోట్లు)
వ్యవసాయ ఉచిత విద్యుత్ కనెక్షన్లు	19 లక్షలు	37,374
పంట ఉత్పత్తుల కొనుగోలు	6.17 లక్షలు (గతంలో 3.74 లక్షలు)	7,746.31 (విలువ - గతంలో 3,322)
ఇన్‌పుట్ సబ్సిడీ	22.85 లక్షలు	1,976.45
2023-24 సీజన్‌లో కరువు, తుపాన్	-	1,200 (త్వరలో పంపిణీ)
ఉద్యానం	17.27 లక్షలు	4,363
జగనన్న పాల వెల్లువ	3.60 లక్షలు	2,697
చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ	-	385
మత్స్యకార భరోసా	2.43 లక్షలు	530.11
మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ	20,034	148.04 (గతంలో 59 కోట్లు మాత్రమే)
మత్స్యకార కుటుంబాలకు పరిహారం	159	13.52

అడుగడుగునా భరోసా

- నాణ్యమైన సీడ్, ఫీడ్ కోసం 35 సమీకృత మత్స్య సంపద ప్రయోగశాలలు ఏర్పాటు.
- 26 ఆక్వా హబ్‌లకు అనుబంధంగా 2 వేలకు పైగా ‘ఫిష్‌ఆంధ్రా’ రిటైల్ దుకాణాల ఏర్పాటు.
- ఒకే గొడుగు కిందకు ఆక్వా కార్యకలాపాల కోసం ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా)తో పాటు ఏపీ సీడ్, ఫీడ్ యాక్ట్‌లు.
- పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వద్ద మత్స్య యూనివర్సిటీ. ఈ ఏడాది నుంచే విద్యా బోధన మొదలు.
- 2.12 లక్షల హెక్టార్ల విస్తీర్ణాన్ని ఆక్వాకల్చర్ కిందకు తీసుకురావడం ద్వారా 16 లక్షల మందికి కొత్తగా జీవనోపాధి.
- కొత్తగా 127 డాక్టర్ వైఎస్సార్ వ్యవసాయ పరీక్షా కేంద్రాల ఏర్పాటు.
- ఆర్బీకేల ద్వారా అందుబాటులో సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు.. వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాల ద్వారా వ్యవసాయ యంత్రాలు. గ్రామీణ నిరుద్యోగ యువతకు డ్రోన్ పైలట్ శిక్షణ.
- రూ.16 వేల కోట్లతో మౌలిక వసతుల కల్పన. ఇప్పటికే 2.44 లక్షల టన్నుల అదనపు నిల్వ సామర్థ్యంతో 462 వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ కేంద్రాలు, 84 సౌర శీతల గిడ్డంగులు, 2,905 ప్యాక్ హౌస్‌ల ఏర్పాటు.
- వైఎస్సార్ పశు బీమా పథకంతో పశువులకు బీమా సౌకర్యం. నియోజకవర్గానికి రెండు చొప్పున 340 వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాలు.

వచ్చారు.. గోల చేసి వెళ్లిపోయారు

- శాసనసభలో మూడో రోజూ టీడీపీది అదే తీరు.. నిబంధనలకు విరుద్ధంగా వాయిదా తీర్మానాన్ని తీసుకోవాలంటూ పట్టు
- సభాపతిపై పేపర్లు చించి, విసురుతూ వికృతానందం

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసన సభలో టీడీపీ కుటిలత్వం మరోసారి బయటపడింది. సభా సంప్రదాయాలను ధిక్కరించి, ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేశారు. ఈ సమావేశాల మూడో రోజూ బుధవారం సభలో రచ్చ చేసి, సస్పెండై బయటకు వెళ్లిపోయారు. ప్రజా సంక్షేమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడాన్ని జీర్ణించుకోలేక సభ ప్రారంభం నుంచే ఆటంకం కల్పించారు. నిబంధనలకు విరుద్ధంగా వాయిదా తీర్మానాలిచ్చి, చర్చకు పట్టుబట్టి, గోల చేశారు. చివరకు సభ నుంచి సస్పెండై, బడ్జెట్‌లో పాల్గొనకుండానే వెళ్లిపోయారు.

బుధవారం సభ ప్రారంభం నుంచే టీడీపీ సభ్యులు రన్నింగ్ కామెంట్రీ మొదలుపెట్టారు. రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టులు, వ్యవసాయ పంటల గిట్టుబాటు ధరలపై వాయిదా తీర్మానమిచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం తిరస్కరించారు. జీరో అవర్ పూర్తయ్యాక బడ్జెట్ ఉంటుందని, ఇప్పుడు సమయం కాదని చెప్పారు. టీడీపీ సభ్యులు వినిపించుకోలేదు. స్పీకర్ పోడియం పైకి ఎక్కి నానా రచ్చ చేశారు. కాగితాలు చించి సభాపతిపై విసిరేశారు. స్పీకర్ చెవుల్లో బిగ్గరగా అరిచి గోల చేశారు. దీంతో సభలో మిగతా సభ్యులకు ఏం జరుగుతోందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. స్పీకర్ మాట్లాడుతుంటే మైక్‌లో టీడీపీ సభ్యులు అరుస్తూ గందరగోళం సృష్టించారు. ముఖ్యమైన చట్ట సవరణల బిల్లులను సభలో ప్రవేశపెడుతుంటే అడ్డుతగిలారు. అచ్చెన్నాయుడు వెల్‌లో నిలబడి నినాదాలు చేయగా, బాలకృష్ణ, వెలగపూడి, నిమ్మల, ఏలూరి తదితరులు స్పీకర్‌ను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారు.

కాపీ కొట్టడం టీడీపీ పేటెంట్ రైట్!

టీడీపీ సభ్యులు ఎంత అనుచితంగా ప్రవర్తించినప్పటికీ స్పీకర్ సంయమనంతో వ్యవహరించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ క్రాప్ ఇన్సూరెన్స్, కళ్లాల్లోనే ధాన్యం కొనుగోలు, ఇన్‌పుట్ సబ్సిడీ, యంత్రసేవ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తుంటే.. ప్రతిపక్ష సభ్యులు వాటిని అమలు చేయట్లేదని నినాదాలు చేయడం వారి అజ్ఞానాన్ని బయటపెట్టింది. శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన కలగజేసుకొని.. పక్క రాష్ట్రాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్న ప్రతిపక్షాలను చూసైనా నేర్చుకోవాలని టీడీపీకి సూచించారు. నిబంధనలను అతిక్రమించిన 11 మంది ప్రతిపక్ష సభ్యులను ఒక రోజు పాటు సస్పెండ్ చేయాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. స్పీకర్ టీడీపీ సభ్యులు బెందాళం అశోక్, నందమూరి బాలకృష్ణ, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చిన్నరాజప్ప, గణ వెంకట్రెడ్డి, వెలగపూడి రామకృష్ణబాబు, నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, ఏలూరి సాంబశివ రావు, డోల బాలవీరాంజనేయస్వామి, కింజారపు అచ్చెన్నాయుడును ఒకరోజు పాటు సభ నుంచి సస్పెండ్ చేశారు. ఆ తర్వాత కొద్దిసేపు స్పీకర్ పోడియంపైనే ఉండి పదే పదే పేపర్లు చించి విసిరేసిన టీడీపీ సభ్యులు.. ఆ తర్వాత సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.

మండలిలోనూ అదే తీరు

శాసన మండలిలోనూ టీడీపీ సభ్యులు ఇదే తీరులో వ్యవహరించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ గందరగోళం సృష్టించారు. టీడీపీ, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ప్రతిపాదించిన వాయిదా తీర్మానాలను మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు తిరస్కరించడంతో టీడీపీ ఎమ్మెల్సీలు ప్లకార్డులతో వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. వారి తీరుపై మండలి చైర్మన్ మండిపడ్డారు. ప్రతి రోజూ సభను అడ్డుకునేందుకు ప్రిపేరై వస్తున్నారని, పోడియంలోకి దూసుకొచ్చి మిగిలిన సభ్యుల మాట్లాడే హక్కును హరించడం సరికాదన్నారు. అయినా టీడీపీ సభ్యులు పోడియం వద్ద నుంచి కదల్లేదు. ప్రత్యేక ప్రస్తావనలు అయ్యేవరకు వారు పోడియం వద్ద నినాదాలు చేస్తూనే ఉన్నారు.

3 బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

సాక్షి, అమరావతి: రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం శాసన సభ 3 చట్ట సవరణ బిల్లులను ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసులకు నియామక క్రమబద్ధీకరణ, సిబ్బంది తీరును, వేతన స్వరూపాన్ని హేతుబద్ధీకరించే చట్ట సవరణ, రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం చట్ట సవరణ, ఏపీ అసైన్డ్ చేసిన భూముల(అంతరణల నిషేధ) చట్ట సవరణ బిల్లులను మంత్రులు ప్రవేశపెట్టగా సభ్యుల ఏకగ్రీవ ఆమోదంతో స్పీకర్ తమ్మినేని సవరణ బిల్లులు ఆమోదం పొందినట్లు ప్రకటించారు. మంత్రి బొత్స మాట్లాడుతూ..రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయానికి ఇకపై చాన్సలర్‌గా సీఎం ఉండేలా చట్టసవరణ చేశామన్నారు. మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసి కన్వేయనెన్స్ డీడ్స్ ఇవ్వడానికి అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించామన్నారు. ఈ కన్వేయనెన్స్ డీడ్లు 10 ఏళ్ల తర్వాత సేల్‌డీడ్లుగా మారుతాయన్నారు. అక్కచెల్లెమ్మలకు సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించి ఆర్థికంగా నిలబెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మంత్రి బుగ్గన మాట్లాడుతూ..పలు సందర్భాల్లో ప్రభుత్వ విభాగాల్లో కాంట్రాక్ట్, ఇతర ప్రాతిపదికపైన రెగ్యులర్ సమయంలో పెన్షన్, ఇతర బెనిఫిట్స్ తీసుకునేందుకు కోర్టు రూల్స్ అడ్డొస్తున్నాయని..వాటిని దాటి ఉద్యోగులకు మేలు చేసేలా చట్టసవరణ చేశామన్నారు.

క్లుప్తంగా...

జగన్ అంటే భయం.. అందుకే బీజేపీ కోసం వెంపర్లాట

- పవన్–చంద్రబాబు ఎత్తుగడలు
- రాజమహేంద్రవరం ఎంపీ భరత్



రాజమహేంద్రవరం రూరల్: సింహం లాంటి జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తే భయమని టీడీపీ, జనసేనకు భయమని.. అందుకే ఆ రెండు పార్టీలు బీజేపీతో పొత్తుకు వెంపర్లాడుతున్నాయని రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటనపై బుధవారం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ.. బీజేపీ నేతలు ఆహ్వానించకపోయినా చంద్రబాబు, పవన్ బీజేపీ కార్యాలయ గేట్ల వద్ద గంటలు, రోజుల తరబడి వేచి ఉండటం అలవాటైనన్నారు. బీజేపీ అగ్రనాయకత్వం అంత త్వరగా పొత్తుకు అంగీకరిస్తుందని అనుకోవడం లేదని చెప్పారు. గతంలో మోదీ, అమిత్ షాపై ఎంతటి దుర్గార్గపు వ్యాఖ్యలు చేశారో దుష్టనేత చంద్రబాబు మర్చిపోయినా బీజేపీ పెద్దలు మర్చిపోతారని అనుకోవడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ 75 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేసి విజయ దుందుభి మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కచ్చితంగా జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం ఖాయమని భరత్ స్పష్టం చేశారు.

తహసీల్దార్ కుటుంబానికి సర్కారు అండ

రూ.50 లక్షల పరిహారం, ఒకరికి జాబ్

విశాఖ సిటీ: విశాఖపట్నంలో ఇటీవల హత్యకు గురైన తహసీల్దార్ రమణయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఆయన కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ప్రకటించింది. అలాగే, కుటుంబంలో ఒకరికి కారుణ్య ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించింది. విశాఖ రూరల్ తహసీల్దారుగా పనిచేసిన రమణయ్యను గత శుక్రవారం కొమ్మాదిలో ఆయన ఉంటున్న అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఒక రియల్టర్ రాడ్డుతో తలపై బాది హత్య చేసిన సంగతి తెలిసిందే. చెన్నై పారిపోయిన నిందితుడు మురారి సుబ్రహ్మణ్యం గంగారావును విశాఖ పోలీసులు అక్కడికి వెళ్లి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

26 నుంచి జర్నలిస్ట్ ఓపెన్ క్రికెట్ టోర్నీ

సాక్షి, అమరావతి: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయిలో జర్నలిస్టు ఓపెన్ క్రికెట్ టోర్నీని ఈ నెల 26 నుంచి మార్చి 3వ తేదీ వరకు అనంతపురంలో నిర్వహిస్తున్నట్టు ఏపీ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు రామలింగారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వర్కింగ్ జర్నలిస్టులు ఈ టోర్నమెంట్లో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణలో పనిచేస్తున్న స్పోర్ట్స్ జర్నలిస్టులకు ప్రత్యేక ఎంట్రీ ఉంటుందని తెలిపారు. జిల్లాకు ఒకే జట్టు అనే నిబంధన లేదని పేర్కొన్నారు.

ప్రముఖ సంస్థలకు ఏపీఎస్‌పీఎఫ్ భద్రత పెంచాలి

ఏపీఎస్‌పీఎఫ్ అధిపతి త్రివిక్రమ వర్మ ఆదేశం



స్పోర్ట్స్ కిట్‌ను పంపిణీ చేస్తున్న త్రివిక్రమ వర్మ

సాక్షి, అమరావతి: ఎయిర్‌పోర్టులు, ఏపీ జెన్‌కో స్టేషన్లు, సెక్రటేరియట్, హైకోర్టు వంటి ప్రముఖ సంస్థలకు భద్రతను పెంచాలని ఏపీఎస్‌పీఎఫ్ అధిపతి త్రివిక్రమ వర్మ ఆదేశించారు. బుధవారం ఏపీఎస్‌పీఎఫ్ హెడ్ క్వార్టర్‌లో కమాండెంట్స్, యూనిట్ ఆఫీసర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెక్యూరిటీని బలోపేతం చేసి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం 'ఆడుదాం ఆంధ్రా'లో భాగంగా క్రీడాపోటీల్లో విజయం సాధించిన ఏపీఎస్‌పీఎఫ్ క్రీడాకారులను అభినందించారు. త్వరలో వాలీబాల్ కిట్లను కొనుగోలు చేసి విజయవాడ, రాజమండ్రి, తిరుపతి జోన్‌ల పరిధిలోని అన్ని ఏపీఎస్‌పీఎఫ్ యూనిట్లకు పంపుతామని తెలిపారు. ఈ సమావేశంలో జోనల్ కమాండెంట్స్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఢిల్లీ ఎందుకు వెళ్లారో మాకు తెలీదు

ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి



గుంటూరు మెడికల్: చంద్రబాబు ఎందుకు ఢిల్లీ వెళ్లారో తమకు తెలియదని, పొత్తుల వ్యవహారం పార్టీ అగ్రనాయకత్వం చూసుకుంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం గుంటూరు రైల్వేస్టేషన్‌లో అయోధ్యకు రామభక్తులతో బయలుదేరిన రైలును ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ..ఎప్పుడు, ఎవరితో భేటీ అవ్వాలో, పొత్తులు ఎవరితో పెట్టుకోవాలో తమ అగ్రనాయకత్వం చూసుకుంటుందని చెప్పారు. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో జరిగే వ్యవహారాలపై తమకు అవగాహన ఉండదని, అలాంటి విషయాలపై స్పందించడం సరికాదన్నారు. షర్మిలకు ప్రత్యేక హోదా గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ముందు ప్రత్యేక హోదా అంటే ఏంటో తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

భూ యాజమాన్య హక్కుల చట్టం అమలుకు

మరింత సమయం

- ప్రస్తుతం భూముల రీ సర్వే ప్రక్రియ కొనసాగుతోంది
- సమయమిస్తే పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తాం
- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: భూ యాజమాన్య హక్కుల చట్టం అమలుకు మరింత సమయం పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ప్రస్తుతం భూముల రీ సర్వే కార్యక్రమం జరుగుతోందని, సర్వే ప్రక్రియ పూర్తి చేసిన తరువాతే చట్టం అమల్లోకి వస్తుందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వేలూరి మహేశ్వరరెడ్డి హైకోర్టుకు నివేదించారు. చట్టం ఇప్పటికిప్పుడు అమలయ్యే పరిస్థితి లేదని, కౌంటర్ దాఖలుకు మరింత సమయం కావాలని అభ్యర్థించారు. మహేశ్వరరెడ్డి వాదనతో సంతృప్తి చెందిన హైకోర్టు.. ఒకవేళ ఈలోగా ప్రభుత్వం చట్టాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటే, పిటిషనర్లు ఆ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకురావొచ్చని వెసులుబాటు కల్పించింది. అయితే ప్రభుత్వం చెప్పిన వివరాలను రికార్డ్ చేయాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు పట్టుబట్టగా.. హైకోర్టు అందుకు నిరాకరించింది. కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి మరింత సమయం మంజూరు చేసింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్పష్టమైన ఆదేశాలిచ్చినా.. ఎందుకీ ఆందోళన!

భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలైన విషయం తెలిసిందే. వీటిపై సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదుల్లో ఒకరైన సీనియర్ న్యాయవాది కలిగినీడి చిదంబరం వాదనలు వినిపిస్తూ.. భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని ఇప్పటికిప్పుడు అమలు చేయబోమని గత విచారణ సమయంలో అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ హామీ ఇచ్చారని, అప్పుడు ఆ హామీని రికార్డ్ చేయలేదని అన్నారు. ఏజీ హామీని రికార్డ్ చేయాలని ఆయన ధర్మాసనాన్ని కోరారు. ఆస్తి వివాదాలకు సంబంధించిన దావాలను విచారణ నిమిత్తం తీసుకోవాలని కింది కోర్టులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, అయినా ఆందోళన ఎందుకని ధర్మాసనం ప్రశ్నించింది. చట్టాన్ని అమలు చేసే విషయంలో ప్రభుత్వం ముందుకెళుతోందని, అందువల్ల సంబంధిత జీవోలపై స్టే విధించాలని కోరారు. అసలు చట్టం అమలు ప్రస్తుతం ఏ దశలో ఉందని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. చట్టం అమలుకు నిబంధనలు అవసరమని, ఇప్పటివరకు నిబంధనల రూపకల్పనే జరగలేదని తెలిపారు. కౌంటర్ దాఖలుకు మరింత సమయం ఇవ్వాలని కోరారు. ఇందుకు ధర్మాసనం అంగీకరిస్తూ విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో యునిసెఫ్ సహకారం అవసరం

యునిసెఫ్ ప్రతినిధులతో భేటీలో సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి



యునిసెఫ్ ప్రతినిధులతో మాట్లాడుతున్న జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో యునిసెఫ్ సహకారంతో అమలవుతున్న వివిధ పథకాలపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. చిన్నారుల విద్యపై అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, సీడీపీవోలకు అవగాహన కల్పించేందుకు యునిసెఫ్ రూపొందించిన ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సును సీఎస్ ప్రారంభించారు. జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన వివిధ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో యునిసెఫ్ సహకారం అవసరం ఉందని, ఆ దిశగా తగిన తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు. యునిసెఫ్ చీఫ్ ఫీల్డ్ అధికారి జీలలెం బి.టాఫ్సే మాట్లాడుతూ.. రాష్ట్రంలో చిన్నారుల సంక్షేమానికి అద్భుతమైన చర్యలు తీసుకుంటోందని అభినందించారు. చిన్నారులు మహిళలకు సంబంధించిన నిర్దేశిత సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో యునిసెఫ్ రాష్ట్ర ప్రభుత్వానికి తోడ్పాటు అందిస్తుందని చెప్పారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్‌జైన్, బి.రాజశేఖర్, డైరెక్టర్ జనరల్ ఏపీ హెచ్ఆర్డీఐ ఆర్‌పీ సిసోడియా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, ప్రణాళికా శాఖ కార్యదర్శి ఎం.గిరిజాశంకర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ జి.చంద్రుడు, గ్రామ వార్డు సచివాలయాల డైరెక్టర్ హెచ్ఎం ధ్యానచంద్ర పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలపై ఫిర్యాదు చేస్తా

కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

కందుకూరు: తాను టీడీపీ నేత లోకేశ్‌ను కలిసినట్టు అసత్య ప్రచారం చేస్తున్న వారిపై డీఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్టు కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి చెప్పారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. తనపై కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని, కొంతమంది సోషల్ మీడియాలో ఫార్వర్డ్ చేస్తున్నారని చెప్పారు. డీఎస్పీని కలిసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తానని, కేసు నమోదు చేయిస్తానని తెలిపారు. తాను అసెంబ్లీకి వెళ్తున్నానని, లేకపోతే కందుకూరులో జనాలకు కనిపిస్తూనే ఉన్నానని చెప్పారు. కావాలనే కొందరు తన వ్యక్తిగత ఇమేజ్‌ను దెబ్బతీసేలా ఇలాంటి ప్రచారాలు చేయడం తగదన్నారు. లోకేశ్‌ను కలవాలనే ఆలోచన కూడా తనకు లేదని ఆయన స్పష్టం చేశారు.

న్యాయవాదులు సమ్మె విరమించాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

న్యాయవాదుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ తాము మధ్యంతర ఉత్తర్వులిచ్చినా.. జిల్లాల్లో న్యాయవాదులు ఇప్పటికీ సమ్మె చేస్తూ ఆందోళనలు కొనసాగించడమేంటని హైకోర్టు ప్రశ్నించింది. సమ్మె చేస్తున్న న్యాయవాదుల విషయంలో ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారు, ఇకపై ఏం చర్యలు తీసుకోబోతున్నారో స్పష్టంగా తెలియచేస్తూ కౌంటర్లు దాఖలు చేయాలని బీసీఐ, రాష్ట్ర బార్ కౌన్సిల్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 14కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. న్యాయవాద వృత్తిలో ఉన్న వారిలో అనేక మంది పేదలున్నారని, ఏ రోజుకు ఆ రోజు సంపాదించుకుని బతుకుతున్నారని, సమ్మె వల్ల వారి జీవనోపాధి దెబ్బతింటుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. యువ న్యాయవాదులు కూడా నష్టపోతారని తెలిపింది. ప్రభుత్వ చట్టంపై అభ్యంతరాలుంటే న్యాయ పోరాటం చేయాలే తప్ప సమ్మె పరిష్కారం కాదంది. ఇప్పటివరకు చేసింది చాలని, ఇక సమ్మె ఆపి తీరాల్సిందేనని తేల్చి చెప్పింది. అవసరమైతే ఈ దిశగా ఆదేశాలిస్తామంది. ఈ విషయంలో తమకు మరో మార్గం లేదని స్పష్టం చేసింది. సమస్యకు సమ్మె ఎంత మాత్రం పరిష్కారం కాదంది. వ్యవస్థ నడవడమే తమకు ముఖ్యమంది. సమ్మె చేస్తున్న న్యాయవాద సంఘాలతో చర్చలు జరిపి, సమ్మె విరమించేలా చూడాలని బార్ కౌన్సిల్‌ను ఆదేశించింది.

కక్షిదారుల ఇక్కట్లు

సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా న్యాయవాద సంఘాలు సమ్మెకు పిలుపునిస్తూ కోర్టు విధులను బహిష్కరిస్తున్నాయని, దీనివల్ల కక్షిదారులు ఇబ్బంది పడుతున్నారంటూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా యోగేష్ వాదనలు వినిపిస్తూ.. కింది కోర్టుల్లో న్యాయవాదులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో 8.64 లక్షల సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంది. సమ్మె చేస్తున్న న్యాయవాదుల విషయంలో మీ పాత్ర ఏమిటని రాష్ట్ర బార్ కౌన్సిల్‌ను ప్రశ్నించింది. దీనికి బార్ కౌన్సిల్ తరఫు న్యాయవాది జి.వెంకటరెడ్డి స్పందిస్తూ.. సమ్మె చేస్తున్న అన్ని న్యాయవాద సంఘాలకు బార్ కౌన్సిల్ కార్యదర్శి సర్క్యులర్‌లు పంపి, సమ్మె విరమించాలని పలుమార్లు విజ్ఞప్తి చేశారని తెలిపారు. మరి మీ సమ్మె విషయంలో మీ ఆదేశాలను పాటించకుంటే ఏం చర్యలు తీసుకున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. న్యాయవాదులపై చర్యలు తీసుకున్నారా? తీసుకోకుంటే ఎందుకు తీసుకోలేదు? చర్యలు తీసుకునే ఉద్దేశం ఉందా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

చర్చలు ఫలించకుంటే చర్యలు తీసుకుంటాం

అన్ని న్యాయవాద సంఘాలను చర్చలకు ఆహ్వానించామని వెంకటరెడ్డి చెప్పారు. ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ధర్మాసనం.. సర్క్యులర్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారా అని ప్రశ్నించింది. ఎప్పుడు సర్క్యులర్లు ఇచ్చారు? ఏం చర్యలు తీసుకోబోతున్నారో చెప్పాలని ధర్మాసనం స్పష్టం చేసింది. కొంత గడువునిస్తే పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని వెంకటరెడ్డి చెప్పారు. మరి మీ సంగతేంటని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యాయవాదిని ప్రశ్నించింది. క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సింది రాష్ట్ర బార్ కౌన్సిలేనని బీసీఐ న్యాయవాది కుంచెం మహేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ చర్యలు తీసుకోకుంటే మీరు చర్యలు తీసుకోరా? అని ధర్మాసనం ప్రశ్నించింది. రాష్ట్ర బార్ కౌన్సిల్ చర్యలు తీసుకోకుంటే అప్పుడు తాము రంగంలోకి దిగుతామని మహేశ్వరరావు తెలిపారు. ఒరిస్సాలో కూడా సమ్మె చేస్తున్న 42 మంది న్యాయవాదులను సస్పెండ్ చేశామని వివరించారు. న్యాయవాదులు న్యాయబద్ధమైన వాటి కోసం ఆందోళనలు చేస్తున్నారా? లేదా? చూస్తామని మహేశ్వరరావు తెలిపారు. రూ.20 వెల్ఫేర్ స్టాంపు విషయంలో బార్ కౌన్సిల్ నిర్ణయంపై, భూ యాజమాన్య హక్కుల చట్టంపై న్యాయవాదులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. భూ యాజమాన్య హక్కుల చట్టం వచ్చిన నేపథ్యంలో ఆస్తి వివాదాల దావాలను తిరస్కరించవద్దని కింది కోర్టును ఆదేశిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చిందని చెప్పారు. అలాగే రూ.20 వెల్ఫేర్ స్టాంపు విషయంలో ప్రభుత్వ చట్ట సవరణ చేసి, జీవో జారీ చేసిందన్నారు. ఇప్పుడు ఎలాంటి సమస్యా లేదని వివరించారు. మరలాంటప్పుడు సమ్మె ఎందుకు కొనసాగిస్తున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. ఇప్పటివరకు జరిగింది చాలని, వెంటనే సమ్మె విరమించాలని న్యాయవాదులను ఆదేశించింది.

రుణాలు ఎగ్గొట్టి మా వద్దకా?

- ఎంపీ రఘురామపై తెలంగాణ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- రుణ ఎగవేతదారుల కోసం మా విచక్షణను వినియోగించం
- సింగిల్ జడ్జి తీర్పుపై మేం జోక్యం చేసుకోం
- ఆర్ఈసీ సర్క్యులర్‌పై రివ్యూ కమిటీకే వెళ్లండి



సాక్షి, హైదరాబాద్: దాదాపు రూ.వెయ్యి కోట్లు రుణాలను తీసుకుని ఎగ్గొట్టిన కేసులో ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు తెలంగాణ హైకోర్టు గట్టి షాక్‌నిచ్చింది. రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఈసీ) తనను ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారుడిగా ప్రకటించటాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన ఎంపీ రఘురామకృష్ణంరాజునుద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేసింది. తమ విచక్షణాధికారాలను ఇలాంటి రుణ ఎగవేతదారులకోసం వినియోగించడానికి సిద్ధంగా లేమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దీనిపై మూడు వారాల్లో రివ్యూ కమిటీని ఆశ్రయించాలని, చట్టానికి అనుగుణంగా కమిటీ తగిన నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాల్లో తాము జోక్యం చేసుకునేందుకు ఎలాంటి కారణం కనిపించడం లేదని పేర్కొంది.

రూ.500 కోట్లు దారి మళ్లింపు

తమిళనాడులోని టుటికోరిన్ జిల్లా సత్తాంకుళం తాలూకా సత్తావినల్లూరు, పల్లక్కురిచి గ్రామాల్లో 660 మెగావాట్ల బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం ఇందు భారత్ పవర్‌కు రూ.2,655 కోట్ల రుణాన్ని ఆర్ఈసీ మంజూరు చేసింది. పనులు పరిశీలిస్తూ దశల వారీగా ఈ మొత్తాన్ని ఇస్తామని పేర్కొంది. 2014లో ఈమేరకు రూ.947.71 కోట్ల రుణాన్ని అందచేసింది. ఆ సమయంలో రఘురామకృష్ణంరాజు, ఆయన సతీమణి రమాదేవి ఇందు భారత్ డైరెక్టర్లుగా ఉన్నారు. అయితే ఇందులో దాదాపు రూ.500 కోట్లను ఇందు భారత్ ఇతర కంపెనీల్లోకి మళ్లించినట్లు ఆర్ఈసీ గుర్తించింది. దీంతో తదుపరి విడుదల కావాల్సిన రుణాన్ని నిలిపివేసి ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారుడిగా ప్రకటించింది. 2015 ఆర్బీఐ మాస్టర్ సర్క్యులర్ ప్రకారం ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారుల బ్యాంక్ ఖాతాలను సీజ్ చేసింది. ఈ సర్క్యులర్ జారీ చేస్తే ఇతర ఏ బ్యాంకులూ రుణ ఎగవేతదారులకు ఎలాంటి రుణాలు ఇచ్చే అవకాశం ఉండదు.

అన్ని అవకాశాలు ఇచ్చాకే పిటిషనర్లకు సర్క్యులర్

తమను రుణ ఎగవేతదారులుగా గుర్తించి 2022 జూన్ 16న సర్క్యులర్ జారీ చేయడాన్ని, క్రిమినల్ కేసు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ రఘురామకృష్ణంరాజు, రమాదేవి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి అన్ని అవకాశాలు ఇచ్చిన తర్వాతే ఆర్ఈసీ కమిటీ పిటిషనర్లకు సర్క్యులర్ జారీ చేసిందని స్పష్టం చేశారు. చట్టప్రకారమే ఆర్ఈసీ వ్యవహరించిందని, ఆ సర్క్యులర్‌లో జోక్యం చేసుకునేందుకు తమకు ఎలాంటి కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేస్తూ రఘురామకృష్ణంరాజు, రమాదేవి పిటిషన్లను కొట్టి వేశారు. ఆర్ఈసీ రుణం మంజూరు చేసే నాటికి పిటిషనర్లు ఇద్దరూ డైరెక్టర్లుగా ఉన్నారన్న వాదనతో ఏకీభవించారు. సింగిల్ జడ్జి తీర్పుపై పిటిషనర్లు ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు వెలువరించింది. సింగిల్ జడ్జి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తీర్పునిచ్చారని, అందులో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. రివ్యూ కమిటీని ఆశ్రయించకుండా తమ వద్దకు రావడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. రివ్యూ కమిటీ చట్టప్రకారం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేస్తూ రఘురామకృష్ణంరాజు, రమాదేవి, డి.మధుసూదన్‌రెడ్డి అప్పీళ్లలో వాదనలను ముగించింది.

మీరెలా చెబితే అలా..!

లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పంపకాలపై బీజేపీ అగ్ర నేతలతో చంద్రబాబు

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో సుపరిపాలన అందిస్తూ పూర్తిస్థాయిలో ప్రజాదరణ పొందిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి టీడీపీ అధినేత చంద్రబాబు నానా తంటాలు పడుతున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తే పుట్ట గతులుండవని తేలిపోవడంతో ఇప్పటికే జనసేన పార్టీతో పొత్తు పెట్టుకున్నారు. ఆ బలమూ సరిపోకపోవడంతో బీజేపీ కాళ్లపై పడ్డారు. బుధవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో ఢిల్లీ వచ్చారు. బుధవారం రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. ఎలాగైనా బీజేపీతో పొత్తు కుదుర్చుకోవాలన్న భావనతో సీట్ల సర్దుబాటులో వారెలా చెబితే అలా చేస్తానని చెప్పారు. రాత్రి ఏడున్నర గంటలకే ఈ భేటీ ఉంటుందని ప్రచారం జరిగినా, రాత్రి 11.30 గంటలకు అమిత్ షా నివాసంలో సమావేశమయ్యారు. సుమారు అరగంట పాటు జరిగిన ఈ భేటీలో ప్రధానంగా ఎన్నికల్లో పొత్తులు, సీట్ల సర్దుబాటు, బీజేపీకి అందించే సహకారం వంటి అంశాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం తనకు పూర్తి సహకారం అందిస్తే బీజేపీ ఎలా చెబితే అలా నడుచుకుంటానని బాబు స్పష్టం చేసినట్లు తెలిసింది. పార్టీ బలంగా ఉన్న చోట సైతం త్యాగాలు చేసేందుకు సిద్ధపడతాననే హామీ ఇచ్చినట్లుగా చెబుతున్నారు.

హోటల్‌లో రహస్య భేటీ

కాగా ఢిల్లీ చేరుకున్న వెంటనే చంద్రబాబు నేరుగా పార్టీ ఎంపీ గల్లా జయదేవ్ నివాసానికి వెళ్తారని అందరూ భావించారు. అయితే, బాబు అక్కడికి కాకుండా లీ మెరిడియన్ హోటల్‌కు వెళ్లారు. ఆయన వెంట ఉన్న ఎంపీలు కనకమేడల రవీంద్ర కుమార్, రఘురామకృష్ణంరాజు, ఇతర నేతలు హోటల్ లాబీల్లోనే ఉండిపోయారు. బాబు ఒక్కరే హోటల్లోకి వెళ్లారు. గంటన్నర తర్వాత బయటకు వచ్చారు. చంద్రబాబు హోటల్‌లో ఎవరితో అంత రహస్యంగా భేటీ అయ్యారో టీడీపీ ఎంపీలు, ఇతర నేతలకు కూడా తెలియలేదు. హోటల్ నుంచి గల్లా ఇంటికి వెళ్లారు. అక్కడ బాబుతో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు భేటీ అయ్యారు.

ముందే రాయబారం నడిపిన సీఎం రమేశ్, కంభంపాటి

కాగా అమిత్‌షాతో చంద్రబాబు భేటీ, పొత్తులపై బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ నేత కంభంపాటి రామ్మోహన్‌రావు ముందుగానే రాయబారం నడిపారు. వారు మంగళవారమే అమిత్‌షాను ప్రత్యేకంగా కలిశారు. టీడీపీతో పొత్తు పెట్టుకుంటే లాభించే అంశాలపై వివరణ ఇచ్చారు. పొత్తు కుదిరిన పక్షంలో ఎలాంటి షరతులకైనా బాబు సిద్ధంగా ఉన్నారనే సంకేతాలు ఇచ్చారు. దీంతో బాబుతో భేటీకి బీజేపీ అగ్రనేతలు అంగీకరించినట్లు సమాచారం.

పొత్తులతో ప్రయోజనం ఏమిటి?

ఈ చర్చల్లో పొత్తుతో బీజేపీకి లాభించే అంశాలు, ఓట్ల బదిలీ అవకాశాలు, జనసేన పార్టీ బలాబలాలు వంటి అంశాలపై బీజేపీ పెద్దలు ఆరా తీసినట్లు తెలిసింది. రాష్ట్రంలో వైసీపీ బలంగా ఉందని తమ నివేదికలు చెబుతున్నాయని, ఈ నేపథ్యంలో పొత్తులతో ఒనగూరే ప్రయోజనాలు ఏమిటన్న ప్రశ్నలనే నేతలు లేవనెత్తినట్లు సమాచారం. కచ్చితంగా పొత్తు అవసరమైతే బీజేపీకి 6 నుంచి 8 ఎంపీ సీట్లు, 25 వరకు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని, అప్పుడే ఇరు పార్టీలకు ప్రయోజనకరంగా ఉంటుందని అమిత్‌షా, నడ్డా స్పష్టం చేసినట్లు సమాచారం. అయితే బీజేపీకి ఆ స్థాయిలో అభ్యర్థులు లేరని, 10 నుంచి 15 స్థానాల వరకైతే అభ్యంతరం ఉండబోదని బాబు చెప్పినట్లుగా తెలిసింది. లోక్‌సభ స్థానాల్లో 5 లేదా 6 బీజేపీకి ఇచ్చేందుకు బాబు సిద్ధపడినట్లు తెలిసింది. పొత్తులకు అంగీకరిస్తే ఎలాంటి షరతులకైనా తాను సిద్ధమని బాబు అన్నట్లు సమాచారం. రెండు పార్టీలకు సమాన లబ్ధి చేకూరే పక్షంలోనే పొత్తులు ఉంటాయని బీజేపీ అగ్రనేతలు స్పష్టంగా చెప్పినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో కూడా చర్చించిన అనంతరం పొత్తులు, సీట్ల సర్దుబాటుపై కబురు చేస్తామని వారు బాబుకు చెప్పినట్లు సమాచారం.

ఏపీలో 'గ్లోబల్ సైన్స్ ఫెయిర్' నిర్వహించే యోచన

- సమగ్ర శిక్ష ఏపీ ఎస్పీడీ బి.శ్రీనివాసరావు
- కేరళలో పర్యటించిన ఏపీ బృందం



కేరళలో గ్లోబల్ సైన్స్ ఫెయిర్‌లో ఏపీ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన తొలి గ్లోబల్ సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుందని సమగ్ర శిక్ష ఏపీ ఎస్పీడీ బి.శ్రీనివాసరావు చెప్పారు. సైన్స్ ప్రచారం కోసం కేరళ ప్రభుత్వం ఆహ్వానం మేరకు ఆయన నేతృత్వంలో ఈ విభాగం సలహాదారు రామ్‌కమల్, సైన్స్ అధికారులు అరుణ, శివ నాగేశ్వరరావు, ఎఫ్ఎల్ఎన్ ప్రతినిధి కేఆర్ఎం ప్రతిష్ఠ, సోనాలి సింగ్‌తో కూడిన ప్రతినిధి బృందం బుధవారం సైన్స్ ఫెయిర్‌కు హాజరైంది. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్‌లో సౌర వ్యవస్థ, మానవ శరీర నిర్మాణం, జంతుజాలం తదితర అంశాలతో పాటు నాసా ఏర్పాటు చేసిన 360 డిగ్రీల్లో చూసేలా గ్లోబ్, మెదడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. ఈ ప్రదర్శన ప్రత్యేకత, నైపుణ్యాలు, ఏర్పాటు విధానంపై కేరళ నిర్వాహకులతో చర్చించామన్నారు. ఏపీలో కూడా ఈ తరహా సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామని, సైన్స్‌పై విద్యార్థుల్లోను, ఉపాధ్యాయుల్లో అభిలాష పెరుగుతుందన్నారు. కేరళ పర్యటనలో భాగంగా ఏపీ ప్రతినిధులు పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సందర్శించారు. కేరళ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాలను పరిశీలించారు.

వాస్తవ ఘటనల సమాహారమే యాత్ర–2

- గత 15 ఏళ్ల రాజకీయ పరిణామాలతో చక్కగా తెరకెక్కించారు
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి
- విజయవాడలో ప్రత్యేక ప్రదర్శనను తిలకించిన నేతలు




యాత్ర–2 ప్రదర్శనను తిలకించిన అనంతరం మంత్రులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న సజ్జల

సాక్షి, అమరావతి/పటమట (విజయవాడ తూర్పు)/విజయవాడ స్పోర్ట్స్: గత 15 ఏళ్లలో రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమే యాత్ర–2 అని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జీవితంలో రాజకీయ ఒడుదుడుకులను, భావోద్వేగాలను చక్కగా చూపారని వెల్లడించారు. విజయవాడ ట్రెండ్‌సెట్ మాల్‌లోని క్యాపిటల్ సినిమాస్‌లో బుధవారం రాత్రి యాత్ర–2 చిత్రం ప్రత్యేక ప్రదర్శనను పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ కీలక నేతలతో కలిసి సజ్జల వీక్షించారు. అనంతరం ఈ చిత్రంపై తన అభిప్రాయాన్ని మీడియాతో పంచుకున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర నేపథ్యంలో వచ్చిన యాత్ర–1కు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. మహానేత మనందరికీ దూరమయ్యాక రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలను యాత్ర–2లో అద్భుతంగా తెరకెక్కించారని తెలిపారు. మన కళ్ల ముందే జరిగిన, మనకు తెలిసిన రాజకీయ వాస్తవాలను ఈ చిత్రం ద్వారా తెలుసుకుని భావోద్వేగానికి గురయ్యానన్నారు. 2014 వరకు రాష్ట్రం, దేశంలో అధికారంలో ఉన్న పార్టీ, రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న పార్టీ కలిసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎలాంటి కుట్రలు చేశాయో.. ఆ కుట్రలను జగన్ ఎలా ఛేదించి ప్రజా నాయకుడిగా ఎదిగారో ఈ చిత్రం కళ్లకు కట్టిందన్నారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే అసలైన రాజకీయమని సీఎం జగన్‌ను చూపించిన తీరు అద్భుతంగా ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం రాష్ట్రం ఏ విధంగా ఛిన్నాభిన్నం అయిందో, చేసిన కుట్రలు, కుతంత్రాలు, ప్రజలకు చేసే మంచిని నిరోధించడానికి టీడీపీ, కాంగ్రెస్ ఎలా కలిశాయో ఈ చిత్రంలో చూపారని తెలిపారు. యాత్ర–2 ప్రత్యేక ప్రదర్శనకు డిప్యూటీ సీఎంలు కొట్టు సత్యనారాయణ, పీడిక రాజన్నదొర, మంత్రి మేరుగు నాగార్జున, ఎంఎల్ఏలు హఫీజ్‌ఖాన్, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మల్లాది విష్ణు, అన్నా రాంబాబు, నాగార్జునరెడ్డి, కంగాటి శ్రీదేవి, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, వరుదు కళ్యాణి తదితరులు హాజరయ్యారు.



యాత్ర–2 ప్రత్యేక ప్రదర్శనను తిలకిస్తున్న నేతలు



మనిషి భయపడవలసింది మృత్యువుకు కాదు. ఎప్పటికీ జీవించడం మొదలుపెట్టనందుకు భయపడాలి.

– మార్కస్ అరేలియస్

సాక్షి

గురువారం, 8 ఫిబ్రవరి 2024

పాక్‌లో ఎన్నికల ప్రహసనం

సైన్యం పడగనీడలో ఎన్నికల తంతుకు పాకిస్తాన్ సిద్ధమైంది. జాతీయ అసెంబ్లీకి గురువారం జరిగే పోలింగ్‌లో గెలిచేదెవరో ఎవరూ నిర్ధారణగా చెప్పలేకపోతున్నారు. అయితే ఎప్పటిలాగే అక్కడ ప్రజాస్వామ్యం ఓటమి పాలవటం ఖాయమన్నది విశ్లేషకుల జోస్యం. 2018లో జరిగిన ఎన్నికల్లో కేవలం తన దయాదాక్షిణ్యాలతో అధికారంలోకొచ్చి తననే ధిక్కరించిన మాజీ క్రికెటర్, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌పై సైన్యం ఆగ్రహంతో వుంది. ఫలితంగా పదవి కోల్పోయి రెండు అవినీతి కేసుల్లో పదేళ్లు, పద్నాలుగేళ్ల చొప్పున శిక్షపడి ఆయన జైలుపాలయ్యారు. చట్టవిరుద్ధంగా పెళ్లాడిన కేసులో మరో ఏడేళ్ల శిక్ష కూడా పడింది. భార్య సైతం ఈ కేసులో జైలుకు పోయారు. ఎలాగైతేనేం సకాలంలోనే ఎన్నికల తంతు మొదలైంది. ఇమ్రాన్ స్థాపించిన పాకిస్తాన్ తెహ్రీకే ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ ఏటికి ఎదురీదుతోంది. పీటీఐకి న్యాయస్థానాల పుణ్యమా అని బ్యాట్ గుర్తు గల్లంతుకాగా, పార్టీ అభ్యర్థులంతా ఇండిపెండెంట్లుగా బరిలో వున్నారు. పీటీఐ అభ్యర్థినని చెప్పుకున్నవారిని సైన్యం అరెస్టు చేసింది. వారి ఇళ్లపై దాడులకు తెగబడింది. అభ్యర్థులు నామినేషన్ వేసిన వెంటనే అజ్ఞాతంలోకి పోగా, ప్రచారంలో పాల్గొంటున్న అభ్యర్థుల కుటుంబాలకు సైతం వేధింపులు తప్ప లేదు. కొందరు అభ్యర్థులు పీటీఐతో తెగదెంపులు చేసుకున్నామని ప్రకటించి, బతుకుజీవుడా అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. దేశ రాజధాని ఇస్లామాబాద్‌లో మొన్న జరిగిన పీటీఐ ఎన్నికల ప్రచారసభలో వేదికపై రెండు డజన్లమంది బిక్కుబిక్కుమని కూర్చోగా, ఆ సభకు కనీసం మైక్ పెట్టుకునేందుకు కూడా అనుమతి ఇవ్వలేదనీ, పోస్టర్లు వేయనీయలేదనీ 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక కథనం. యథాప్రకారం ఇక్కడి అభ్యర్థి కూడా కేసుల్లో చిక్కుకుని పరారీలో వున్నాడు. ఇమ్రాన్ ఖాన్‌ను అందలం ఎక్కించిన 2018 నాటి ఎన్నికల్లో కూడా ఆయన ప్రత్యర్థులను సైన్యం వేధించిందిగానీ, పాక్ 76 ఏళ్ల చరిత్రలో ఇంతటి అణచివేత ఎప్పుడూ లేదని పౌరసమాజ కార్యకర్తలు చెబుతున్నారు. నిరుడు ఏప్రిల్‌లో పదవీభ్రష్టుడయ్యాక ఆయన సైన్యాన్ని తూర్పారపట్టడం మొదలెట్టారు. రాజకీయ నేతలకు సైన్యంపై ఎంతటి ఆగ్రహావేశాలున్నా దాన్ని 'అధికార వ్యవస్థ' పదం చాటున నిందించటం అలవాటు. ఇమ్రాన్ ఆ సంప్రదాయానికి స్వస్తిపలికారు. నేరుగా సైన్యాన్నీ, దాని అధినేతలనూ ఉద్దేశిస్తూ దూషించారు. పైగా నిరుడు మే నెలలో ఇమ్రాన్‌కు అనుకూలంగా పీటీఐ నిర్వహించిన ర్యాలీలో హింస చోటుచేసుకుంది. ఊహకందని రీతిలో సైనిక కార్యాలయాలపైనా, సైనిక ఉన్నతాధికారుల నివాసాలపైనా యువజనం దాడులకు పాల్పడ్డారు. ఇవన్నీ సైన్యానికి ఆగ్రహం కలిగించాయి. తమ దయతో అందలం ఎక్కినవాడు తమనే సవాలు చేయటం సైనికాధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు.

రంగంలో వున్న రెండు ప్రధాన పక్షాలు– మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ముస్లిం లీగ్ (పీఎంఎల్–ఎన్), మాజీ ప్రధాని బేనజీర్ భుట్టో కుమారుడు బిలావల్ భుట్టో ఆధ్వర్యంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) మాత్రం స్వేచ్ఛగా ప్రచారం చేసుకోగలిగాయి. ఈ రెండు పార్టీల మధ్యనే ప్రధాన పోటీవుండటం ఆనవాయితీ. ఇమ్రాన్ సారథ్యంలోని పీటీఐ నెగ్గిన 2018 ఎన్నికలొక్కటే దీనికి మినహాయింపు. చెప్పాలంటే ఇతరులకన్నా పీపీపీ చాలా ముందుగా ఎన్నికల బరిలోకి దిగింది. విస్తృతంగా ప్రచారం చేసింది. మొదట్నుంచి బలంగా వున్న సింధ్ ప్రాంతంలో ఈసారి ఆ పార్టీ బలహీనపడింది. ప్రచారావకాశాలు బొత్తిగా లేని పీటీఐకి యువత బలమైన శక్తిగా వున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా వారు సాగిస్తున్న ప్రచారం రెండు పార్టీలనూ బెంబేలెత్తిస్తున్నది. పాకిస్తాన్‌లో మరీ ముఖ్యంగా... బలూచిస్తాన్, ఖైబర్ ఫక్తుంఖ్వాల్లో భారీయెత్తున హింస చోటుచేసుకున్నదని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకటించటాన్నిబట్టి ఈ ఎన్నికల సరళి ఎలావుందో అర్థం చేసుకోవచ్చు. మహిళా అభ్యర్థులకు ఈసారి పెద్దగా చోటు దక్కలేదని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ అంటున్నది. ఈ విషయంలో మీ సంజాయిషీ ఏమిటని పాకిస్తాన్ ఎన్నికల సంఘానికి ఆ సంస్థ తాఖీదులు పంపింది. పాకిస్తాన్ పార్లమెంటులో మహిళా కోటా 22 శాతం వుంది. దీంతోపాటు చట్టప్రకారం ప్రతి పార్టీ మహిళలకు తప్పనిసరిగా 5 శాతం స్థానాలు కేటాయించాలి. అయితే ప్రధాన పార్టీలు మూడూ ఈ విషయంలో మొహం చాటేశాయి.

ఎన్నికలు, గెలుపోటముల సంగతలావుంచితే... రాబోయే ప్రభుత్వానికి చాలా సవాళ్లున్నాయి. నిరుడు మే నెలలో పాకిస్తాన్ దాదాపు దివాలా అంచులకు చేరింది. ఆఖరి నిమిషంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) 300 కోట్ల డాలర్ల రుణం అందించి ఆదుకుంది. ఆ సాయం కూడా వచ్చే నెలాఖరుతో ఆగిపోతుంది. దాన్ని పొడిగించేలా చూసుకోవటం, అందుకు సంస్థ విధించబోయే షరతులకు తలొగ్గటం కొత్త పాలకులకు తప్పనిసరి. అధిక ధరలు, నిరుద్యోగం, పేదరికంతో సతమతమవుతున్న ప్రజానీకంలో ఇది మరింత నిరాశానిస్పృహలను రేకెత్తిస్తుంది. ప్రభుత్వ మద్దతు కోసం ఎదురుచూస్తున్న పారిశ్రామిక రంగానికి కూడా సహకారం అందకపోవచ్చు. మన దేశంతో ఆది నుంచీ పాకిస్తాన్‌ది శత్రుపూరిత వైఖరే. దీనికితోడు దశాబ్దాలుగా పాక్‌లో వుంటున్న వేలాదిమంది అఫ్గాన్ పౌరులను నిరుడు వెనక్కి పంపటంతో తాలిబన్ పాలకులతో తగాదాలు మొదలయ్యాయి. ఇవన్నీ దేశంలో మిలిటెన్సీ మరింత పెరగటానికి దోహదపడతాయి. వీటిని ఒడుపుగా ఎదుర్కొంటూ, సైన్యానికి ఆగ్రహం కలగకుండా చూసుకోవటం కొత్త పాలకులకు జీవన్మరణ సమస్య. ఇన్ని భారాలు మోసేదెవరో తాజా ఎన్నికలు తేల్చబోతున్నాయి.

నిజమైన కళకు నీరాజనాలు



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

''ప్రజా నాట్యమండలి ప్రదర్శనలు చూసిన తర్వాత, మా గండపెండేరాలను తీసి ఆ నాట్య మండలి నిర్వాహకుల, కళాకారుల ముందు సమర్పించాలనిపిస్తోంది'' అని వ్యాఖ్యానించారు విశ్వనాథ సత్యనారాయణ. నాటక, సాహిత్యాది రంగాలు ఎలా ఉంటే నిజమైన ప్రజాకళలుగా, సృజన శక్తులుగా భాసిస్తాయో 'ప్రజా నాట్యమండలి' ప్రదర్శనలు నిరూపించాయి. అయితే తెలుగునాట నాటక రంగానిది మహా వైభవోపేత చరిత్ర. అవి జనజీవితాన్ని ఎల్లెడలా ప్రభావితం చేశాయి. జీవితాన్ని ఎలా జీవించాలో చెప్పాయి. నవజీవన పరిధి విస్తృతం కావాలంటే 'ప్రశ్న' అనివార్యం అని చాటాయి. 'సమాజానికాయువైన నాటకమే శ్వాసగా జీవితాలనర్పించిన సూత్రధారులెందరో! మధురస్వర ఝరీ గమన హృద్యపద్య రాగంతో మేలుకొలుపు పాడిన గాత్రధారులెందరో!! ఆ మహానుభావులకు వందనం!!!

నాటక, సాహిత్యాది రంగాలకు చెందిన వివిధ రంగాలు ఎలా ఉంటే నిజమైన ప్రజాకళలుగా, సృజన శక్తులుగా భాసిస్తాయో 1930లలో భారత పర్యంతం వామపక్షాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఉర్రూతలూగించిన 'ప్రజా నాట్యమండలి' ప్రదర్శనలు నిరూపించాయి. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని, 'ఆంధ్ర ప్రజా నాట్యమండలి' సారథ్యంలోని 'మా భూమి' ఇత్యాది కళా రూపాలను ప్రస్తావిస్తూ మహాకవి విశ్వనాథ సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు పలువురి ప్రశంసలు అందుకున్నాయి. ''ప్రజా నాట్యమండలి ప్రదర్శనలు చూసిన తర్వాత మా గండపెండేరాలను తీసి ఆ నాట్య మండలి నిర్వాహకుల, కళాకారుల ముందు సమర్పించాలనిపిస్తోంది. ప్రజాకళలు ఎలా ఉండాలో 'మా భూమి', 'అంతా పెద్దలే' నాటకాలు నిరూపించా''యని ప్రశంసల వర్షం కురిపించారు! ఈ కితాబు నాటికీ, నేటికీ మరపురాని సందేశంగా నిలిచిపోయింది. ఆ ఒరవడిలో ముందుకు సాగి, అఖిల భారత స్థాయిలోనే ఒక విశిష్ట స్థానాన్ని పొందిన 'ఆంధ్ర ప్రజా నాట్యమండలి' రాష్ట్రీయ విశిష్ట శాఖలలో ఒకటి గుంటూరు జిల్లా 'ప్రజా నాట్యమండలి'. భారత ప్రజా నాట్య మండలికి ఆంధ్ర ప్రజానాట్య మండలి ఎలా 'ఒజ్జ బంతి' అయిందో, అలాగే గుంటూరు ప్రజా నాట్యమండలి వివిధ శాఖలతో పరిఢవిల్లింది. మానవ జీవన దర్పణంగా పలువురు ఆంధ్ర పండితుల, కవుల ఆశీస్సులతో ముందుకు సాగుతోంది.

సందేశాలు సమకాలీనం

విశ్వనాథ వారు ఎంతటి మహాకవో, అంతటి సరసుడు, 'గడగ్గాయి' కూడా! పెళ్లయి, కాపురాలకు వెళ్లబోయే నూతన దంపతులందరికీ కంటికి కనిపించినా, కనిపించకపోయినా 'అరుంధతీ' నక్షత్రాన్ని చూపడానికి మన పెద్దలు ప్రయత్నిస్తారు. కానీ విశ్వనాథను ఒకరు మీరెప్పుడైనా 'అరుంధతీ' నక్షత్రాన్ని చూశారా అని ప్రశ్నించగా... నాకైతే 'అరుంధతి కనిపించలేదుగానీ చేసిన 'అప్పులయితే' కనిపించి, వేధించాయని చమత్కరించారు.

బహుశా కొన్ని జీవితానుభవాల తర్వాత, 'చింతామణి' నాటక కర్తగా సుప్రసిద్ధుడైన మహాకవి కాళ్లకూరి... భార్యాభర్తల మధ్య ఉదాత్తమైన సంసార అవగాహన ఎలా ఉండాలో చెప్పడానికి ఒక పద్యాన్ని రాశారు. సందేశాత్మకంగా ఉండటానికి సరళమైన భాషలో రాసి మనకు అందించారు! ఆరోజుల్లో వేశ్యా లంపటత్వం వల్ల సంసార

రెండో మాట



జీవితాలు ఎలా బుగ్గిపాలవుతున్నాయో చెప్పి, ఆ వినాశం వల్ల సంసార జీవితాల్ని రక్షించడం అవసరమని భావించి కాళ్లకూరి ఆ నాటకం రాశారు! ఫలితంగా గంభీర సంసార జీవితాల అవగాహనకు ఆ పద్యం ద్వారా సమకాలీన సందేశం అందింది. కనుకనే కాళ్లకూరి రచనకు అంత విలువ పెరిగింది.

'కష్ట ఫలితంబు బహుళ దుఃఖ ప్రదంబు
సార రహితమైన సంసారమందు
భార్యయను స్వర్గమొకటి కల్పనంబు చేసె
పురుషుల నిమిత్తము పురాణ పురుషులుండు!'

ప్రశ్నించే సంస్కారం బుద్ధి జీవుల్లో పెరగనంతవరకూ మనిషికి వికాసం ఉండదని కవి మీగడ రామలింగస్వామి స్పష్టం చేస్తాడు. ఎందుకని? ఆయన మాటల్లోనే నవజీవన పరిధి విస్తృతం కావాలంటే 'ప్రశ్న' అనివార్యం అంటారు.

'ప్రశ్న మానవ విజ్ఞాన పరిధి పెంచు
ప్రశ్న లేనిదే మనిషికి ప్రగతి లేదు
ప్రశ్న యందే సకల దిశా ప్రగతి యుండు
కాన, ప్రశ్నయే వ్యక్తి వికాసమౌను' అంటారు. అంతేగాదు,

'ఈర్ష్య' అనేది ఏ కళకూ, నాటకానికీ పనికి రాదనీ, ఈర్ష్య అనారోగ్యం, హానికరమని స్పష్టం చేశారు!

ఇలా ఎన్నెన్నో దృశ్య మాలికలను 'దర్పణం' పేరిట గుంటూరు కళా పరిషత్ 1997–2022 సంవత్సరాల మధ్య కార్యక్రమాలన్నింటిని రసవత్తరమైన రచనా శైలిలో 'కళ ప్రజలది' అన్న మకుటం కింద రజతోత్సవ ప్రత్యేక సంచికగా అందించింది. 'దర్పణం' సంపాదకులు, సహ సంపాదకులు వల్లూరు శివప్రసాద్, వల్లూరు తాండవకృష్ణ అభినందనీయులు. నాటక రంగంలో ప్రజాకళలకు ప్రాధాన్యం కల్పించడంలో సుప్రసిద్ధులైన నవీన పథకులుగా ఖ్యాతి పొందిన నటశేఖరులు బళ్లారి రాఘవ, గరికపాటి రాజారావు ప్రఖ్యాతులకు ఈ ప్రత్యేక సంపుటిని అంకితమిచ్చారు. గుంటూరు కళాపరిషత్ కార్యక్రమాల ప్రత్యేక దృశ్యమాలిక ఈ సంచికకు ప్రత్యేక కళాకాంతులు అందించింది.

ఎందరో మహానుభావులు

జీవితాంతం ఆధునికులను వెన్నుతట్టి ప్రోత్సహించినవారు... కందుకూరి, తిరుపతి కవులు, చిలకమర్తి, బలిజేపల్లి, పరబ్రహ్మ పరమేశ్వరి, ఒద్దిరాజు సోదరులు, కోదాటి నరసింహం, రామరాజు, గురజాడ, బళ్లారి రాఘవ, వాసిరెడ్డి, సుంకర, ఆత్రేయ, గరికపాటి, ఆత్రేయ ఇత్యాదులు. ఇలా తెలుగు నాటక పరిణామానికి దోహదం చేసినవారి గురించి మేడిచర్ల సత్యనారాయణమూర్తి కవితాత్మకంగా కురిపించిన ప్రశంస ద్వారా దర్పణం సంచిక వైశిష్ట్యం తెలుస్తుంది.

'సమాజానికాయువైన నాటకమే శ్వాసగా
జీవితాలనర్పించిన సూత్రధారులెందరో,
మధురస్వర ఝరీ గమన హృద్యపద్య రాగంతో
మేలుకొలుపు పాడిన గాత్రధారులెందరో,
నటనకు జీవం పోసి దైవాలుగా పూజలంది
శిలారూపమందిన పాత్రధారులెందరో,
ఎవని కళకు, యువనికలకు ఊపిరినిచ్చెనో
ఈ రంగస్థలి చిత్రకారులెందరో
ఆ మహానుభావులకు వందనం
సాష్టాంగ వందనం!'

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎందుకో చెప్పాల్సింది!



సహజీవనాల పట్ల నాకేమీ సానుకూలత లేదుగానీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వం తెచ్చిన ఉమ్మడి పౌరస్మృతిలో అలాంటి బంధాల గురించి కొంచెం భిన్నంగా వ్యవహరించాల్సింది. శిక్ష అని బెదిరించే బదులు, లాభమేమిటో చెబితే బాగుండేది. చట్టబద్ధమైన ప్రయోజనాలు కావాలంటే, రిజిస్టర్ చేసుకోవాలి; లేదంటే, అవి ఉండవు; ఎంపిక మీది!

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

కఠిన వాస్తవం



బీజేపీ ఓట్లు 2009 లోని 7.8 కోట్ల నుంచి 2019లో 22.9 కోట్లకు విశేషంగా పెరిగాయి. అదే కాలానికి కాంగ్రెస్ ఓట్లు కేవలం 11.9 నుంచి 11.94 కోట్లు మాత్రమే పెరిగాయి. కొత్త ఓటర్లను ఆకర్షించలేకపోతే గెలిచే అవకాశం లేదు.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

అందుకా ఉద్యమం?



ఉత్తర భారతదేశంలో బీజేపీ ఎంత బలంగా ఉంటే, అంత బలంగా దక్షిణ భారత రిపబ్లిక్ గురించిన ఉద్యమం కొనసాగుతుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో రాజీ చర్చలు జరిపే అవకాశం కూడా ఇది దక్షిణ భారత అవినీతి నేతలకు ఇస్తుంది.

– మనూ జోసెఫ్, రచయిత

చిన్న మార్పు



ముంబయి నుంచి సినిమా పరిశ్రమను ఉత్తర ప్రదేశ్‌కు మార్చు తామని భారతీయ జనతా పార్టీ వాగ్దానం చేసింది. అదేమోగానీ వాళ్లు ఉత్తర ప్రదేశ్ శాంతి భద్రతలను మాత్రం ముంబయికి పట్టుకొచ్చారు. ప్లాన్‌లో చిన్న మార్పు అంతే!

– నరుందార్, సెటైరిస్ట్

అప్పుడే?



మాల్దీవుల ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందుల్లో ఉంది; అందుకే కొత్త అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించలేకపోతున్నామని (అధ్యక్షుడు మహమ్మద్) ముయిజ్జు చెబుతున్నారు.

– గీతా మోహన్, జర్నలిస్ట్

రామనామం



గురుగ్రంథ్ సాహిబ్(సిక్కుల పవిత్ర గ్రంథం)లో రామ్ అనే పదం 2,533 సార్లు కనిపిస్తుంది. సిక్కుల్లోని దివ్యత్వాన్ని రామ్ పదం చిత్రిస్తుంది. రామ్ అనే మాట లేకపోతే శ్రీగురుగ్రంథ్ సాహిబ్‌లో పెద్ద ఖాళీ ఏర్పడుతుంది.

– రామ్‌నిక్ సింగ్ మాన్, మిలిటరీ పరిశోధకుడు

ఇన్ బాక్స్

కర్ణాటక సంగీత పితామహుడు

'దాసరేంద్ర పురందర దాసరాయ' (దాస భక్తులలో పురందర దాసు శ్రేష్ఠుడు) అని రాజ గురువు వ్యాస తీర్థులతో ప్రశంసలు పొందిన పురందర దాసు ప్రప్రథమ కర్ణాటక సంగీత విద్వాంసుడు. అసలు పేరు 'శ్రీనివాస నాయక'. 'పురందర దాసు' క్రీ.శ. 1484లో కర్ణాటకలో శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి తాలూకా 'అరగ'లోని ఓ సంపన్న వర్తక కుటుంబంలో జన్మించాడు. సంప్రదాయ విధానంలో కన్నడ, సంస్కృతాలతో పాటు సంగీతమూ అభ్యసించిన పురందర దాసుకు 16 ఏళ్లకే సరస్వతీ బాయితో వివాహమైంది.

కాలక్రమంలో సంపదమీద ఎక్కువ ప్రేమ పెంచుకోవడం వల్ల కలిగే అనర్థం గ్రహించి తన 30వ ఏటనే సంపదనంతా త్యాగం చేసి పరమ భక్తుడై 'పురందర దాసు'గా మారి 'కర్ణాటక సంగీత పితామహుడు' అయ్యాడు. రచయితగా, వాగ్గేయకారుడిగా, పరమభక్తునిగా, హరిదాసునిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

విజయనగర సామ్రాజ్యంలో శ్రీకృష్ణదేవరాయలకు రాజ గురువైన వ్యాస తీర్థుల నుండి హరి దాస దీక్ష చేసి 'పురందర విఠల' కలం పేరుతో తన కీర్తనలన్నీ విష్ణుమూర్తికి అంకితం ఇస్తూ 'పురందర విఠలా' అనే పదం (మకుటం) తోనే ప్రతి పాటను ముగించేవాడు. తిరుపతి, శ్రీరంగం, బేలూరు, ఉడిపి, పండరీపురం లాంటి అనేక ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తూ ఆ యా దేవుళ్లపై వేలాది సంకీర్తనలను రచించాడు. అయితే సుమారు వెయ్యి సంకీర్తనలు మాత్రమే ప్రస్తుతం మనకు లభ్యమవుతున్నాయి. 'వేంకటాచల నిలయం వైకుంఠపురవాసం పంకజనేత్రం పరమపవిత్రం' అంటూ భక్తిపారవశ్యంతో తిరుమల శ్రీ వేంకటేశ్వరుణ్ణి కీర్తిస్తూ పురందరదాసు రాసిన సంకీర్తన ఎంత ప్రాచుర్యం పొందిందో మనకు తెలిసిందే.

పురందర దాసు కోసం శ్రీకృష్ణదేవరాయలు ఓ జపశాలను నిర్మించారు. అది 'హంపి'లో 'పురందర మండపం'గా వాసికెక్కింది. 1564లో పురందర దాసు కాల ధర్మం చెందాడు. ప్రతి ఏడాది పురందర దాసుని పుణ్యతిథి సందర్భంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో ఆయన ఆరాధన ఘనంగా జరుపుతారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9న ఆయన పుణ్యతిథిని పురస్కరించుకుని ఫిబ్రవరి 8 నుండి 10వ తేదీ వరకు తిరుమల ఆస్థాన మండపంలో 'టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు' ఆధ్వర్యంలో పురందరదాసుల వారి ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరుపుతున్నారు.

– డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ , విశాఖపట్నం
(ఫిబ్రవరి 9వ తేదీన 'పురందరదాసు' వార్షిక ఆరాధన)

జగన్ విజయం తథ్యమా?

అభిప్రాయం



డా॥ జి. నవీన్

జనవరి 27న భీమిలిలో జరిగిన సభలో శంఖం పూరించి, ఢంకా భజాయించి రాబోతున్న శాసన సభ ఎన్నికలకు తాము సిద్ధమని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారు. నేటికి ఉన్న పరిస్థితులలో అధికార పార్టీ తిరిగి ప్రభుత్వాన్ని స్థాపించబోతోంది అనేది సుస్పష్టంగా అర్థమవుతుంది. మొన్న జరిగిన ఉరవకొండ సభలో గాని, భీమిలి, దెందులూరుల్లో గాని ఆయన వ్యవహార శైలి గమనిస్తే గెలుపు మీద ప్రగాఢ విశ్వాసం కలిగి ఉన్నట్లుగా అనిపిస్తోంది. వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలతో ఒక విడదీయారని సంబంధం పెట్టుకోవడంలో ముఖ్యమంత్రి సఫలీకృతులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు చదువు చెప్పడం, బడులను పునరుద్ధరించడం లాంటి గొప్ప నిర్ణయాలతో ఆయన పేద ప్రజలు తమ పిల్లల భవిష్యత్తు కోసం కనే కలలను సాకారం చేసి వారికి బాగా దగ్గరయ్యారు. ఇది ఆయనకు ద్విగుణీకృతమైన లాభాలను చేకూరుస్తుంది. ఇవే కాక వృద్ధాప్య పింఛన్లు, వైఎస్ఆర్ చేయూత, ఆసరా ద్వారా కొన్ని లక్షల మంది బడుగు ప్రజలకు నేరుగా నగదు బదిలీ చేసి వారికి ఆర్థిక సాయం అందించారు. కోవిడ్ నిర్బంధం వల్ల అకస్మాత్తుగా జీవనోపాధి కోల్పోయిన పెక్కు మంది పేద ప్రజలు ఈ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పథకాల వల్ల కొంతైనా ఒడ్డుకు చేరగలిగారు. దేశవ్యాప్తంగా విధించిన లాక్ డౌన్ కారణంగా వ్యవస్థలన్నీ కుదేలైనా, జగన్ ప్రభుత్వం నెలకొల్పిన గ్రామ వాలంటీర్ల పద్ధతి వల్ల ఎంతో మందికి ఆర్థిక ప్రాణ వాయువు అందింది.

పక్క రాష్ట్రమైన తెలంగాణతో పోలిస్తే ఆంధ్ర రాష్ట్ర పేద ప్రజలు నగదు బదిలీ పథకాల వల్ల తమ పరిస్థితులు మెరుగ్గా ఉన్న విషయాన్ని గమనించారు. ఈ పథకాలన్నీ ఒక ఎత్తు అయితే, 'ఆరోగ్యశ్రీ' పథకాన్ని మరిన్ని జబ్బులకు విస్తరించడం, అంతరించిపోతున్నాయి అనుకుంటున్న ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య పెంచి కొత్త వాటిని పలు జిల్లాల్లో స్థాపించడం కూడా జగన్ పార్టీకి ఓట్లు రాబట్టబోతున్నాయి.

మరో వైపు రాష్ట్రంలో ఒక విశ్వసనీయమైన ప్రత్యామ్నాయ పార్టీ లేకపోవటం జగన్‌కు మరింత బలంగా మారింది. ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీ జగన్‌కు బడుగు ప్రజలలో ఉన్న పాపులారిటీకి ఏమాత్రం గండి కొట్టలేక పోయింది. జగన్ అభివృద్ధిని వదిలేసి కేవలం సంక్షేమమే నెరపుతున్నారని విమర్శించిన టీడీపీ సంక్షేమానికి ప్రత్యామ్నాయం ఏదీ చూపించే ధైర్యం చేయలేకపోయింది. అంతే కాక, 'భవిష్యత్తుకు గ్యారంటీ' పేరు మీద టీడీపీ ప్రకటించిన ముందస్తు మేనిఫెస్టోలో లెక్కకు మిక్కిలి అయిన తాయిలాలు ప్రకటించారు. అవిభజిత ఆంధ్ర ప్రదేశ్, ప్రత్యేక తెలంగాణ తదనంతర ఆంధ్రప్రదేశ్‌లు కలుపుకొని 14 సంవత్సరాలు పాలించిన చంద్రబాబు నాయుడు వ్యవ



సాయాధారిత రాష్ట్ర ప్రాధాన్యతలను, పేద ప్రజలను విస్మరించి ఎప్పుడూ ప్రచార ఆర్భాటాలతో కూడిన పెట్టుబడి ప్రాజెక్టులు లేదా రాజధాని పేరిట సామాన్య ప్రజలకు అందనలవి కాని మిరిమిట్లు గొలిపే రియల్ ఎస్టేట్ వ్యాపారాలపైనే దృష్టి సారించారు. అలాంటి చరిత్రను చవిచూసిన ప్రజలు ఆయన్ని నమ్మే స్థితిలో లేరు. గతంలో టీడీపీ, అస్మదీయ మీడియా జగన్ అరెస్ట్ అయ్యి నెలల తరబడి జైలుపాలైన వైనాన్ని తీవ్ర ప్రచారం చేసి కొద్దో గొప్పో లాభపడ్డాయ్. అయితే ఇప్పుడు మారిన పరిస్థితుల్లో అలాంటి కేసుల్లో చంద్రబాబు కూడా జైలుకి వెళ్లి బెయిల్‌పై బయటకి రావటంతో వాళ్ళు ఈ ఆరోపణలు చేసే హక్కుని కోల్పోయారు. ఇక రాష్ట్రం లోని మరో ప్రతిపక్ష పార్టీ అయిన జనసేన ఉద్దేశపూర్వకంగానే చంద్రబాబు పడగ నీడ లోంచి బయట పడలేకపోతోంది. రాష్ట్రంలో పెక్కు మంది అభిమానులు ఉన్న సినీ హీరో అయినప్పటికీ పవన్ కల్యాణ్ ఏనాడూ తన అనుచర గణాన్ని ఒక బలమైన రాజకీయ శక్తిగా మలిచే పని చేయలేదు. చాలా సందర్భాల్లో సొంత పార్టీ ప్రయోజనాలకు వ్యతిరేకంగా అడుగులు వేస్తూ తన కేడరే విస్తు పోయేలా ప్రవర్తించారు.

2019లో సుమారు ఆరు శాతం ఓట్లు పొందిన పవన్ కల్యాణ్, హోరాహోరీగా ప్రచార ర్యాలీలు చేపట్టినప్పటికీ, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి దూరంగా ఉండటం, తన అనుచరుల నుండి ఏ ఒక్క నాయకుడిని కూడా ఆసరాగా తీసుకోకపోవడం వల్ల ఆయన ఓట్ల శాతం పెద్దగా పెరగదని అంచనా. జాతీయ పార్టీలైన భారతీయ జనతా పార్టీ (బీజేపీ), కాంగ్రెస్ రెండూ రాష్ట్రంలో కేవలం డమ్మీలుగా ఉన్నాయి. బిహార్ తర్వాత అణగారిన కులాల డిమాండ్ అయిన కుల గణనను చేపట్టిన ఏకైక రాష్ట్రం జగన్ ప్రభుత్వం ఉన్న ఏపీ మాత్రమే. రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు ఏవీ దీనిపై మాట్లాడకపోవడం ఆశ్చర్యకరం. వెరసి, తాజా ఆలోచనలు, కొత్త తరగతుల నుండి ఉద్భవించాల్సిన రాజకీయ చైతన్యానికి అవకాశం ఉన్నప్పటికీ, విధానపరంగా కానీ, భిన్న వర్గాల నుండీ కానీ ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌ను ఎదురించ గలిగే ప్రతిపక్షం లేదు.

మరో ఐదేళ్ల పాలనకు జగన్ మార్గం గురించి నొక్కిచెప్పాల్సిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఆయన గత 56 నెలల్లో చేసిన పని ఆధారంగానే ఎన్నికలకు వెళ్తున్నారు, కానీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కొడుకుగా కాదు. ఆయన ప్రకటనల ప్రచారంలో, సెంటర్–స్టేజ్ పూర్తిగా ఆయన సొంత సంక్షేమ చర్యలదే కాని వారసత్వ సంకేతాలపై కాదని స్పష్టంగా తెలుస్తుంది. కేవలం కొన్ని సంవత్సరాల క్రితం వరకు తన తండ్రి పేరు ఆధారంగానే కీర్తిని పొందిన వ్యక్తికి ఇది గుర్తించదగిన విజయం.

వ్యాసకర్త సామాజిక రాజకీయ విశ్లేషకులు; శాండియాగో, యూఎస్‌ఏ

సమతుల్యత అవసరం

భగవంతుడు కోటానుకోట్ల ప్రాణులను సృష్టించాడు. ఒక్కొక్క ప్రాణిదీ ఒక్కొక్క జీవితం. ఒక్కో తత్వం. ఈ జీవరాశులనేవి మనిషి, మృగము, పక్షి, పురుగు ఇలా అనేక రకాలు. జీవిత కాలంలో ఇవన్నీ ఏదో ఒక కార్యాన్ని చేస్తూ ఉంటాయి. కానీ వీటిని ఆడించేవాడు భగవంతుడు. అతను సూత్రధారియై ఆడిస్తున్నంత కాలం ఇవన్నీ ఆడుతుంటాయి. అతను ఆపితే ఇవన్నీ ఆగిపోతాయి. అందుకే ఈ జీవితం నిత్యమని అనుకోకూడదు. ఎంతకాలం జీవిస్తామనేది మన ఇష్టాన్ని బట్టి ఉండదు. క్షణభంగురమైన ఈ జీవితకాలంలో దైవ భక్తి అనేది అలవాటు చేసుకోవాలి.



అలాగే ఐహిక ప్రపంచ జీవితంలో మనకు ఎదురయ్యే సంబంధ బాంధవ్యాల పట్ల అంటీ అంటనట్టు ఉండాలి. అంతేతప్ప వాటిల్లో కూరుకుపోకూడదు. తామరాకుపై నీటిబిందువులా జీవితం సాగించాలి. తామరాకుపై ఉన్న నీటి బిందువులు ఏ క్షణంలో జారి కింద పడిపోతాయో ఎవరు చెప్పగలరు? జీవితమూ అంతే. కనుక దేనికీ దాసోహమైపోకూడదు. అలాగే అత్యాశ, అధికమైన కోరికలను త్యజించాలి. అవి త్యజించలేనినాడు ఇతరులపైనే కాదు, మనపై మనకే కోపం వస్తుంది. ఫలితంగా అశాంతి జీవితాన్ని ఆవరిస్తుంది. అయితే కేవలం మన కోరికలే మన అశాంతికి కారణం అని చెప్పడమూ సరికాదు. మనిషి సంఘజీవి కాబట్టి మనతో సంబంధం లేకుండా ఇతరుల ప్రవర్తనా, ప్రభుత్వాల నిర్ణయాలూ, పని ఒత్తిడులూ వంటివీ మన కోపతాపాలకూ, అశాంతికీ కారణమవుతాయి.

కాబట్టి మనిషి తన పరిధిలో తాను ప్రశాంతంగా, ఆరోగ్యంగా జీవించడానికి ఆధ్యాత్మిక, లౌకిక విషయాలను తగు విధంగా మేళవించుకోవాలి. ఈ రెండింటి మధ్య సమతౌల్యాన్ని సాధించినవారే ఇహ, పర జీవితాల పరంగా సంపూర్ణత్వాన్ని సాధించగలుగుతారు. కోరికలను అదుపుచేసుకోవడం, నడక, యోగాసనాలు, సంగీత– సాహిత్యాలు వంటి లలితకళలపై దృష్టిపెట్టడం వంటివి భగవన్నామ స్మరణతో పాటూ చేయాల్సిన పనులు. ఇందువల్ల మానసిక ప్రశాంతతతో పాటూ శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుంది. రోజురోజుకీ జీవితం యాంత్రికంగా మారుతున్న ఈ కాలంలో పైన చెప్పిన విషయాలు ఎంతో విలువైనవి.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.త్రయోదశి ఉ.9.34 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.1.48 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ఉ.10.31 నుండి 12.01 వరకు, తిరిగి తె.5.34 నుండి 7.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.22 నుండి 11.07 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.37 వరకు, **అమృత ఘడియలు:** రా.7.40 నుండి 9.12 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.54

15న సేవాలాల్ మహారాజ్ జయంతి

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాక్షి, అమరావతి: సేవాలాల్ మహారాజ్ జయంతిని ఈ నెల 15న ఘనంగా జరుపుదామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా సేవాగడ్‌లో నిర్వహించనున్న సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల పోస్టర్, కరపత్రాలను విజయవాడలో రాజన్నదొర బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ చూపిన మార్గంలో బంజారా సమాజం, యువత పయనించాలని కోరారు. ఏపీ స్టేట్ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతి కార్యక్రమానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బంజారా గిరిజనులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడారు.

రేపటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా' రాష్ట్రస్థాయి పోటీలు

సిద్ధమైన విశాఖపట్నం

- రైల్వేస్టేడియంలో ప్రారంభం.. వైఎస్ఆర్ స్టేడియంలో ముగింపు
- సీఎం చేతుల మీదుగా విజేతలకు ట్రోఫీలు


క్రీడాకారుల వసతి కోసం దబ్బంద టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

విశాఖ స్పోర్ట్స్: ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' టోర్నమెంట్ తుదిదశ పోటీలకు విశాఖ సిద్ధమైంది. వార్డు, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు దశల్లో, ఐదు క్రీడాంశాల్లో ఈ పోటీలు నిర్వహిస్తుండగా జిల్లా స్థాయి విజేత జట్లు తుది పోరుకు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా విశాఖలోని ప్రధాన కూడళ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో పాల్గొనే మహిళా, పురుష ఆటగాళ్ల 26 జిల్లాల జట్లు విశాఖకు చేరుకుంటున్నారు. రైల్వేస్టేషన్, బస్ స్టేషన్లలో రిసెప్షన్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. అక్కడే వారికి కేటాయించిన వసతి తదితర వివరాలను చెబుతున్నారు. ప్రతి జిల్లా నుంచి 134 మంది ఆటగాళ్లు పోటీలకు హాజరవుతుండగా, పురుష జట్లకు దబంగలోని టిడ్కో గృహాల్లో, మహిళల జట్లకు సుద్దగెడ్డ, కొమ్మాదిలోని టిడ్కో గృహాల్లోనూ వసతి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆటగాళ్ల పోటీల వేదికకు చేరుకునేందుకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనాల్ని వసతి వద్దే సమకూర్చనుండగా మధ్యాహ్నం భోజనం, మధ్యలో స్నాక్స్, ఎనర్జీ డ్రింక్స్‌ను పోటీల వేదిక వద్దే అందజేయనున్నారు. 9న రైల్వే స్టేడియంలో ప్రారంభ వేడుకకు రాష్ట్ర మంత్రులు, క్రీడా ప్రాధికార సంస్థ ప్రతినిధులు, ఉన్నతాధికారుల రాకతో పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. ఇక్కడే అతిథులు చేతుల మీదుగా క్రికెట్ పోటీలు ప్రారంభం కానున్నాయి. బ్రాండింగ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో హోర్డింగులు, జెండాలు, బిల్‌బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మహిళల క్రికెట్ పోటీలు కొమ్మాది గ్రౌండ్స్‌లో జరగనుండగా, పురుషుల క్రికెట్ పోటీలకు వైఎస్ఆర్ స్టేడియం బి గ్రౌండ్, ఏయూ ఇంజనీరింగ్ కళాశాల తదితర గ్రౌండ్లను సిద్ధం చేశారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు ఏయూ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నారు. బ్యాడ్మింటన్ పోటీలను రైల్వేస్టేడియంలోని ఎన్‌క్లేవ్‌లో నిర్వహిస్తారు. ఈనెల 13న విజేతలుగా నిలిచిన జట్లు ట్రోఫీ, సర్టిఫికెట్లతో పాటు భారీగా నగదు ప్రోత్సాహకాల్ని సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా వైఎస్ఆర్ స్టేడియంలో అందుకోనున్నారు.

● ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 144 అడుగుల బృహదాకార కార్యసిద్ధి ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు రాజానగరంలో బుధవారం శ్రీకారం చుట్టారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ సమీపంలోని గురుదత్త పాదుకా క్షేత్రం ఆవరణలో ఏర్పాటు చేయనున్న ఈ విగ్రహానికి మైసూరులోని అవధూత దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో బడ్జెట్ ప్రతులకు ప్రత్యేక పూజలు


అమ్మవారి సన్నిధిలో రాష్ట్ర ఆర్థికశాఖ బృందం, చిత్రంలో ఆలయ చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతులకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, అదనపు కార్యదర్శి (ఎఫ్‌పీసీ) బి.సునీల్‌కుమార్‌రెడ్డి బడ్జెట్ ప్రతులతో ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. వీరికి ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు సాదరంగా స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకున్న రాష్ట్ర ఆర్థిక శాఖ బృందం బడ్జెట్ ప్రతులను అమ్మవారి చెంతన ఉంచి పూజలు జరిపించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ చైర్మన్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో రమేష్ బాబు అమ్మవారి ప్రసాదాలు, పట్టు వస్త్రాలను అందజేశారు.

తన్నుకున్న జనసేన కార్యకర్తలు

- పరస్పరం బాహాబాహీ
- పోతిన మహేశ్ అనుచరులపై పోలీసులకు మరో వర్గం ఫిర్యాదు
- విజయవాడలో ఘటన


తన్నుకుంటున్న జనసేన కార్యకర్తలు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఎన్నికల ముంగిట విజయవాడలో జనసేన కార్యకర్తలు ఒకరిని ఒకరు తన్నుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పోతిన మహేష్ అనుచరులు సొంత పార్టీ కార్యకర్తలపైనే బుధవారం దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. తమ వీడియోను తప్పుగా మార్ఫింగ్ చేసి వైరల్ చేశారని.. ఇందుకు పోతిన మహేశ్ అనుచరులే కారణమని వారిపై కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఆ పార్టీ నగర అధికార ప్రతినిధి షేక్ గయాసుద్దీన్ ఫిర్యాదు చేశారు. అలాగే భవానీపురం ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ రుహుల్లా, ఆయన భార్య సైతం తమ వీడియోలను మార్ఫింగ్ చేసి పరువుకు భంగం కలిగించారని పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఈ సందర్భంగా రుహుల్లా మీడియాతో మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ఒక స్థలం విషయంలో రేటు కొద్దిగా తగ్గించాలని కోరుతూ పోతిన మహేశ్‌ను తాను, తన భార్య కలిశామన్నారు. ఆ సందర్భంగా మహేశ్, ఆయన అనుచరులు తాము మాట్లాడిన మాటలను ఎడిట్ చేసి తప్పుగా మార్చారని ఆరోపించారు. గయాసుద్దీన్ తమ వద్ద నుంచి అక్రమంగా రూ.87 వేలు తీసుకున్నారని తాము చెప్పినట్టు మార్ఫింగ్ చేశారని రుహుల్లా చెప్పారు. ఆ వీడియోను తాజాగా మహేశ్ అనుచరులు వైరల్ చేశారని ఆరోపించారు. దీనిపై తాము వివరణ అడగడానికి ఆయన కార్యాలయానికి వెళ్లామన్నారు. అయితే అక్కడ ఆఫీసులో ఉన్న మహేశ్ అనుచరులు తమను కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

అనూస్‌లో ఉచిత బ్యూటీషియన్ శిక్షణ

సాక్షి, అమరావతి: మహిళలు ఆర్థికంగా స్వయంశక్తితో ఎదిగే అవకాశాలు కల్పించాలన్న సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) కృషి చేస్తోందని మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి చెప్పారు. పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు పలు రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అనూస్ సంస్థలో బ్యూటీషియన్ శిక్షణకు ఎస్‌హెచ్‌జీల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారిలో 3,000 మంది మహిళలను మెప్మా ఎంపిక చేసింది. వీరికి విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు నగరాల్లో ఉచిత శిక్షణ బుధవారం ప్రారంభమైంది. విజయవాడలోని అనూస్ సంస్థలో జరిగిన శిక్షణను మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, అనూస్ సిస్టర్స్‌లో ఒకరైన అనురాధతో కలిసి ప్రారంభించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ శిక్షణ 6 ప్రాంతాల్లో ఏకకాలంలో జరుగుతోందన్నారు.

పోలీసులపై దాడి ఘటనలో టీడీపీ నేతలపై కేసు నమోదు

ఉయ్యూరు: పోలీసులపై దాడికి తెగబడ్డ టీడీపీ శ్రేణులపై కృష్ణాజిల్లా ఉయ్యూరు పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. 144 సెక్షన్ ధిక్కరిస్తూ మూకుమ్మడిగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు కేసులు నమోదు చేశారు. పట్టణ ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు...'చలో అసెంబ్లీ' పేరుతో టీడీపీ నాయకులు మంగళవారం ఉయ్యూరులో విధ్వంసం సృష్టించారు. అనుమతి లేని ఆందోళనకు వెళ్లొద్దని నచ్చజెప్పేందుకు యత్నించిన పోలీసులపై దాడి చేశారు. మంటల్లో కాలుతున్న టైర్లను పోలీసులపై విసిరారు. అడ్డుకున్న వారిని గుంపుగా నెట్టేశారు. ఈ ఘటనలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేశారు. టీడీపీ మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, నాయకులు జంపన వీర శ్రీనివాసరావు, సయ్యద్ అజ్మతుల్లా, పలియాల శ్రీనివాసరావు, రాజులపాటి ఫణికుమార్, బాకీ రాజు, అమర్‌తో పాటు మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు.

టీడీపీలో కాపులకు ప్రాధాన్యం ఇవ్వరా?

- గుంటూరు 'పార్లమెంట్'లో కాపులకు వైఎస్సార్‌సీపీ తగిన ప్రాధాన్యత ఇచ్చింది
- విలేకరుల సమావేశంలో టీడీపీ కాపు నేతల ఆవేదన


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ కాపు నాయకులు

నెహ్రూనగర్ (గుంటూరు): 'కొన్ని దశాబ్దాలుగా టీడీపీలోనే ఉన్నాం. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల తర్వాత గుంటూరు జిల్లాలోనే కాపులు అత్యధికంగా ఉన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నా టీడీపీ అధినేత చంద్రబాబు గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో కాపులకు ఎమ్మెల్యే సీట్లు ఇస్తామని ప్రకటించలేదు. కనీసం ఇన్‌చార్జిలుగా కూడా అవకాశం కల్పించకపోవడం బాధాకరం.' అని టీడీపీకి చెందిన కాపు నేతలు వాపోయారు. గుంటూరు అరండల్‌పేటలోని ఓ హోటల్లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగోపు నాగేశ్వరరావు, బోక్కిసం శివరామ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సామాజికన్యాయం పాటిస్తూ గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో జనాభా దామాషా ప్రకారం కాపులకు అధిక సీట్లు ప్రకటించిందని చెప్పారు. టీడీపీ మాత్రం ఇప్పటి వరకు ఒక కాపు అభ్యర్థిని కూడా ప్రకటించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం టీడీపీలో సీట్ల సర్దుబాటు చూస్తుంటే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 స్థానాల్లో మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ కాగా, మిగిలినివాటిలో 7 నుంచి 8 అసెంబ్లీ స్థానాలు, గుంటూరు, నరసరావుపేట ఎంపీ సీట్లు కూడా కమ్మ వారికే కేటాయించే పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. ఇలా కమ్మవారికే అధిక ప్రాధాన్యత ఇస్తే మిగిలిన కులాలవారు ఏమైపోయాలని ప్రశ్నించారు. ప్రభుత్వ ఏర్పాటుకు జనసేన ఎంత అవసరమో, టీడీపీకి కాపు ఓట్లు కూడా అంతే ముఖ్యమని గుర్తించాలన్నారు. కాపులకు సీట్లు కేటాయించకుండా రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేయాలని తమ సామాజికవర్గాన్ని ఏ ముఖం పెట్టుకుని అడగగలమని అన్నారు. తమ మనోభావాలు దెబ్బతినే పరిస్థితి రాకముందే చంద్రబాబు, లోకేశ్ స్పందించి గుంటూరు జిల్లాలో కాపులకు 3 నుంచి 4 అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ సీటు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు బొబ్బిలి రామారావు, తాడివాక సుబ్బారావు, మొల్లం సైదయ్య, చింతకాయల రామారావు, అమర్‌నాథ్, పవన్‌కుమార్, మేకల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో మహాకుంభాభిషేకంపై పిల్ మూసివేత

21న నిర్వహిస్తున్నట్టు హైకోర్టుకు తెలిపిన దేవదాయ శాఖ

సాక్షి, అమరావతి: శ్రీశైలంలో ఈ నెల 16నుంచి 21వ తేదీ వరకు మహా కుంభాభిషేకంతో పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ అధికారులు హైకోర్టుకు నివేదించారు. 21వ తేదీన మహా కుంభాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. ఆగమ పండితులను సంప్రదించిన తరువాత ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని దేవదాయ కమిషనర్ వివరించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు మహా కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాల నిర్వహణ విషయంలో ఎలాంటి విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని మూసివేస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. షెడ్యూల్ ప్రకారం మహాకుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలన్నింటినీ జరిపేలా ఆలయ అధికారులను ఆదేశించాలని కోరుతూ అఖిల భారతి వీరశైవ ధర్మాక ఆగమ పరిషత్ చైర్మన్ సంగాల సాగర్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై ఇటీవల విచారణ జరిపిన సీజే ధర్మాసనం మహా కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాల నిర్వహణ విషయంలో వారం రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా, దేవదాయ శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది రజనీరెడ్డి వాదనలు వినిపిస్తూ.. మహా కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాల నిర్వహణకు తేదీలను ఖరారు చేశామని తెలిపారు. ఆ వివరాలను కోర్టుకు సమర్పించారు. రజనీరెడ్డి చెప్పిన వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం వాటిని రికార్డ్ చేసింది. మహాకుంభాభిషేకం, ఇతర కార్యక్రమాల నిర్వహణకు తేదీలు ఖరారైన నేపథ్యంలో ఈ వ్యాజ్యంపై ఇక విచారణ అవసరం లేదన్న ధర్మాసనం పిల్‌ను మూసివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

2050 నాటికి...నీటికి కటకటే!

ప్రపంచవ్యాప్తంగా నీటి కాలుష్యం, కొరత

మూడో వంతు నదులకు కాలుష్య ముప్పు | పరీవాహక ప్రాంత ప్రజలకు పెను ఇక్కట్లు | హెచ్చరిస్తున్న అంతర్జాతీయ అధ్యయనం

నీటి కొరతతో ఇప్పటికే ప్రపంచం అల్లాడుతోంది. పలు దేశాల్లో ఈ సమస్య ఉగ్ర రూపు దాలుస్తోంది. తాగునీటి సమస్య యూరప్, ఆఫ్రికాల్లో పలు దేశాల మధ్య వివాదాలకు కూడా దారి తీస్తోంది. కొరతకు నీటి కాలుష్యమూ తోడవడంతో కొన్నేళ్లుగా పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డ చందంగా మారింది. అయితే ఇదంతా ట్రైలర్ మాత్రమేనని, సమీప భవిష్యత్తులో ఈ సమస్య పెను ఊపు దాల్చవచ్చని తాజా అధ్యయనం తేల్చింది. 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఏకంగా మూడో వంతు నదీ పరీవాహక ప్రాంతాల్లో స్వచ్ఛమైన నీటికి తీవ్ర కొరత నెలకొనడం ఖాయమని పేర్కొంది! ఇది కనీసం 300 కోట్ల జనాభాను తీవ్రంగా ప్రభావితం చేయబోతోందని అంచనా వేయడం గుబులు రేపుతోంది... నదీ పరివాహక ప్రాంతాల్లో స్వచ్ఛమైన నీటి లభ్యతపై నెదర్లాండ్స్‌లోని వాగెనింగెన్ యూనివర్సిటీ సారథ్యంలోని బృందం అధ్యయనం నిర్వహించింది. చైనా, మధ్య యూరప్, ఉత్తర అమెరికా, ఆఫ్రికాతో పాటు భారత్‌లోని మొత్తం 10 వేల పై చిలుకు నదీ బేసిన్లు, సబ్ బేసిన్లలో నీటి నాణ్యత తదితరాలపై సుదీర్ఘ కాలం లోతుగా పరిశోధన చేసింది. వాటిలో ఏకంగా మూడో వంతు, అంటే 3,061 నదీ బేసిన్ల పరిధిలో నీరు తాగేందుకు దాదాపుగా పనికిరాకుండా పోనుందని హెచ్చరించింది. ఆయా బేసిన్ల పరిధిలోని జల వనరుల్లో నైట్రోజన్ వచ్చి కలుస్తుండటం ఇందుకు ప్రధాన కారణమని వెల్లడించింది. వాటిలో నైట్రోజన్ పరిమాణం కొంతకాలంగా మరీ ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతోందని తేల్చింది. దీనికి నీటి కొరత తోడై పరిస్థితి పూర్తిగా చేయి దాటిపోవచ్చని స్పష్టం చేసింది. జర్నల్ నేచర్ కమ్యూనికేషన్స్‌లో ప్రచురించిన ఈ పరిశోధన ఫలితాలు కలకలం రేపుతున్నాయి...

అధ్యయనం ఇలా...

- ఆయా నదీ బేసిన్లు, సబ్ బేసిన్లలో నీటి ప్రవాహం, పరిమాణాన్ని లెక్కలోకి తీసుకున్నారు.
- వాటిలో కలుస్తున్న నైట్రోజన్ పరిమాణాన్ని నీటి పరిమాణంతో పోల్చి కాలుష్య స్థాయిని లెక్కించారు.
- 2010 నుంచి చూస్తే గత 13 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా దాదాపుగా అన్ని నదీ బేసిన్లు, సబ్ బేసిన్లలోనూ నైట్రోజన్ పరిమాణం క్రమంగా పెరుగుతూ వస్తున్నట్టు తేలింది.
- 2010లో నాలుగో వంతు బేసిన్లలో కనిపించిన ఈ సమస్య ఇప్పుడు మూడో వంతుకు విస్తరించింది. పైగా వాటి కాలుష్య కారకాల్లో నైట్రోజన్ పాత్ర ఏకంగా 88 శాతానికి పెరిగింది!

ఏం జరుగుతోంది...

నదీ బేసిన్లు, సబ్ బేసిన్లు కేవలం నీటి వనరులు మాత్రమే కాదు. భారీ స్థాయి పట్టణీకరణకు, ఆర్థిక కార్యకలాపాలకు కూడా కేంద్ర బిందువులు కూడా.


- ఫలితంగా భారీగా ఉత్పత్తయ్యే మురుగునీరు చాలామటుకు వాటిలోనే కలుస్తోంది.
- మురుగులోని నైట్రోజన్ కారణంగా నీటి వనరులు బాగా కలుషితమవుతున్నాయి.
- ఇది కూడా జల వనరుల కాలుష్యంలో పెద్ద కారకంగా మారుతోంది.
- దీనికితోడు బేసిన్ల పరిధిలో వ్యవసాయ కార్యకలాపాలు భారీగా సాగుతాయి. అది విచ్చలవిడి ఎరువుల వాడకానికి దారి తీస్తోంది.



పెను సమస్యే...

- అధ్యయనం జరిపిన 10 వేల పై చిలుకు నదీ బేసిన్లు ప్రధానంగా సాగుకు ఆటపట్టులు.
- ప్రపంచ జనాభాలో ఏకంగా 80 శాతం దాకా వాటి పరిధిలోనే నివసిస్తోంది!
- 2050కల్లా మూడో వంతు, అంటే కనీసం 300 కోట్ల పై చిలుకు జనం తాగునీటి సమస్యతో అల్లాడిపోతారు.
- ఈ నీటి వనరులు పూర్తిస్థాయిలో తాగటానికి పనికిరాకుండా పోతే సమస్య ఊహాతీతంగా ఉంటుందని అధ్యయనం హెచ్చరించింది.
- ఉత్తర అమెరికా, యూరప్, ఉత్తర ఆఫ్రికా, మధ్యప్రాచ్యం, మధ్య ఆసియా, చైనాతో పాటు భారత్‌లోనూ పలు ప్రాంతాలు ఈ జాబితాలో ఉన్నాయి!

– సాక్షి, నేషనల్ డెస్క్



కాంగ్రెస్‌కు కాలం చెల్లింది

- రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా
- ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కాంగ్రెస్ ఎప్పటికీ వ్యతిరేకమే
- రిజర్వేషన్లను జవహర్‌లాల్ నెహ్రూ వ్యతిరేకించారు
- ఉత్తరం, దక్షిణం అంటూ దేశాన్ని విభజించడానికి కాంగ్రెస్ కుట్రలు
- వారంటీ తీరిపోయినవారి మాటలను దేశం వినిపించుకోదు
- యువరాజును లిఫ్ట్ చేసే యత్నాలన్నీ విఫలం.. ఆయనో నాన్–స్టార్టర్
- కాంగ్రెస్‌కు ఈసారి 40 సీట్లన్నా రావాలని ఆశిస్తున్నా
- 'మోదీ 3.0 సర్కారు' ఏర్పాటు దగ్గర్లోనే ఉందన్న ప్రధాని

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌కు కాలం చెల్లిపోయిందని, ఆ పార్టీకి వారంటీ లేదని ఎద్దేవా చేశారు. దేశాన్ని ఉత్తరం, దక్షిణం అంటూ రెండుగా విభజించానికి కాంగ్రెస్ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ప్రధాని మోదీ బుధవారం సమాధానమిచ్చారు. దాదాపు 90 నిమిషాలపాటు మాట్లాడారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రస్తుత పార్లమెంట్‌లో ఇదే ఆయన చివరి ప్రసంగం కావడం విశేషం. కేంద్రంలో తాము వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని పునరుద్ఘాటించారు. 'మోదీ 3.0 ప్రభుత్వ' హయాంలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్ల తమ విజన్‌ను ఆవిష్కరించారు. వికసిత భారత్ పునాదిని పటిష్టం చేస్తామని ప్రకటించారు. మోదీ 3.0 సర్కారు ఏర్పాటు ఇక ఎంతోదూరంలో లేదని వ్యాఖ్యానించారు. రాజ్యసభలో ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..

ప్రజాస్వామ్యాన్ని హత్య చేసిన కాంగ్రెస్

''దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులకు కాంగ్రెస్ ఎప్పటికీ వ్యతిరేకమే. బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లేకపోతే ఆయా వర్గాలకు రిజర్వేషన్లు దక్కేవే కావు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వ్యతిరేకించారు. ఈ మేరకు అప్పట్లో రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉంటే ప్రభుత్వ పరిపాలన దెబ్బతింటుందని నెహ్రూ చెప్పారు. ఓబీసీలకు కాంగ్రెస్ ఎప్పుడూ పూర్తిస్థాయి రిజర్వేషన్లు ఇవ్వలేదు. జనరల్ కేటగిరీలోని పేదలను కూడా పట్టించుకోలేదు. భారతరత్న పురస్కారానికి అంబేడ్కర్ అర్హుడని కాంగ్రెస్ భావించలేదు. సొంత కుటుంబ సభ్యులకు భారతరత్న అవార్డులు ఇచ్చుకున్న చరిత్ర కాంగ్రెస్‌కు ఉంది. అలాంటి పార్టీ ఇప్పుడు మాకు నీతిపాఠాలు బోధిస్తోంది. మన దేశ భూభాగాలను శత్రు దేశానికి అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అంతర్గత భద్రతపై మాకు ఉపన్యాసాలు ఇస్తోంది. ఆ పార్టీ అధికారం కోసం ప్రజాస్వామ్యాన్ని గొంతుకోసి చంపేసింది. ఎన్నో రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను రాత్రికి రాత్రే కూలదోసింది.

వికసిత భారత్.. మా అంకితభావం

కాంగ్రెస్ పాలనలో దేశం సమస్యల వలయంలో చిక్కుకుంది. వాటి పరిష్కారానికే ప్రధానిగా నా రెండు టర్ములను వెచ్చించాను. వికసిత భారత్ ఒక పదం కాదు. అది మా అంకితభావం. సబ్‌కా సాత్ అనేది నినాదం కాదు. అది మోదీ ఇస్తున్న గ్యారంటీ. వారంటీ తీరిపోయినవారు చెప్పే మాటలను దేశం వినిపించుకోదు. గ్యారంటీ బలాన్ని చూపించినవారినే దేశం విశ్వసిస్తుంది.

అన్ని వర్గాల సంక్షేమానికి పదేళ్లుగా కృషి

'యువరాజు' (రాహుల్)ను స్టార్టప్‌గా తయారు చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. కానీ, ఆయనొక నాన్–స్టార్టర్. ఎంత లిఫ్ట్ చేయాలని చూసినా ఫలితం ఉండడం లేదు. కాంగ్రెస్ ఆలోచనావిధానానికి కాలం చెల్లింది. అందుకే ఆ పార్టీ పనులను ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చారు. కాంగ్రెస్ నానాటికీ దిగజారిపోతుండడం మాకూ బాధగానే ఉంది. సొంత పార్టీ నేత పట్ల గ్యారంటీ లేని కాంగ్రెస్ మోదీ గ్యారంటీని ప్రశ్నిస్తుండడం హాస్యాస్పదం. పదేళ్ల యూపీఏ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ చితికిపోయింది. నాటి ప్రధాని మన్మోహన్ సింగే దీన్ని అంగీకరించారు. దేశ సమస్యలేమిటో తెలిసినా వాటి పరిష్కారానికి కాంగ్రెస్ ఏనాడూ కృషి చేయలేదు. బ్రిటిష్ పాలన నుంచి స్ఫూర్తి పొంది బానిసత్వపు గుర్తులను దశాబ్దాల పాటు కొనసాగించింది. మేము అధికారంలోకి వచ్చాక సమస్యల సుడిగుండం నుంచి దేశాన్ని బయటపడేశాం.

మా గళానికి ప్రజలు బలమిచ్చారు

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దేశమంతటా 40 సీట్లు కూడా రావన్న సవాలు పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చింది. ఇప్పుడున్న 40 సీట్లను కాంగ్రెస్ మళ్లీ నిలబెట్టుకోవాలని నేను ప్రార్థిస్తున్నా. విపక్షాల ప్రతి మాటను మేం చాలా సహనంతో వింటున్నాం. కానీ, మేము చెప్పేది ప్రతిపక్షాలు వినడం లేదు. మా గళాన్ని మీరు అణచివేయలేరు. దానికి దేశ ప్రజలు చాలా బలమిచ్చారు''.

దయచేసి ఆ భాషమానుకోండి

''కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తోంది. భారత్‌ను ఉత్తర, దక్షిణంగా ముక్కలు చేయడానికి కొత్తకొత్త ప్రకటనలు చేస్తోంది. ఉత్తరం, దక్షిణం అనే విభజన రేఖ తీసుకురావడం కాంగ్రెస్, కర్ణాటక ప్రభుత్వం మానుకోవాలి. దేశ భవిష్యత్తుతో చెలగాటం వద్దు. 'మా పన్నులు, మా డబ్బులు' అంటూ మాట్లాడుతున్నారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ నుంచి ఇలాంటి భాష బాధగా ఉంది. దయచేసి ఆ భాష మానుకోండి. దీనివల్ల దేశానికి నష్టం తప్ప లాభం ఉండదు. దేశమంటే కొన్ని భూభాగాల సమ్మేళనం కాదు. ఒక అంగం పనిచేయకపోతే శరీరమంతా స్తంభిస్తుంది. అలాగే దేశంలో ఏదైనా ఒక ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా వదిలేస్తే దేశమంతా అభివృద్ధి చెందలేదు''.

చేపల పడవలో దేశాలే దాటారు

యజమాని వేధింపులు భరించలేక కువైట్ నుంచి ముంబై వచ్చిన ముగ్గురు మత్స్యకారులు

ముంబై: పరాయి దేశంలో పడరాని పాట్లు పడి, యజమాని పెట్టే హింసలు భరించలేక స్వదేశం వెళ్లే సాహసం చేశారు ముగ్గురు భారతీయులు. అనుకున్నదే తడవుగా యజమాని పడవనే తమ ప్రణాళికకు ప్రధాన ఆయుధంగా వాడుకున్నారు. ఎవరికీ చెప్పకుండా దొంగచాటుగా కువైట్ నుంచి బయల్దేరి సముద్ర మార్గం గుండా నేరుగా ముంబై తీర ప్రాంతానికి చేరుకున్నారు. పుట్టినగడ్డపై కాలుమోపేలోపే పోలీసులు అరెస్ట్‌చేశారు. ముగ్గురు తమిళనాడు వ్యక్తుల సాహసోపేత అక్రమ అంతర్జాతీయ సముద్ర ప్రయాణ ఉదంతం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇదే తరహాలో అరేబియా సముద్ర జలాల మీదుగా ముంబైలో అడుగుపెట్టిన పాక్ ముష్కరులు మారణహోమం సృష్టించిన విషయం తెల్సిందే. దీంతో సముద్రజలాల మీద గస్తీపై నీలినీడలు కమ్ముకున్నాయి. మంగళవారం ఉదయం ముంబై సమీపంలో ఈ ఘటన జరిగింది. సంబంధిత వివరాలను పోలీసులు బుధవారం వెల్లడించారు.

జనవరి 28న ప్రయాణం షురూ

తమిళనాడులోని కన్యాకుమారి ప్రాంతానికి చెందిన 29 ఏళ్ల విజయ్ వినయ్ ఆంటోనీ, 29 ఏళ్ల జె.సహాయట్ట అనీశ్, రామనాథపురానికి చెందిన 31 ఏళ్ల నిట్సో డిటోలు రెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లారు. వీరి వృత్తి చేపలుపట్టడం. కువైట్‌లోనూ అదే పనిచేసేవారు. కేరళలోని త్రివేండ్రమ్ నుంచి వీరు కువైట్‌కు వెళ్లారు. యజమాని నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. భారత్‌కు రానీయకుండా వారి పాస్‌పోర్టులను దాచేశాడు. ఎలాగైనా కువైట్ నుంచి బయటపడాలని నిర్ణయించుకుని అందుకు ఓనర్ చేపల బోటును ఎంచుకున్నారు. జనవరి 28వ తేదీన ప్రయాణం మొదలెట్టి సౌదీ అరేబియా, ఖతర్, దుబాయ్, మస్కట్, ఒమన్, పాకిస్తాన్ మీదుగా భారత జలాల్లోకి ప్రవేశించారు.

రంగంలోకి నేవీ, పోలీసులు

మంగళవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో ముంబైలోని యెల్లో గేట్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది అరేబియా సముద్రంలో పెట్రోలింగ్ చేపట్టారు. ససూన్ డాక్ ప్రాంతంలో వీరి రాకను గమనించారు. ఈ చేపల పడవ నిర్మాణం భారతీయ పడవలతో పోలిస్తే విభిన్నంగా ఉండటంతో అనుమానమొచ్చి అడ్డుకున్నారు. అందులోని ముగ్గురికీ మరాఠా, హిందీ అస్సలు రాకపోవడం, పొడిపొడిగా ఇంగ్లిష్‌లో మాట్లాడుతుండటంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే నేవీ అధికారులతోపాటు పోలీసులు మూడు పడవల్లో హుటాహుటిన చేరుకున్నారు. బాంబు స్క్వాడ్ సిబ్బంది సైతం రప్పించి తనిఖీలు చేయించారు. పేలుడుపదార్థాలు ఏవీ లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించారంటూ పాస్‌పోర్టు సంబంధిత సెక్షన్ కింద కేసు నమోదుచేసి అరెస్ట్‌చేశారు. ముంబైలోని కోర్టులో హాజరుపరచగా ఫిబ్రవరి 10వ తేదీదాకా పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఆదేశాలిచ్చారు. విదేశీ గడ్డపై వీళ్లు ఏదైనా నేరానికి పాల్పడ్డారో తెల్సుకోండని పోలీసులకు సూచించారు.

పడవలో జీపీఎస్

స్వాధీనం చేసుకున్న పడవను బాంబు స్క్వాడ్ క్షుణ్ణంగా తనిఖీచేసింది. ఒక జీపీఎస్‌ను గుర్తించారు. సువిశాల సముద్రంలో దారి తప్పకుండా ఉండేందుకు వారు జీపీఎస్‌ను ఉపయోగించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. వీళ్లను కువైట్‌కు తీసుకెళ్లిన ఏజెంట్‌ను కెప్టెన్ మదన్‌గా పోలీసులు గుర్తించారు. ''అబ్దుల్లా షరీహిద్ అనే మాస్టర్ దగ్గర పనిచేసేవాళ్లం. జీతాలు సరిగా ఇచ్చేవాడు కాదు. అదేంటని అడిగితే చితకబాదేవాడు. ఇదే విషయమై కువైట్‌లోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాం. ఇండియన్ ఎంబసీలోనూ మా గోడు వెళ్లబోసుకున్నాం. ఫలితం శూన్యం. అందుకే ఇలా పారిపోయి వచ్చాం ''అని ఈ ముగ్గురు పోలీసులకు చెప్పారు. వీళ్ల కుటుంబీలకు ఇప్పటికే వీరి రాక సమాచారం చేరవేశామని పోలీసులు వెల్లడించారు.



ముగ్గురు భారత జాలర్లు కువైట్ నుంచి 10 రోజులు ప్రయాణించి ముంబై చేరిన పడవ

మోదీవి పచ్చి అబద్ధాలు: ఖర్గే

న్యూఢిల్లీ: యూపీఏ ప్రభుత్వ పనితీరుపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలన్నీ పచ్చి అబద్ధాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. పదేళ్ల పాలనలో ఆయన సర్కారు సాధించిందేమీ లేకపోవడం వల్లే ఇలా జనం దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ''కాంగ్రెస్‌పై పసలేని ఆరోపణలు, విమర్శలు తప్ప మంగళ, బుధవారాల్లో పార్లమెంటు ఉభయ సభల్లో ఆయన చేసిన ప్రసంగంలో మరేమీ లేదు. ఎన్డీఏ అంటేనే నో డేటా అవేలబుల్ (ఏ గణాంకాలూ అందుబాటులో లేవు)! రాజ్యాంగంపై నమ్మకమే లేని వ్యక్తులు దేశ స్వాతంత్ర్యం కోసం ముందుండి పోరాడిన కాంగ్రెస్‌కు దేశభక్తి గురించి నీతులు చెబుతున్నారు'' అంటూ ఎద్దేవా చేశారు. అసమర్థ పాలనతో అన్ని రంగాల్లోనూ దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారంటూ మోదీపై నిప్పులు చెరిగారు. యూపీఏ హయాంలోని అభివృద్ధికి క్రెడిట్ కొట్టేస్తున్నారు.

కాశీ, అయోధ్య.. ఇక మథుర: యోగి

లఖ్‌నవూ: మథురలో చాలాకాలంగా వివాదాల్లో నలుగుతున్న మందిర్–మసీద్ వివాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. అక్కడ షాహీ ఈద్గా స్థానంలో కృష్ణునికి ఆలయం నిర్మించడంపై గట్టిగా దృష్టి సారిస్తామని సంకేతాలిచ్చారు. ''కాశీ, అయోధ్య అనంతరం ఇప్పుడిక మథుర వంతు. అక్కడ మందిరం రూపుదిద్దుకోకుంటే కృష్ణుడు కూడా ఒప్పుకునే పరిస్థితి లేదు'' అంటూ వ్యాఖ్యలు చేశారు. బుధవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై చర్చ ఇందుకు వేదికైంది. ''కాశీ, అయోధ్య, మథుర విషయంలో మొండితనం, రాజకీయాలు కలగలిసి ఓటు బ్యాంకు రాజకీయాలుగా మారి పరిస్థితిని సంక్లిష్టంగా మార్చేశాయి'' అంటూ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలపై విమర్శలు గుప్పించారు. మథురలో కృష్ణుని పురాతన ఆలయాన్ని కూల్చి మసీదు నిర్మించారన్న వివాదం ప్రస్తుతం కోర్టులో ఉన్న విషయం తెలిసిందే.



పేలుడు అనంతరం ఘటనాస్థలి వద్ద భీతావహ పరిస్థితి

పాక్‌లో పేలుళ్లు.. 30 మంది బలి

కరాచీ: సార్వత్రిక ఎన్నికలకు పాకిస్తాన్ సిద్ధమవుతున్న వేళ బుధవారం జంట పేలుళ్లతో పాకిస్తాన్ దద్దరిల్లింది. వేర్వేరు చోట్ల జరిగిన ఈ బాంబు పేలుడు ఘటనల్లో మొత్తంగా 25 మంది మరణించారు. 42 మంది గాయపడ్డారు. పర్వతమయమైన బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని వేర్వేరు పార్టీ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని ఈ జంట పేలుళ్లు జరిపారని స్థానిక మీడియాలో వార్తలొచ్చాయి. అయితే ఈ పేలుళ్లు జరిపింది తామేనని ఇంతవరకు ఏ ఉగ్రసంస్థ ప్రకటించుకోలేదు. తొలి పేలుడు పిషిన్ జిల్లాలోని స్వతంత్ర అభ్యర్థి అస్ఫాందర్ ఖాన్ కకర్ ఆఫీస్ బయట జరిగింది. ఈ పేలుడులో 20 మంది మరణించారు. 30 మంది గాయపడ్డారు. ఒక గంట తర్వాత కిల్లా అబ్దుల్లా ప్రాంతంలోని జమియత్ ఉలేమా ఇస్లామ్–పాకిస్తాన్ పార్టీ కార్యాలయం బయట జరిగింది. ఈ ఘటనలో పది మంది ప్రాణాలు కోల్పోయారు. ఎన్నికల ప్రక్రియల్లో పౌరుల భాగస్వామ్యాన్ని తగ్గించేందుకే ఇలా ఉగ్రవాదులు బాంబు దాడులతో భయపెడుతున్నారని బలూచిస్తాన్ పంజ్‌ఘర్ సీనియర్ పోలీసు అధికారి అబ్దుల్లా చెప్పారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బాంబుపేలుళ్లు జరగడంతో పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను పటిష్టం చేశారు.

బలూచిస్తాన్‌లో పెరిగిన దాడులు

అఫ్గానిస్తాన్, ఇరాన్‌లతో సరిహద్దులు పంచుకుంటున్న పర్వతమయ బలూచిస్తాన్‌లో ఇటీవల బాంబు దాడులు ఎక్కువయ్యాయి. మంగళవారం సైతం 10 గ్రెనేడ్ దాడులు జరిగాయి. వేర్వేరు ప్రావిన్స్‌లలోని భద్రతా పోస్ట్‌లు, ఎన్నికల ప్రచార కార్యాలయాలు, ర్యాలీలపై ఈ దాడులు జరిగాయి. ఆదివారం నుంచి లెక్కిస్తే ఈ సంఖ్య ఏకంగా 50కి చేరింది. చాన్నాళ్ల నుంచి బలూచిస్తాన్‌లో వేర్పేరువాద శక్తుల క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. సైన్యం ఏరివేత చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జనవరిలో 24 మంది ఉగ్రవాదులు హతమయ్యారు.

పాక్‌లో నేడే సార్వత్రిక ఎన్నికలు

ఇస్లామాబాద్: పెచ్చరిల్లిన హింస, పెట్రేగిన ఉగ్రదాడులు, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్తాన్‌లో గురువారం సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమైంది. మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఊచలు లెక్కపెడుతున్న వేళ ఆరేళ్ల ప్రవాసం నుంచి తిరిగొచ్చిన మరో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సైన్యం దన్నుతో అధికార పగ్గాలు చేపట్టే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. అదే జరిగితే 74 ఏళ్ల షరీఫ్ రికార్డుస్థాయిలో నాలుగోసారి పాక్ ప్రధాని అవుతారు. నవాజ్‌కు చెందిన పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్ పార్టీ అత్యధిక సీట్లు సాధించేలా కన్పిస్తోంది. ఇమ్రాన్ పార్టీ పీటీఐ ఎన్నికల గుర్తు క్రికెట్ బ్యాట్‌పై ఈసీ నిషేధం విధించింది. దాంతో పీటీఐ అభ్యర్థులంతా స్వతంత్రులుగా బరిలో దిగారు. బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) సైతం ఈసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. 12.85 కోట్ల ఓటర్లు ఈసారి ఎన్నికల ప్రక్రియలో పాలుపంచుకోనున్నారు. బుధవారమే బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు జంట బాంబుదాడులతో పదుల సంఖ్యలో ప్రాణాలు బలి తీసుకున్న నేపథ్యంలో 6.5 లక్షల మంది భద్రతా సిబ్బందితో పోలింగ్‌స్టేషన్ల వద్ద భద్రతను కట్టుదిట్టంచేశారు. నేషనల్ అసెంబ్లీ(పార్లమెంట్) ఎన్నికల్లో ఈసారి 5,121 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 336 సీట్లకుగాను 266 సీట్లకు బుధవారం పోలింగ్ జరగనుంది. మరో 60 సీట్లు మహిళలకు రిజర్వ్‌చేశారు. మరో 10 సీట్లు మైనారిటీలకు రిజర్వ్‌చేశారు. ఇంకొన్ని సీట్లు పార్టీలు గెలిచిన సీట్లను బట్టి దామాషా పద్ధతిలో కేటాయిస్తారు. కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకూ గురువారమే ఎన్నికలు జరుగుతున్నాయి.



బుధవారం ఢిల్లీ మెట్రో రైల్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మరో భారతీయ విద్యార్థి అమెరికాలో దుర్మరణం



సమీర్ కామత్

న్యూయార్క్: ఎన్నో ఆశలతో అమెరికాలో అడుగుపెడుతున్న కొందరు భారతీయ విద్యార్థుల భవిత అర్ధంతరంగా ముగిసిపోతోంది. ఆ విషాదపర్వంలో మరో ఉదంతం తాజాగా చోటుచేసుకుంది. భారతీయ మూలాలున్న విద్యార్థి సమీర్ కామత్ సోమవారం సాయంత్రం ఇండియానా రాష్ట్రంలో విగతజీవిగా కనిపించారు. 23 ఏళ్ల సమీర్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. క్రోస్ గ్రో ప్రాంతంలోని స్థానిక నేచర్ ప్రిసర్వ్‌లో సమీర్ మృతదేహాన్ని కనుగొన్నట్లు వారెంట్ కౌంటీ అధికారి వెల్లడించారు. పోస్ట్‌మార్టమ్ నివేదిక వచ్చాకే మరణానికి కారణాలపై అంచనాకు రాగలమన్నారు.

హైదరాబాద్ విద్యార్థిపై దాడి

అమెరికాలో భారతీయ విద్యార్థులపై దాడుల పరంపర కొనసాగుతోంది. తాజాగా హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ మజహర్ అలీ అనే విద్యార్థిపై దుండుగులు దాడికి పాల్పడ్డారు. అతను ఇండియానా వెస్లియాన్ యూనివర్సిటీలో ఐటీలో మాస్టర్స్ చదువుతూ షికాగోలో నివసిస్తున్నాడు. ఈ నెల 4న ఇంటి సమీపంలో ముగ్గురు దండగులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఇటీవల పలువురు భారత విద్యార్థులు అమెరికాలో హత్యకు గురవడం తెలిసిందే.

17న మా ముందు హాజరు కండి

ఈడీ ఫిర్యాదుపై కేజ్రీవాల్‌ను ఆదేశించిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం కుంభకోణం కేసులో ఐదుసార్లు సమన్లు ఇచ్చినా ఆప్ చీఫ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విచారణకు రావడం లేదంటూ ఈడీ బుధవారం ఢిల్లీ కోర్టును ఆశ్రయించింది. దాంతో ఫిబ్రవరి 17న వ్యక్తిగతంగా తమ ఎదుట హాజరవాలని కేజ్రీవాల్‌ను ఢిల్లీ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దివ్య మల్హోత్రా ఆదేశించారు. ఈ మేరకు ఆయనకు సమన్లు జారీ చేశారు. వీటిపై చట్టపరంగా ముందుకెళ్తామని ఆప్ ప్రకటించింది.

కేసు ఫైళ్లలో కులం, మతం వద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: కేసు ఫైళ్లలో కక్షిదారుల కులం గానీ, మతం గానీ ప్రస్తావించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు బుధవారం పునరుద్ఘాటించింది. ఈ విషయంలో ఇప్పటికే జారీ చేసిన ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని రిజిస్ట్రీ అధికారులతో పాటు అన్ని కోర్టులనూ ఆదేశించింది.

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ–శరద్‌చంద్ర పవార్

శరద్ పవార్ వర్గానికి పేరును కేటాయించిన ఈసీ

న్యూఢిల్లీ: ఎన్సీపీ పేరు, పార్టీ ఎన్నికల గుర్తు అజిత్ పవార్ వర్గం పరమైన నేపథ్యంలో శరద్ పవార్ వర్గానికి కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం కొత్త పేరు కేటాయించింది. ఈసీకి అది సూచించిన మూడు పేర్లలో 'నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ–శరద్‌చంద్ర పవార్' పేరును ఖరారు చేసింది. తమ ఎన్నికల గుర్తు మర్రి చెట్టు అయితే బాగుంటుందని శరద్ వర్గం భావిస్తోంది.

కలుషితాహారంతో 2,000 మందికి అస్వస్థత

ఛత్రపతి శంభాజీనగర్: మహారాష్ట్రలో నాందేడ్ జిల్లాలో కోష్టవాడీ గ్రామంలో మంగళవారం మతపర కార్యక్రమంలో కలుషిత ఆహారం తిన్న ఘటనలో 2,000 మంది ఆస్పత్రుల పాలయ్యారు. బుధవారం తెల్లవారుజామున వాంతులు, విరేచనాలతో తొలుత 150 మంది ఆస్పత్రులపాలయ్యారు. తర్వాత సంఖ్య 2,000కు చేరింది. అయితే ఇప్పటిదాకా ఎవరూ చనిపోలేదు.



శతాబ్ది సంబరం.. అంతా సిద్ధం

శతాబ్ది సంబరాలకు గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం ముస్తాబైంది. ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగే తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. -8లో▸



కలెక్టర్‌ను కలిసిన డీఎస్‌ఈఓ

గాంధీనగర్: డీఎస్‌ఈఓగా బుధవారం విధుల్లో చేరిన యు.వి.సుబ్బారావు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.



సాంస్కృతిక వైభవం..

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న భారత్ రంగస్థల మహోత్సవ్ ఉత్సవాలు భారతీయ నాటక రంగ విశిష్టతను, జాతీయ సాంస్కృతిక వారసత్వాన్ని చాటుతున్నాయి. -8లో▸

న్యూస్‌రీల్

రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేయండి



విజయవాడస్పోర్ట్స్: అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణించి రాష్ట్ర ఖ్యాతిని చాటాలని స్కేటింగ్ జాతీయ క్రీడాకారులు జెస్సీరాజ్, జోయల్ ఆదర్శ్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రిని రైల్వేకోడూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసులు, దెందులూరు ఎమ్మెల్యే కె.అబ్బయ్యచౌదరి సమక్షంలో విజయవాడకు చెందిన ఇద్దరు క్రీడాకారులు బుధవారం కలిశారు. జెస్సీరాజ్ ఆర్టిస్టిక్ సోలో స్కేటింగ్ పోటీల్లో రాణించి ఇప్పటి వరకు 20 (8 గోల్డ్, 7 సిల్వర్, 5 బ్రాంజ్) రాష్ట్ర, జాతీయ స్థాయి పతకాలు, జోయల్ ఆదర్శ్ 7 (4గోల్డ్, 3 బ్రాంజ్) రాష్ట్ర, జాతీయ పతకాలు సాధించారు. ఇటీవల చెన్నైలో జరిగిన జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని సీఎం జగన్‌ను కలిశారు. అంతర్జాతీయ పోటీల్లోనూ పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని క్రీడాకారులకు ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వం పరంగా అందించే ప్రోత్సాహాలను ఇద్దరు క్రీడాకారులకు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

13 నుంచి జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌పై శిక్షణ

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థకు చెందిన స్కిల్ హబ్‌లో ఈ నెల 13 నుంచి జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కృష్ణా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన సాంకేతికతను ఉపయోగించి ఇండస్ట్రీ నిపుణుల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 94940 05725 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మధ్యాహ్న భోజనం అమలుపై ఆకస్మిక తనిఖీ



రామవరప్పాడు(గన్నవరం): విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఎండీఎం అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి బృందం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. విద్యార్థులకు వండి వడ్డించే ఆహార పదార్థాల నాణ్యత, స్టాకు రిజిస్టర్‌ను అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని వంట ఏజెన్సీ నిర్వాహకులను ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మధ్యాహ్న భోజన పథకం అమలుచేస్తోందన్నారు. ఈ పరిశీలనలో డీవైఈఓ కె.వి.ఎన్.కుమార్, ఎఎస్ఓ గరీబ్ నాయుడు, డీపీఓ విద్యారాణి, మండల విద్యాశాఖ అధికారులు ఆదూరి వెంకటరత్నం, సూరిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని తాయారు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలి


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నవరత్నాలు –పేదలందరికీ ఇళ్లు పథకం కింద లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం కాంప్లెక్స్‌లోని 89వ వార్డు సచివాలయాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. వార్డు సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఆరా తీశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా సాగేలా చూడాలని ఆదేశించారు. లబ్ధిదారులకు సరైన సమాచారం అందించాలని వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ పి.మనోహర్, వీఆర్వో ఎం.త్రివేణికి స్పష్టం చేశారు. సచివాలయం పరిధిలో సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలన్నారు.

సరిహద్దులపై నిఘానేత్రం

- ఎన్నికల వేళ రాష్ట్ర సరిహద్దుల్లో 11 చెక్ పోస్టుల ఏర్పాటు
- మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది
- తనిఖీలను విస్తృతం చేసిన పోలీసు అధికారులు
- రూ.6.32 కోట్ల విలువైన నగదు, బంగారు, వెండి స్వాధీనం
- ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణే ధ్యేయమన్న సీపీ టి.కె.రాణా



జిల్లా సరిహద్దుల్లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దుల్లో సైతం నిఘా పెంచారు. విస్తృత సోదాల కోసం సాంకేతిక వనరులను సమకూర్చుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల నుంచి అక్రమంగా నగదు, మద్యం రవాణాను అరికట్టేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు అనుగుణంగా విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రలోభాలకు అడ్డుకట్ట వేసేలా ప్రణాళికలు రచించారు. అసాంఘిక శక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచారు.

నిరంతర నిఘా

రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలను ఇప్పటికే పోలీస్ శాఖ తన కనుసన్నల్లోకి తీసుకుంది. తెలంగాణతో సరిహద్దులు పంచుకుంటున్న గరికపాడు (జగ్గయ్యపేట), జొన్నలగడ్డ (నందిగామ), వత్సవాయి, పెద్దాపురం (వీరులపాడు), ముక్త్యాల (చిల్లకల్లు), గండ్రాయి (చిల్లకల్లు), రాజుపేట (తిరువూరు), రాజవరం (గంపలగూడెం), వేమిరెడ్డిపల్లి, మెరుసుమిల్లి, గంగినేని పాలెంలో చెక్ పోస్టులు ఏర్పాటయ్యాయి. వీటి వద్ద నిరంతర సోదాలు జరుగుతున్నాయి. ఒక్కొక్క చెక్ పోస్టులో ముగ్గురు ఎస్ఐలు, ఆరుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 18 మంది కానిస్టేబుళ్లు, ముగ్గురు మహిళా కానిస్టేబుళ్లు మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల సరిహద్దుల్లోనూ నిఘా పెంచారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర జిల్లాల నుంచి అక్రమంగా వచ్చే డబ్బు, మద్యం, ఇతర మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. ఎన్నికల్లో అక్రమాలను అడ్డుకునేందుకు పోలీస్ యంత్రాంగం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. విజయవాడ సిటీతో పాటు ఆయా మండల, నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటైన సీసీ కెమెరాలను గస్తీ కోసం వినియోగించనుంది. రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లోని సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంనకు అనుసంధానం చేసింది.

తనిఖీలు ముమ్మరం

ఎన్నికల సంఘం ముందస్తు ఆదేశాల మేరకు జిల్లాలో పోలీస్ యంత్రాంగం సోదాలను ముమ్మరం చేసింది. టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్, ఎస్ఈబీ, ఏఆర్, దిశ, సైబర్, స్పెషల్ బ్రాంచ్, హోం గార్డ్ తదితర విభాగాలను ఉన్నతాధికారులు ఏకతాటిపైకి తీసుకొచ్చారు. విజయవాడ సిటీతో పాటు, రూరల్ మండలాల్లోని అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించారు. తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం నియోజకవర్గాల్లోని గ్రామాల్లో గతంలో నాటు సారా తయారు చేసే వ్యక్తులపై, పాత నేరస్తుల కదలికలపై దృష్టి సారించారు. పలు నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవించినా జీవన శైలిలో మార్పు తెచ్చుకోని పలువురిని ఇప్పటికే జిల్లా నుంచి బహిష్కరించారు. నిరంతరం అల్లర్లకు పాల్పడే వారు, గంజాయి, మాదక ద్రవ్యాలను రవాణా చేసే వ్యక్తులతో పాటు, సేవించే వ్యక్తుల వివరాలను పోలీసులు సేకరించారు. వారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేందుకు సిద్ధమైతే వెంటనే అరెస్ట్ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో పలువురిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. రవాణా, ఎక్సైజ్‌తో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటున్నారు.



బస్సులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

అణువణువూ శోధిస్తున్నాం



సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే ప్రధాన ధ్యేయం. ఎన్నికల కమిషనర్ ఆదేశాలతో అన్ని సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం చేశాం. పాత నేరస్తులను బైండోవర్ చేస్తున్నాం. అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచాం. అసాంఘిక శక్తులపై బహిష్కరణ వేటు, పీడీ యాక్ట్ అమలు చేశాం. నగదు, మద్యం, ఇతర మాదక ద్రవ్యాలు జిల్లాలోకి ప్రవేశించకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను సమన్వయం చేసుకుని నిఘాను పటిష్టం చేస్తాం. రాష్ట్ర సరిహద్దుల్లో బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలను అణువణువునా శోధిస్తున్నాం.

– టి.కె.రాణా, పోలీస్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా

పెద్ద మొత్తంలో సొత్తు స్వాధీనం

సరిహద్దుల్లో పోలీసుల తనిఖీలు ముమ్మరం చేశారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని కచ్చితంగా తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాకు అక్రమంగా తీసుకొచ్చిన నగదు, విదేశీ మద్యం, స్వదేశీ మద్యం, నాటు సారా, బంగారం, వెండిని భారీ స్థాయిలోనే స్వాధీనం చేసుకున్నారు. రూ.2,89,52,213 నగదు, రూ.86.08 లక్షల విలువ జేసే 28,685 లీటర్ల ఐడీ లిక్కర్, రూ.21.86 లక్షల విలువైన 173 లీటర్లు ఎన్‌డీపీ లిక్కర్, రూ.57.51 లక్షల విలువ చేసే 8,218 లీటర్ల డీపీ లిక్కర్, రూ.1.34 లక్షల విలువైన 32 కిలోల గంజాయి. రూ.3.43 కోట్ల విలువైన 5.3 కిలోల బంగారం, 29 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు.

సామాన్య భక్తులకు సేవకుల్లా..



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మకర్త మండలి సభ్యుల్లా కాకుండా సామాన్య భక్తుల సేవకుల్లా సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. దుర్గగుడి ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసి ఏడాది పూర్తి కావడంతో చైర్మన్ రాంబాబు, పాలక మండలి సభ్యులు బుధవారం మీడియాతో మాట్లాడారు. తొలుత అమ్మవారి మెట్ల పూజలో చైర్మన్, ధర్మకర్తల సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ చాంబర్‌లో మీడియాతో రాంబాబు మాట్లాడారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ధర్మకర్తల మండలి సభ్యులుగా, చైర్మన్‌గా ఎంపిక కావడం ఎన్నో జన్మల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఏడాది కాలంలో సామాన్య భక్తుల సౌకర్యార్థం ప్రతిపాదనలు చేయడమే కాకుండా వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అమలులోకి తెచ్చామన్నారు. ముఖ్యంగా దుర్గ ఘాట్‌లో పుణ్య స్నానాలు, భక్తులకు ఉచిత బస్సు సర్వీసులు, ఆలయ ప్రాంగణంలో నిద్ర చేసే భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదం వంటి సదుపాయాలు కల్పించామన్నారు. పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో శాశ్వత ప్రాతిపదికన అన్నదాన భవనం, ప్రసాదాల పోటుతో పాటు యాగశాల, పూజా మందిరాల నిర్మాణం చేపట్టామన్నారు. వచ్చే ఏడాది కాలంలో ఆయా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం, ఏఈఓ వెంకటరెడ్డి, ఎస్.రమేష్‌బాబు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

సాయుధ దళాల నిధికి కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ విరాళం



కలెక్టర్ ఢిల్లీరావుకు చెక్కు అందజేస్తున్న బ్యాంకు ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ సైనికులు, దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన వీర జవానుల కుటుంబాల సంక్షేమానికి చేపట్టే కార్యక్రమాలకు ఉద్దేశించిన సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ రూ.2 లక్షల విరాళం ప్రకటించింది. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఢిల్లీరావుకు బ్యాంక్ ప్రతినిధులు విరాళం చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ ముందుకొచ్చి రూ. 2 లక్షలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో వ్యక్తిగతంగా, సంస్థల తరఫున విరాళాలు అందజేయాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణకు కృషిచేసిన సైనికుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారి కుటుంబాలకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి –2022 కార్యక్రమం ద్వారా రూ.41.22 లక్షలను సమకూర్చి దక్షిణ భారతదేశంలోనే ఎన్టీఆర్ జిల్లా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ చీఫ్ క్రెడిట్ ఆఫీసర్ వై.సత్యనారాయణ ప్రసాద్, ఏజీఎం ఎ.మదన్ మోహన్, విజయవాడ క్లస్టర్ హెడ్ జె.హరిప్రసాద్, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సూపరింటెండెంట్ వై.ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి విరివిగా రుణాలివ్వండి

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందించి ఉత్పాదకత పెంచేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు కోరారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులతో ఆయన బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. వరి, వేరుశనగ, పత్తి తదితర పంటలతో పాటు మత్స్య, ఉద్యాన, పశుసంవర్ధక రంగాల్లో పెరుగుతున్న ఖర్చుల ఆధారంగా రుణ పరిమితిని పెంచి పంట రుణాలు అందించాలని కలెక్టర్ సూచించారు. 2024–25 సంవత్సరానికి ఖరీఫ్ సీజన్‌లోని ఎకరా వరికి రూ.42,700 ఖర్చవుతుండగా రూ.83 వేల విలువైన స్థూల దిగుబడి వస్తోందని ఆయా శాఖలకు సంబంధించిన అంచనా ప్రకారం రూ.41,500 పంట రుణం అందించేలా నిబంధనల ప్రకారం నిర్ణయించారని బ్యాంకు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అయితే పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులను దృష్టిలో ఉంచుకుని రుణ పరిమితిని రూ.50 వేలకు పెంచేలా చూడాలని వ్యవసాయ సలహామండలి జిల్లా సభ్యుడు పెన్నేరు ప్రభాకరరావు కలెక్టర్‌ను కోరారు. వరితో పాటు చెరకు పంటకు రుణ పరిమితిని పెంచేలా ప్రభుత్వానికి ప్రతిపాదించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కౌలు రైతులకు కార్డుల ఆధారంగా రుణాలు అందించటంలో అధికారులు చొరవ చూపాలన్నారు. జిల్లాలో మత్స్యకారులకు రుణపరిమితి నిర్ణయించేందుకు లైసెన్సు కలిగిన మత్స్యకారుల ఖర్చు వివరాలను బ్యాంకు అధికారులకు సమర్పించాలని మత్స్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వ్యవసాయ శాఖ చిరుధాన్యాలతో రుచికరమైన 100 రకాల వంటలు, నాబార్డు క్రెడిట్ ప్లాన్ పుస్తకాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కేడీసీసీ బ్యాంక్ సీఈఓ ఎ.శ్యామ్‌మనోహర్, జనరల్ మేనేజర్ బి.ఎల్.చంద్రశేఖర్, డీజీఎం బి.వరాలమ్మ, ఎల్‌డీఎం పీఎస్ జయవర్ధన్, వ్యవసాయశాఖ అధికారి ఎన్.పద్మావతి, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయండి

కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి



కంకిపాడు చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలోని చెక్‌పోస్టుల వద్ద పోలీస్ సిబ్బంది ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలని ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశించారు. జిల్లాలోని పలు చెక్‌పోస్ట్‌లను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయా చెక్‌పోస్ట్‌ల వద్ద పికెట్‌లో ఉన్న సిబ్బందితో మాట్లాడి వాహనాల తనిఖీలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలోకి వచ్చే వాహనాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వాహనాల తనిఖీల విషయంలో ఎటువంటి ఒత్తిళ్లకూ తలొగ్గొద్దని స్పష్టంచేశారు. అనుమానం వచ్చిన వాహనాలను పక్కకు పెట్టి సంబంధిత యజమాని నుంచి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు. వివరాలు సంతృప్తికరంగా లేకుంటే పోలీసు చర్యలకు ఉపక్రమించాలన్నారు. ఏ ఒక్కరితోనూ అమర్యాదగా మాట్లాడవద్దని స్పష్టంచేశారు. మద్యం, సారా, నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గంజాయి రవాణా జరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే సంబంధిత వాహనాన్ని సీజ్ చేసి అప్పటికప్పుడు కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి పోలీస్ పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విధుల్లో అలసత్వం వహించినా, నిర్లక్ష్యం ప్రదర్శించినా చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు.

ఓటర్ల జాబితాపై కథనాలు అవాస్తవం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటర్ల జాబితా బదిలీలో అవకతవకలు జరుగుతున్నాయంటూ పత్రికల్లో వచ్చిన వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు స్పష్టంచేశారు. ఓటర్ల జాబితాలో బదిలీలకు పన్నాగం పన్ని వేలాది ఓట్లను ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి మార్పులు చేస్తున్నారనేది అవాస్తవమన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలు, నమోదుపై కలెక్టర్ ఢిల్లీరావు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా, తుది ఓటర్ల జాబితా రూపకల్పనలో రాజకీయ ప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామన్నారు. అవకతవకలు లేకుండా పారదర్శక జాబితాను రూపొందిస్తూ తీసుకున్న చర్యలను ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి దృష్టికి తీసుకొస్తున్నామని గుర్తుచేశారు. బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో బదిలీల్లో తప్పులు జరుగుతున్నట్లు తమ దృష్టికి రాలేదన్నారు. పత్రికల్లో వస్తున్న నిరాధార వార్తలపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. అర్హులు ఎవరైనా ఉంటే ఓటు హక్కు కోసం పేర్లు నమోదు చేసుకునేలా ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ సమావేశం రసాభాస

మైలవరం: స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు హైదరాబాద్‌లో ఉండగా మైలవరం టీడీపీ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. ఇటీవల ఐతవరంలో వసంత వెంకట కృష్ణప్రసాద్ నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో చేసిన వ్యాఖ్యలను టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు వ్యతిరేకించారు. వసంత కృష్ణ ప్రసాద్‌ను టీడీపీలోకి ఎవరు పిలిచారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ జనసేన నుంచి టికెట్ తెచ్చుకుని తెలుగుదేశం పార్టీ మద్దతుతో వసంత పోటీచేయాల్సి వస్తే స్వాగతిస్తారా అని మీడియా ప్రశ్నించగా, జనసేన నుంచి టికెట్ తెచ్చుకున్నా పనిచేయబోమని కొందరు, చంద్రబాబు అభిప్రాయాన్ని గౌరవిస్తామని మరి కొందరు చెప్పారు. దీంతో నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు వచ్చాయి. నాయకుల మధ్య సమన్వయం లేనప్పుడు సమావేశం ఎందుకంటూ సీనియర్ నాయకుడు కోమటి సుధాకరరావు లేచి వెళ్లిపోయారు. అనంతరం టీడీపీ నాయకులు సమావేశాన్ని కొనసాగించారు. లోకేష్ చదువును వసంత విమర్శించాడని, చంద్రబాబును జైలుకు పంపితే కామెంట్ చేశాడని, ఎంపీ కేశినేని నానితో కలిసి కొండపల్లి మునిసిపాలిటీ ఫలితం తేలకుండా చేశాడని ఆరోపించారు. దేవినేని ఉమామహేశ్వరరావుకే సీటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వజ్రాల కుమార్‌రెడ్డి, ధనేకుల సాంబశివరావు, బి.సుధాకర్, మల్లెల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా సేవలో జస్టిస్ రవి



బాబా మందిరాన్ని సందర్శించిన జస్టిస్ రవి తదితరులు

పెనమలూరు: మండలంలోని కానూరులో వేంచేసిన శ్రీ గీతాసాయి మందిరంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయమూర్తి బుధవారం గ్రామంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో బాబాను దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేయించారు. న్యాయమూర్తిని మందిర నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కానూరు మాజీ సర్పంచి అన్నే సుజాత, వైఎస్సార్ సీపీ మునిసిపల్ అధ్యక్షుడు అన్నే శ్రావణ్ కుమార్, వేమూరి బాలకృష్ణ పాల్గొన్నారు.

సుబ్బారాయుడి వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి

ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చక్రధరరావు



మోపిదేవి(అవనిగడ్డ): ప్రసిద్ధ శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ ఈఓ ఎస్.ఎస్.చక్రధరరావు కోరారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. తొలి రోజు స్వామిని పెండ్లికుమారుడిని చేసి పట్టువస్త్రాలు సమర్పిస్తామన్నారు. 14వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు శేషవాహనంపై రావివారిపాలెం వరకు గ్రామోత్సవం, 15వ తేదీ రాత్రి స్వామి రథోత్సవం కనుల పండువగా జరుగుతాయని పేర్కొన్నారు. 16వ తేదీ ఉదయం వసంతోత్సవం, శ్రీ సుబ్రహ్మణ్య మాల దీక్షా విరమణ, మధ్యాహ్నం వేద విద్వత్ సభ, పండిత సత్కారం, శమీవృక్ష పూజ, రాత్రి మయూర వాహనంపై రావివారిపాలెం వరకు గ్రామోత్సవం జరుగుతాయని వివరించారు. 17వ తేదీ ఉదయం సుబ్రహ్మణ్య హవనం, రాత్రి ఎనిమిది గంటలకు స్వామి వారి పుష్పశయ్యాలంకృత పర్యంకసేవతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు రూ.2,500 చెల్లించి సుబ్రహ్మణ్య హవనంలో పాల్గొనవచ్చని సూచించారు. ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ హోదాలో ఈఓగా కొనసాగిన తనను అసిస్టెంట్ కమిషనర్‌గా ప్రభుత్వం రెగ్యులర్ చేసిందని ఎస్.ఎస్. చక్రధరరావు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సమర్థంగా కృషిచేస్తానని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి, పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం

సీఐఐ ఏపీ టూరిజం ప్యానల్ కన్వీనర్ తరుణ్



లబ్బీపేట(విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ 2024–25 బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టడం స్వాగతించే విషయమని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ టూరిజం ప్యానల్ కన్వీనర్ తరుణ్ కాకాని అన్నారు. రాష్ట్రంలో పది ఫిషింగ్ హార్బర్లు, నాలుగు కొత్త పోర్టులు ఏర్పాటు చేయడం వల్ల 75 వేల మందికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. అంతేకాకుండా విజయవాడలో రూ.400 కోట్లతో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం కూడా రానున్న రోజుల్లో ముఖ్య పర్యాటక కేంద్రంగా ప్రాచుర్యం పొందుతుందని వివరించారు. అదే విధంగా విశాఖ ఆర్కే బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ఏర్పాటుకు నిర్ణయించడం మంచి పరిణామం అని తరుణ్ పేర్కొన్నారు.

రంగుల మండపం వద్ద పూజలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని రంగుబజారు లోగల తిరుపతమ్మవారి రంగుల మండపంలో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తుల తిరుపతమ్మవారు, గోపయ్య స్వామి, సహదేవతల విగ్రహాలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆధ్యాత్మిక సంఘాల ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా, లలిత సహస్రనామ పారాయణం, భజన బృందం గురుస్వాములచే భజన, కోలాటం కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో రంగుల మహోత్సవం ఉత్సవ కమిటీ ప్రతినిధులు నాని బాజీ, ఆలమూరి శేషు, తుమ్మల పద్మ, దువ్వల రామకృష్ణ, పుట్టపర్తిన రామారావు పాల్గొన్నారు.

యార్డుకు 1,30,662 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,30,662 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,26,797 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 21,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 21,800 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది.

శతాబ్ది సంబరం.. అంతా సిద్ధం



బిషప్ గ్రాసీ ప్రాంగణంలో ముస్తాబవుతున్న వేదిక



తిరునాళ్లకు సిద్ధమైన గుణదల పుణ్యక్షేత్రం

గుణదల మేరీమాత క్షేత్రానికి ఉత్సవ శోభ

గుణదల (విజయవాడ తూర్పు): శతాబ్ది సంబరాలకు ప్రసిద్ధ గుణదల మేరీమాత పుణ్య క్షేత్రం ముస్తాబైంది. ఈ నెల 9, 10, 11 తేదీలలో జరిగే తిరునాళ్లకు అంతా సిద్ధమైంది. ఆలయ ప్రతిష్టాపన జరిగి నూరు వసంతాలు పూర్తయిన నేపథ్యంలో శత జయంతి ఉత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పుణ్యక్షేత్ర పాలక వర్గం చర్యలు తీసుకుంది. అనేక ప్రాంతాల నుంచి లక్షలాది మంది యాత్రికులు రానుండటంతో.. వారికి సకల వసతులు కల్పించే దిశగా ఆలయ గురువులు పనులు చేపట్టారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయం దిగువ భాగంలో ఉత్సవాల సమష్టి దివ్యబలి పూజలు నిర్వహించేందుకు ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. ఉత్సవాల మూడు రోజులు భక్తి కార్యక్రమాలు ఈ వేదికపై జరుగుతాయి. భక్తులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు తిలకించేందుకు, సేదదీరేందుకు వీలుగా బిషప్ గ్రాసీ పాఠశాల ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. మరియమాతను దర్శించుకునేందుకు కొండ పైకి వెళ్లే భక్తుల కోసం బారికేట్లతో కాలిబాటలు సిద్ధం చేశారు. పుణ్యక్షేత్ర ప్రాంగణాలన్నింటిలో మొబైల్ మరుగుదొడ్లు అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా పుణ్యక్షేత్ర ప్రధానాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దిగువ నుంచి కొండ శిఖరాగ్రం వరకు విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. పుణ్యక్షేత్రం స్థాపించి నూరు వసంతాలు పూర్తయిన నేపథ్యంలో పుణ్యక్షేత్ర ముఖ ద్వారాల వద్ద 100 సంఖ్యతో ప్రత్యేక ఆర్చిలను నిర్మించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పోలీసులు, విద్యుత్, వీఎంసీ అధికారుల సహకారంతో ఈ ఉత్సవాలు జరగనున్నాయి.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఇప్పటికే ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. అదే విధంగా జనరల్, వొకేషనల్ గ్రూపులకు సంబంధించి థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు 99 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. 40,082 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 35,494 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 75,576 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు.

సిబ్బంది నియామకం..

పరీక్షల నిర్వహణకు సంబంధించి 99 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 29 మంది కస్టోడియన్ అధికారులను నియమించామని కలెక్టర్ చెప్పారు. 18 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష పత్రాలను స్టోరేజ్ పాయింట్ల నుంచి పరీక్ష కేంద్రాలకు తరలింపు మొదలు ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. బందోబస్తు ఏర్పాటు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిఘా విషయంలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు సంబంధించి అయిదేసి చొప్పున బృందాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

ఉచిత ప్రయాణం..

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని.. హాల్ టికెట్‌తో ఉచితంగా ప్రయాణించేలా చూడాలని కలెక్టర్ సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన పరీక్షల నిర్వహణ విషయంలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ ఢిల్లీరావు స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి (డీఐఈవో) సీఎస్ఎస్ఎన్ రెడ్డి, డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, డాక్టర్ ఆర్.బాలాజీ నాయక్, ఏపీఎస్ ఆర్టీసీ ప్రతినిధి ఎంవై దానం, ఏఎస్‌పీవో ఎం.సత్యనారాయణ, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ ఎం.మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

లారీ ఓనర్స్ సదస్సులో జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శ్రీదేవి



మాట్లాడుతున్న రాష్ట్ర జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శ్రీదేవి

లబ్బీపేట(విజయవాడతూర్పు): దురలవాట్లకు దూరంగా ఉంటేనే రోడ్డుప్రమాదాలు నివారించగలమని రాష్ట్ర జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ సీహెచ్ శ్రీదేవి అన్నారు. కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం విజయవాడలోని అసోసియేషన్ హాలులో రహదారి భద్రతపై జరిగిన సదస్సులో శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గతేడాది రాష్ట్రంలో 20 వేల రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 8 వేల మంది మృతి చెందినట్లు పేర్కొన్నారు. రహదారి ప్రమాదాల్లో ఐదో స్థానం నుంచి విజయవాడ మొదటి స్థానానికి వచ్చిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వాహనం నడపాలని సూచించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా డీటీసీ ఎం. పురేంద్ర మాట్లాడుతూ దేశంలో వాహనాలు 40 కోట్లకు పెరగడంతో మంచి రహదారులున్నా ప్రమాదాలు తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ డెప్యూటీ జనరల్ మేనేజర్ (టెక్నికల్) ఎంకే చౌదరి మాట్లాడుతూ హైవేపై ప్రతి 50 కిమీ పరిధిలో అంబులెన్స్, పెట్రోలింగ్ వాహనం అందుబాటులో ఉంచామని, 108కి బదులు టోల్ ఫ్రీ నంబరు 1033కు కాల్ చేస్తే తక్షణ సాయం అందుతుందన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగమోతు రాజా, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్ బాబు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖరరావు, ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీఈశ్వరరావు, సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు కోనేరు వెంకట రమేష్, కె. జగదీశ్వరరావు, ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ రామారావు, కె. సాయిరాం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం



మల్లికార్జునరావు (ఫైల్)



విజయబాబు (ఫైల్)

విస్సన్నపేట: స్థానిక నూజివీడు రోడ్డులో రాణి కల్యాణ మండపం సమీపంలో లారీ, బైక్ ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు యువకులు సంఘటనా స్థలంలోనే మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. మండలంలోని కొండపర్వ గ్రామానికి చెందిన కోలా మల్లికార్జునరావు (25), మాణికల విజయబాబు (23) బైక్‌పై విస్సన్నపేట నుంచి కొండపర్వ గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా చేపల లోడుతో వస్తున్న లారీ, బైక్‌ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్ ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు మృతి చెందారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ప్రమాదంలో మృతి చెందటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి. రామకృష్ణ తెలిపారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుల కుటుంబ సభ్యులను తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు పరామర్శించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక



సీతనపల్లి మంచినీటి చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

కృత్తివెన్ను/బంటుమిల్లి: వచ్చే వేసవిలో తీరప్రాంతమైన కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాలలో తాగునీటిల ఎద్దడి లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోనున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. బుధవారం కృత్తివెన్ను మండలంలోని సీతనపల్లి, పల్లెపాలెం గ్రామాల్లోని తాగునీటి చెరువులను పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉప్పాల రాముతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శివారు ప్రాంతాలకు నీటిసరఫరా పూర్తిస్థాయిలో రాకపోవడాన్ని ఉప్పాల హారిక, రాము తన దృష్టికి తీసుకురావడంతో క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా పరిస్థితి తెలుసుకోవడానికి వచ్చినట్లు తెలిపారు. సీతనపల్లి వద్ద మెగారక్షిత పథకం చెరువులో నీరు మరో రెండు నెలలపాటు సరిపోతుందని ఈ లోపు నీటితో చెరువును నింపి పూర్తిస్థాయిలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేలా చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. లక్ష్మీపురం పల్లెపాలెం రక్షిత మంచి నీటి చెరువును సైతం కలెక్టర్ పరిశీలించారు. అలాగే బంటుమిల్లి మండలంలోని మల్లేశ్వరం రక్షిత మంచి నీటి పథకాన్ని సందర్శించారు. ఆయా గ్రామాల్లోని అన్ని రక్షిత మంచినీటి పథకాల ఫిల్టర్‌బెడ్‌లను పూర్తిస్థాయిలో రిపేరు చేయనున్నామన్నారు.

అవసరం అయితే ట్యాంకర్ల ద్వారా..

జెడ్పీ చైర్ పర్సన్ హారిక మాట్లాడుతూ అవసరమైన అన్ని గ్రామాలకు మైక్రోఫిల్టర్‌లను ఏర్పాటు చేస్తామని, వేసవిలో తాగునీటి కొరత లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవడంతో పాటు అవసరం అనుకుంటే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను చేయనున్నట్లు వివరించారు. ఈ పరిశీలనలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రమణారావు, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, ఆర్టీసీ కృష్ణాజోనల్ చైర్మన్ పి. మహేష్, కృత్తివెన్ను ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, వైఎస్సార్‌సీపీ కృత్తివెన్ను మండల కన్వీనర్ వెంకట్రాజు, బంటుమిల్లి ఎంపీపీ వి. చినబాబు, వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు, తదితరులు పాల్గొన్నారు.

భైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్.. ఒకరు మృతి

ఉంగుటూరు: చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై చిన్న అవుటపల్లి కాటా వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బళ్లారికి చెందిన ఎండీ నజీర్(55) కొంత కాలంగా విజయవాడ సత్యనారాయణపురంలో ఉంటున్నాడు. నజీర్, భాస్కర్‌రావు ఇద్దరు స్కూటీపైన ఏలూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్నారు. గన్నవరం మండలం చిన్న అవుటపల్లి ఆర్‌టీఏ కాటా వద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు తమ ముందు వెళ్తున్న లారీ కింద పడగా మరొకరు రోడ్డుపై పడ్డారు. స్థానికుల సహాయంతో పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో సమీపంలోని పిన్నమనేని ఆస్పత్రికి తరలించగా నజీర్ అప్పటికే మృతి చెందాడని వైద్యులు చెప్పారు. భాస్కర్‌రావుకు తీవ్రగాయాలయ్యాయి. ఆత్కూరు ఎస్ఐ పైడి బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



కంకిపాడులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌టీయూ జిల్లా నాయకులు

కంకిపాడు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తోందని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండవ శ్రీనివాస్, పీకా ఇమ్మానుయేలు అన్నారు. కంకిపాడులోని సంఘ కార్యాలయంలో ముఖ్య బాధ్యుల సమావేశం బుధవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంఘం కృష్ణాజిల్లా స్థాయి కౌన్సిల్ సమావేశం ఈనెల 11వ తేదీన కంకిపాడులోని రాయల్ ఏసీ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యాయ సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై కౌన్సిల్‌లో చర్చిస్తామన్నారు. సంఘ ప్రతినిధులు కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని కోరారు. కౌన్సిల్ పోస్టరును ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు అక్కినేని సత్యవంతు, యు.టైటస్‌పాల్, పచ్చిగళ్ల సురేష్‌బాబు, ఏ.శ్రీనివాసమూర్తి, ఇంటూరి నాగేశ్వరరావు, జాలా మోహనగాంధీ, పాల్గొన్నారు.

సాంస్కృతిక వైభవం.. రంగ స్థల ప్రాభవం





కన్నడ దుర్యోధన వధ యక్షగానం ప్రదర్శిస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న భారత్ రంగస్థల మహోత్సవ్ ఉత్సవాలు భారతీయ నాటక రంగ విశిష్టతను, జాతీయ సాంస్కృతిక వారసత్వాన్ని చాటుతున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో ఇడగమ్ జీ మహాగణపతి యక్షగాన మండలి కర్ణాటక వారి కన్నడ దుర్యోధన వధ యక్షగానం ప్రదర్శించారు. రచన, దర్శకత్వం శివానంద హెగ్డే వహించారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక సమితి సీఈవో ఆర్.మల్లికార్జునరావు, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఫ్యాకల్టీ వినయ్, భాషా సాంస్కృతిక శాఖ మేనేజర్లు సీహెచ్ శ్రీనివాస్ సుమన్ నిర్వహించారు. నేటి కార్యక్రమంలో మహారాష్ట్రకు చెందిన కళాకారులు ఎండ్‌గేమ్ ఆంగ్ల నాటకాన్ని ప్రదర్శిస్తారు.

ఉరేసుకుని యువకుడి మృతి

నందిగామ: ఫ్యానుకు ఉరివేసుకొని యువకుడు మృతి చెందడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. నందిగామ ఎస్సై పండుదొర తెలిపిన సమాచారం ప్రకారం.. డార్జిలింగ్‌కు చెందిన కుశాల్ (29) 15ఏళ్లుగా నందిగామలోని ఓ నూడిల్స్ దుకాణంలో పనిచేస్తూ.. చందాపురంలో నివాసం ఉంటున్నాడు. ఇంట్లో ఎవరులేని సమయంలో మంగళవారం ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు.

క్లుప్తంగా

ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో అత్యాధునిక పరికరం



లబ్బీపేట(విజయవాడతూర్పు): భయం, ఆందోళన కలిగిన చిన్న పిల్లలకు మెరుగైన, ప్రత్యేకమైన దంత వైద్యం అందించేందుకు కాన్షియస్ సెడేషన్ అనే పరికరాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ దంత వైద్య కళాశాలకు అందజేసింది. చిన్న పిల్లల దంత వైద్య విభాగంలో (పీడోడాంటిక్స్) ఆ పరికరం కంపెనీ సాంకేతిక సిబ్బంది వచ్చి బుధవారం అమర్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భయం వలన చాలా మంది పిల్లలు దంత వైద్యాన్ని నిరాకరిస్తారన్నారు. అలాంటి పిల్లలకు తేలికపాటి మత్తు ఇచ్చే ఈ పరికరం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీడోడాంటిక్స్ విభాగాధిపతి డాక్టర్ జి.జేసుదాస్, డాక్టర్ సురేఖ, డాక్టర్ సుధాకర్, డాక్టర్ సునీత, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కృష్ణలంక(విజయవాడతూర్పు): డివిజన్‌లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని 20వ డివిజన్ కార్పొరేటర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు అన్నారు. బుధవారం ఆయన డివిజన్‌లోని పలు వీధుల్లో పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన హెయిర్ స్టయిల్ పోటీలు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):స్థానిక మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో మహిళా ఉత్సవ్-2024లో భాగంగా బుధవారం సాయంత్రం హెయిర్ స్టయిల్ పోటీలు నిర్వహించారు. 14 మంది మహిళలు వివిధ మోడల్స్‌లో హెయిర్ స్టయిల్స్‌ను ప్రదర్శించారు. వీరిలో మొదటి బహుమతిని జి.భావన, ద్వితీయ బహుమతిని పి.లక్ష్మీప్రసన్న పొందారు. జన శిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా, డైరెక్టర్ ఎ.పూర్ణిమ విజేతలకు బహుమతులు అందజేశారు. జనశిక్షణ సంస్థాన్ సీనియర్ రిసోర్స్ పర్సన్ ఓ.భవానీ, ఎస్.సునీత పోటీల న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. నేడు గురువారం సాయంత్రం 4 గంటలకు మహిళా పారిశ్రామిక వేత్తల సన్మానం చేస్తామని చెప్పారు.

కత్తులతో బెదిరించి దోపిడీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను కత్తులతో బెదిరించి బీరువాలోని రూ. 1.50 లక్షల నగదు, 37 గ్రాముల బంగారాన్ని దోపిడీ చేసిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్ మల్లాపూర్‌కు చెందిన ఆర్. శోభ శుక్రవారం కొత్తపేటలో ఉంటున్న చెల్లెలు కవిత ఇంటికి వచ్చింది. కవిత గొల్లపూడిలోని షాపులో పని చేస్తుండగా, భర్త అప్పారావు బైండింగ్ పని చేస్తుంటాడు. కుమార్తె కీర్తి కాలేజీలో చదువుకుంటుంది. బుధవారం మధ్యాహ్నం కవిత, అప్పారావులు ఎవరి పనికి వారు వెళ్లగా, కీర్తి కాలేజీకి వెళ్లింది. మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న శోభకు తలుపు కొట్టిన చప్పుడు కావడంతో బయటకు వచ్చింది. ఇద్దరు వ్యక్తులు శోభ వద్దకు వచ్చి ఇంట్లో అప్పారావు ఉన్నాడా అని అడిగి లోపలకు బలవంతంగా ప్రవేశించారు. లోపలకు రావడంతోనే తలుపులకు లోపల నుంచి గడియ పెట్టి కత్తులు చూపించి బంగారం, డబ్బులు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. చెప్పకపోతే చంపుతామని బెదిరించడంతో లోపల గదిలో బట్టల కింద ఉన్న అలమరాలో ఉన్న తాళాలు చూపింది. దీంతో ఇద్దరిలో ఒక వ్యక్తి శోభను పట్టుకుని ఉండగా, మరో వ్యక్తి బీరువా తాళాలు తీసి లోపల ఉన్న డబ్బు, నగలు తీసుకుని పారిపోతూ బయట తలుపులకు గడియ పెట్టారు. కొంత సమయానికి కీర్తి కాలేజీ నుంచి వచ్చి తలుపు తీయడంతో విషయం బయటకు వచ్చింది. ఘటనపై కవితకు ఫోన్‌లో చెప్పగా హుటాహుటిన ఇంటికి తిరిగి వచ్చేసింది. బీరువాలో సుమారు 37 గ్రాముల బంగారపు వస్తువులతో పాటు రూ. 1.50 లక్షల నగదు చోరీ చేసి తీసుకెళ్లినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఘటనపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు మోసాలు ప్రజలు మర్చిపోలేదు

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



బాడవపేటలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న దేవినేని అవినాష్, కార్పొరేటర్ మాధురి

లబ్బీపేట(విజయవాడతూర్పు): గత ప్రభుత్వంలో చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలు ఎవరూ మర్చిపోలేదని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. జన్మభూమి కమిటీల దోపిడీ, రాజధాని పేరుతో స్కామ్‌లు, టిడ్కో ఇళ్ల పేరుతో చేసిన మోసాలను గుర్తుంచుకున్నారని చెప్పారు. నియోజకవర్గంలో చేపట్టిన గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం బుధవారం 7వ డివిజన్‌లో కార్పొరేటర్ మెరకనపల్లి మాధురితో కలిసి బాడవపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించడంతో పాటు, రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమి చేస్తామనే మ్యానిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని చెప్పారు. జగనన్న పాలనపై పిల్లల వద్ద నుంచి పింఛను తీసుకునే వృద్ధుల వరకూ ప్రతి ఒక్కరూ చెబుతూ వారి మద్దతు తెలియచేయడం చాలా గర్వంగా ఉందన్నారు. నేడు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు, వాటి రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు.

వలంటీర్లపై దుష్ప్రచారం సిగ్గుచేటు....

ప్రజలకు ఏమి కావాలో తెలుసుకుని, ఆ పథకాలను ప్రభుత్వం వలంటరీ వ్యవస్థ ద్వారా నేరుగా గుమ్మం వద్దకే అందిస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు అన్నారు. ఏమి తప్పు చేశారని చంద్రబాబు వలంటీర్‌లను జైలులో పెట్టిస్తారని ప్రశ్నించారు. పింఛన్లు, పథకాలు గడప వద్దకే ఇస్తున్నందుకా అని నిలదీశారు. లోకేష్ రెడ్‌బుక్ అని అధికారులను బెదిరిస్తుంటే, చంద్రబాబు వలంటీర్‌ల మీద కేసులు అని భయపెట్టాలని చూస్తున్నారన్నారు. మీ ఉడత ఊపులకు ఎవరూ భయపడరని ఎద్దేవా చేశారు. మీ మీద నమ్మకం లేక, మీరు పెట్టే రా కదలిరా సభలకు మీ నాయకులే రావడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, డివిజన్ అధ్యక్షుడు సంపత్, పార్టీ నేతలు పరసా క్లెవ్, మెరకనపల్లి కుటుంబరావు, రెంటపల్లి కొండ పాల్గొన్నారు.

తూర్పులో వైఎస్సార్ సీపీ జోష్

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం



లబ్బీపేటలో ప్రజలకు సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జోష్ నెలకొంది. ఏ ప్రాంతానికి వెళ్లినా, ఏ డివిజన్‌కు వెళ్లినా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పర్యటిస్తూ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరిస్తున్నారు. రాష్ట్రంలో నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, ఇళ్ల స్థలాలు పంపిణీ వంటి వాటిని వివరిస్తూ వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌తో పాటు కుటుంబ సభ్యులు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ, రానున్న ఎన్నికల్లో మరలా అధికారంలోకి వస్తే, ఆ ప్రాంతానికి ఏమి చేస్తారో కూడా వివరిస్తున్నారు. అందులో భాగంగా మీ అవినాష్ అన్న హామీ పేరుతో ఆ డివిజన్‌లో చేపట్టబోయే అభివృద్ధిపై కరపత్రాలు ముద్రించి ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. మంచి జరిగితేనే ఆదరించండని చెప్పడంతో ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి గురించి ఇంటింటికీ పర్యటించి వివరిస్తున్నారు.

ప్రతిరోజూ నాలుగు డివిజన్‌లలో...

ప్రతిరోజూ నాలుగు డివిజన్‌లలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. కాగా బుధవారం దేవినేని అవినాష్ 7వ డివిజన్‌లో పర్యటించగా, భార్య సుధీర 3వ డివిజన్‌లో, సోదరి దేవినేని క్రాంతి 11వ డివిజన్‌లో, బావ వై.సిద్ధార్థ 19వ డివిజన్‌లో పర్యటించారు. వారి పర్యటనలకు ప్రజల నుంచి సైతం మంచి స్పందన లభిస్తుంది. కార్పొరేటర్లు మెరకనపల్లి మాధురి, భీమిశెట్టి ప్రవల్లిక, ఎండీ రెహానా నాహీద్‌లతోపాటు, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం. 11వ డివిజన్ ఇన్‌చార్జి పర్వతనేని పవన్, పార్టీ మండల అధ్యక్షుడు బుర్రి జగ్జీవన్‌రావు, జిల్లా కార్యదర్శి చింతగుంట విజయ్ పాల్గొన్నారు.

టీడీపీ ఏమి చేసిందీ....

రెండు సార్లు గెలిచినా గద్దే రామ్మోహన్ తూర్పు ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యువకుడైన అవినాష్ ప్రభుత్వం ద్వారా రూ.650 కోట్లుతో అభివృద్ధి చేశానని దమ్ముగా చెబుతుంటే, ప్రజలకు ఏమీ చేయని గద్దే రామ్మోహన్ ఏ ముఖం పెట్టుకొని వస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ నాలుగున్నరేళ్లలో తమ కాలనీలు అభివృద్ధి చెందాయి, మాకు సంక్షేమ పథకాలు వస్తున్నాయని ప్రజలు టీడీపీ నేతల ముఖం పైనే చెబుతున్నారు. తన అసమర్థతతోనే గద్దే రామ్మోహన్ ప్రజల్లో విశ్వాసం కోల్పోయారనే ఆరోపణలు బహిరంగంగానే చేస్తుండటం విశేషం.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సంక్రాంతి సమయంలో భోగి మంటలో పడి తీవ్రగాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఫైజర్‌పేటకు చెందిన పోలిపల్లి బంగార్రాజు (36) గత నెల 14వ తేదీన ప్రమాదశాత్తు ఇంటి ముందు వేసిన భోగి మంటల్లో పడ్డాడు. కుటుంబ సభ్యులు బంగార్రాజును ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న బంగార్రాజు బుధవారం మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



జోనల్ కమిషనర్‌కు ఆల్బెండజోల్ మాత్రలు అందచేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9న జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వనున్నారు. అందులో భాగంగా పాఠశాలలు, అంగన్‌వాడీలను మాత్రలను పంపిణీ చేసేందుకు బుధవారం మండల అభివృద్ధి అధికారులు, విజయవాడలోని జోనల్ కమిషనర్‌లకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ మాత్రలను ప్రతి అంగన్ వాడీ కేంద్రానికి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చేరేలా చూడాలని ఆమె అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు విద్యాశాఖ ఉపాధ్యాయులతో కలిసి ఈ నెల 9న డీ వార్మింగ్ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ అమృత, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జె ఉషారాణి, ఆర్‌బీఎస్‌కే అధికారిణి డాక్టర్ మాధవి, డీఎంఓ డాక్టర్ మోతీబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, డీపీఎంఓ డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో అభినయ ఆర్ట్స్ అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీవైష్ణవి, వాహికా విజయ్, యశస్విని, యితీక, తన్మయి, హారిణిలతో పాటు మరి కొంత మంది చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి అభినయంతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

ఎన్‌సీసీ కేడెట్లకు పలువురి అభినందనలు



సాయిశ్రీని అభినందిస్తున్న నలంద విద్యాసంస్థల చైర్మన్ విజయబాబు, ప్రిన్సిపాల్ అనురాధ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఢిల్లీలో ఇటీవల జరిగిన గణతంత్ర వేడుకల్లో ఎన్‌సీసీ 4ఎ ఆంధ్రా బెటాలియన్ కేడెట్‌గా పాల్గొన్న నలంద డిగ్రీ కళాశాల విద్యార్థిని డి.సాయిశ్రీని బుధవారం నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ. విజయబాబు అభినందించారు. ఆ వేడుకల్లో కల్చరల్ విభాగంలో ప్రాతినిధ్యం వహించి గ్రూప్ సింగింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. అంతేకాక ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్రపతి ద్రౌపతి ముర్ములను కలిసే అవకాశం లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ యం.అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా విజయబాబుతో పాటు, ప్రిన్సిపాల్ అనురాధ, ఇతర అధ్యాపకులు, సహచర విద్యార్థులు సాయిశ్రీకి అభినందనలు తెలిపారు.

ఢిల్లీలో ఇటీవల జరిగిన రిపబ్లిక్ పేరేడ్‌లో పాల్గొన్న నలంద విద్యానికేతన్ విద్యార్థి ములుకుట్ల శ్రీహర్ష సత్తా చాటినట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. ఏటీసీ, ఐజీసీ లాంచింగ్ క్యాంప్‌లను, ప్రీ ఆర్‌డీసీలను పూర్తి చేసుకుని జనవరి 26న రిపబ్లిక్ డే క్యాంపునకు హాజరైనట్లు తెలిపారు. ఎన్‌సీసీలో ఏడు క్యాంపులను పూర్తి చేసుకుని ఐజీసీ క్యాంప్‌లో ఫొటో గ్రఫీ, ఫ్లాగ్ ఏరియా బ్రీఫర్ గాను, లైన్ ఏరియా బ్రీఫర్ ఆర్‌డీసీగాను శ్రీహర్ష విశేష ప్రతిభ చూపినట్లు తెలిపారు. యువతీ యువకులకు సైనిక శిక్షణ ఇచ్చి, అత్యవసర పరిస్థితుల్లో సేవల నిమిత్తం సిద్ధంగా ఉంచడం ఎన్‌సీసీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. దేశభక్తి గల పౌరులను తయారు చేయడమే ఎన్‌సీసీ ముఖ్య ఉద్దేశమన్నారు. శ్రీహర్షను స్కూల్ కరస్పాండెంట్ ఎ విజయబాబు, ఎన్‌సీసీ అధికారి ప్రదీప్‌కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.



ఎన్‌సీసీ అధికారి ప్రదీప్‌కుమార్‌తో కేడెట్ శ్రీహర్ష

బీజేపీ మతోన్మాద విధానాలు ఓడిద్దాం

సీఐటీయూ ఆలిండియా ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్



కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ మతోన్మాద విధానాలను ఓడించాలని సీఐటీయూ ఆలిండియా ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఆర్ఎఐ) జాతీయ కౌన్సిల్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తపన్‌సేన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేట్‌కు అప్పగిస్తుందని చెప్పారు. కార్పొరేట్లకు మాత్రం మోదీ ప్రభుత్వం అన్ని విధాలా మేలు చేస్తుందన్నారు. దేశ ప్రజల సమస్యలు పక్కదోవ పట్టించటానికి మతాన్ని వినియోగిస్తుందని పేర్కొన్నారు. ఈ వాస్తవాన్ని గమనించి ప్రజానుకూల విధానాల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఫార్మా యాజమాన్యాలు ప్రజారోగ్యంపై లాభాలు సంపాదిస్తున్నాయని, కానీ మెడికల్ రిప్స్ సమస్యలు పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వ విధానాలు కూడా దీనికి కారణమేనని తెలిపారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్‌ను, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. మెడికల్ రిప్స్ ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. సమావేశాల్లో అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు రమేష్ సుందర్, సీఐటీయూ ఆలిండియా కార్యదర్శి కరుమలయన్, సీఐటీయూ ఆలిండియా నాయకుడు జేఎస్ మజుందార్, బెఫి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.అజయ్‌కుమార్, డాక్టర్ పూర్ణానంద్, శంతనకుమార్, ఏవి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై కత్తితో దాడి

కృష్ణలంక(విజయవాడతూర్పు): మద్యం మత్తులో నలుగురు వ్యక్తులు ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నడికట్టు అరవింద్‌రెడ్డి ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ రామలింగేశ్వరనగర్‌లోని కొల్లిపరవారి వీధిలో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున అరవింద్‌రెడ్డి మద్యం తాగి తన స్నేహితుడు శంకర్‌తో కలిసి టిఫిన్ చేసేందుకు సిటీ బస్టాండ్ వద్ద ఉన్న గంగోత్రి హోటల్ వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో ఆ పక్కనే ఉన్న బడ్డీ వద్ద నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నలుగురు వ్యక్తులు పమిడిముక్కల జ్యోతి అనురూప్ అలియాస్ జాన్, ఇంద్రగంటి రజనీకాంత్, శ్రీకాంత్, రాజ్‌కుమార్ మద్యం తాగి ఉన్నారు. బడ్డీ వద్దకు వెళ్లి సిగరెట్ ఇవ్వమని అరవింద్ వారిని అడిగాడు. బడ్డీకి మాకు సంబంధం లేదు మమ్ములను ఎందుకు అడుగుతావంటూ అరవింద్‌తో గొడవపడ్డారు. వారి మధ్య మాటమాటా పెరిగి జ్యోతి అనురూప్‌ను తోయడంతో కిందపడ్డాడు. కోపోద్రిక్తుడైన అనురూప్ అతని వద్ద ఉన్న కత్తితో అరవింద్ పొట్టలో పొడిచాడు. వెంటనే అక్కడ నుంచి వారు పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రరక్తస్రావమై గాయపడిన అరవింద్‌ను ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫన్ సిట్టింగ్ ఏరియాలో థియేటర్

నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పార్కు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కృష్ణలంక(విజయవాడతూర్పు): రివర్ ఫ్రంట్ ప్లాజా పార్క్‌లో ప్రజలకు మరింత ఆనందాన్ని కలిగించే థియేటర్‌ను ఫన్ సిట్టింగ్ ఏరియాలో నిర్మించాలని, ముఖ్యంగా ముఖద్వారం గ్రీనరీతో ఆకట్టుకునే విధంగా ఉండాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రాణిగారితోటలో పర్యటించి రిటైనింగ్ వాల్ వెంబడి పార్క్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కృష్ణానది ఫేస్-2 రిటైనింగ్ వాల్ వెంబడి కనకదుర్గ వారధి నుంచి పోలీస్ కాలనీ డీపీ స్టేషన్ వరకు 1.2 కి.మీ పొడవున సుమారు రూ.7.8 కోట్లతో నిర్మాణం జరుగుతున్న ఆహ్లాదకరమైన రివర్ ఫ్రంట్ బ్యూటిఫికేషన్ పార్కును ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే ట్రీ కెనాఫి ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తుందన్నారు. ప్రజలను మరింత ఆకర్షించేందుకు నిర్మాణం దశలో ఉన్న వాకింగ్ ట్రాక్, పాత్ వే, డిజైన్లు పరిశీలించి అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. పార్క్ నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో పలువురు వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో విలువల్లేని వ్యక్తి చంద్రబాబు

వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజకీయాల్లో విలువలు లేని ఏకైక వ్యక్తి చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ అన్నారు. కేవలం అధికారం కోసం ఎవరి కాళ్లు పట్టుకునేందుకు అయినా వెనుకాడని నైజం ఆయనదని ఎద్దేవా చేశారు. మెహబూబ్ షేక్ బుధవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు మళ్లీ బీజేపీతో జట్టు కట్టేందుకు పాకులాడుతూ ఢిల్లీకి పయనమవడం ఆయన ఊసరవెల్లి రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఒంటరిగా ఎన్నికలకు వెళితే గెలవలేనని తెలిసే ఆయన ప్రతి ఎన్నికలకు పొత్తులు పెట్టుకుంటాడన్నారు. బీజేపీతో 1999లో జత కట్టి 2004 వదిలేసి, మళ్లీ 2014లో జతకట్టి, 2019లో వదిలేశాడన్నారు. గతంలో బీజేపీని మతోన్మాదపార్టీ అని, మోదీని అరెస్ట్ చేసి జైలులో పెట్టాలని ఏపీ నుంచి ఢిల్లీ వరకు గోల చేసిన చంద్రబాబు, ఏకంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తిరుపతిలో రాళ్లు వేయించాడన్నారు. ఇప్పుడు సిగ్గు లేకుండా ఆ అమిత్ షా, మోదీ కాళ్లు పట్టుకునేందుకు ఢిల్లీ వెళ్లాడన్నారు. చంద్రబాబు అవకాశవాద, ఊసరవెల్లి రాజకీయాలను ప్రజలు గమనించాలన్నారు. మైనార్టీలను అక్కున చేర్చుకున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

నులి పురుగుల నుంచి చిన్నారులను కాపాడుకుందాం



మాట్లాడుతున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఆవరణలోగల కొత్త భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం సాయంత్రం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన నులిపురుగుల వలన జరిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన ప్రతి విద్యార్థికీ ఈ నెల 9వ తేదీ నుంచి ఆల్బెండజోల్ మాత్రలు కచ్చితంగా చేరేలా చూడాల్సిన బాధ్యత పాఠశాలల యాజమాన్యానిదేనని పేర్కొన్నారు. ఎంఈఓలు ప్రతి స్కూల్‌కు వెళ్లి పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని యాజమాన్యం చేపట్టేలా చూడాలని ఆదేశించారు. సమాచారాన్ని విద్యార్థుల డైరీలో రాయడం ద్వారాగానీ వాట్సప్ గ్రూప్‌లో పెట్టడం ద్వారాగానీ వారి తల్లిదండ్రులకు తెలియ చేయాలన్నారు. నులిపురుగుల నుంచి చిన్నారులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. విద్యార్థులలోనూ నులిపురుగుల వలన కలిగే రక్తహీనత, ఆకలి మందగించడం, తరచూ విరేచనాలు కావటం, బరువు తగ్గటం వంటి నష్టాలను వివరించాలని కమిషనర్ సూచించారు. అందుకు తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి అంటే... అంటే గోళ్లు శుభ్రంగా ఉంచుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయకుండా ఉండటం, అటువంటి ప్రదేశాల్లో సంచరించకుండా ఉండటం వంటివి చేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించాలని వివరించారు. అలాగే విద్యార్థులు వినియోగించే కామన్ బాత్‌రూమ్స్ వలన సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రతి విద్యార్థికి ఒకేసారి సింగిల్ షాట్‌లో ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వలన నులి పురుగులతో వచ్చే వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) కె.శకుంతల, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఎంఈవోలు, స్కూల్ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




సాక్షి
గురువారం
। 8 । ఫిబ్రవరి। 2024
విజయవాడ
www.sakshi.com

> ఒక సమాజం పురోగతిని ఆ సమాజంలోని మహిళలు సాధించిన పురోగతి స్థాయిని బట్టి నేను కొలుస్తాను.
>
> - డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



బడ్జెట్ 2024-25



చేయూతనిచ్చాం..
ఆసరాగా నిలిచాం

జనాభాలో సగం ఉన్న మహిళల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు

- సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోవడానికి తోడ్పాటు
- మహిళలు, పిల్లల కోసం ప్రత్యేకంగా జెండర్ - చైల్డ్ బేస్డ్ బడ్జెట్
- శాసనసభలో సమగ్ర వివరణ ఇచ్చిన ఆర్థిక మంత్రి బుగ్గన


జగనన్న అమ్మఒడి కింద **43.61** లక్షల మంది మహిళలకు రూ.**26,067** కోట్లు

వైఎస్సార్ ఆసరా కింద **78.94** లక్షల మందికి రూ.**25,571** కోట్లు

వైఎస్సార్ చేయూత కింద **26** లక్షల మందికి రూ.**14,129** కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం 'చేయూత'ను ఇచ్చి 'ఆసరా'గా నిలవడంతో పేద మహిళలు మహారాణులుగా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్నారు. 'ఒక సమాజం పురోగతిని.. ఆ సమాజంలోని మహిళలు సాధించిన పురోగతి స్థాయిని బట్టి నేను కొలుస్తాను' అని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్న మాటలనే ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుంది. ఇందుకు తగ్గట్టే రాష్ట్ర జనాభాలో సగ భాగం ఉన్న మహిళల అభ్యున్నతిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. సామాజికంగా, ఆర్థికంగా వారిని ఉన్నత స్థాయికి తీసుకురావడమే లక్ష్యంగా వారికి తోడ్పాటును అందిస్తోంది.

- సాక్షి, అమరావతి



మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. లక్షలాది మంది పేద కుటుంబాలు సంతోషంగా జీవనం సాగిస్తున్నాయి. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రంలోని పేదల కుటుంబాల్లో చోటుచేసుకున్న మార్పులను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తన బడ్జెట్ ప్రసంగంలో సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

మహిళా సాధికారత కోసం..

రాష్ట్ర జనాభాలో సగం ఉన్న మహిళలు సంక్షేమం, సాధికారతకు నోచుకోకపోతే ఏ రాష్ట్రమైనా పురోగతి సాధించలేదు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం వారి కోసం అనేక వినూత్న కార్యక్రమాలను ప్రారంభించింది. మహిళలను ఆర్థిక వ్యవస్థలో సమాన భాగస్వాములుగా చేయడంతో తమ కాళ్లపై తాము నిలబడుతున్నారు. దీనిద్వారా ఆర్థిక అడ్డంకులను అధిగమించి సాధికారతను సాధిస్తున్నారు. అంతేకాకుండా అభివృద్ధి కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. మహిళలు, పిల్లల ఆరోగ్యం, రక్షణ, వారి సమగ్రాభివృద్ధికి సంబంధించి 2021–22 నుంచి ప్రభుత్వం ప్రత్యేకంగా జెండర్ – చైల్డ్ బేస్డ్ బడ్జెట్‌లను ప్రవేశపెడుతోంది. పేదరికాన్ని తొలగించాలనే లక్ష్యంతో జగనన్న



అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టి అందరికీ నాణ్యమైన విద్యను అందించాం. దీనిద్వారా 43.61 లక్షల మంది మహిళలకు రూ.26,067 కోట్లు ఇచ్చాం. ఈ పథకం ద్వారా ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు 83 లక్షల మంది విద్యార్థులకు మేలు చేకూరింది. దీని ఫలితంగా ప్రాథమిక విద్యలో చేరే విద్యార్థుల నికర నమోదు నిష్పత్తి 2019లో 87.80 శాతం ఉండగా 2023 నాటికి 98.73 శాతానికి పెరిగింది. అలాగే ఉన్నత, మాధ్యమిక విద్యలో స్థూల నమోదు నిష్పత్తి 2019లో 46.88 శాతం ఉండగా, 2023కి అది 79.69 శాతానికి చేరుకుంది.

టీడీపీ ప్రభుత్వ వైఫల్యంతో అప్పుల ఊబిలోకి మహిళలు..

రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలకు మద్దతు ఇవ్వడంలో గత టీడీపీ ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందింది. దీంతో మహిళలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మా ప్రభుత్వం మేనిఫెస్టోలోని హామీ మేరకు 2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాలకు ఉన్న రుణ బకాయిలను తిరిగి చెల్లించడానికి వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేసింది. దీనికింద 2019 నుంచి రూ.25,571 కోట్లను తిరిగి చెల్లించింది. తద్వారా 7.98 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని 78.94 లక్షల మందికి మేలు చేకూర్చింది.

సున్నావడ్డీతో క్రియాశీలకంగా సంఘాలు..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్వయం సహాయక సంఘాలు మనుగడ కోల్పోయాయి. తిరిగి వీటిని క్రియాశీలకం చేయడానికి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద మహిళలకు రూ.4,969 కోట్లను ప్రభుత్వం అందించింది. ఫలితంగా అప్పట్లో 18.63 శాతంగా ఉన్న మొండి బకాయిలు గణనీయంగా తగ్గిపోయాయి. దేశంలోనే అతి తక్కువ స్థాయి 0.17 శాతానికి చేరాయి. అలాగే వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 26 లక్షల మంది మహిళలు ఆర్థిక కార్యకలాపాలు చేపట్టేందుకు, వారి జీవనోపాధికి శాశ్వత భద్రత కల్పించేందుకు రూ.14,129 కోట్లను అందించాం. జగనన్న పాలవెల్లువ పథకం కింద 3.60 లక్షల మంది మహిళలు డెయిరీ ద్వారా అధిక ఆదాయాన్ని పొందేందుకు రూ.2,697 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. అదేవిధంగా మహిళలు, పిల్లలకు పటిష్ట భద్రతలో భాగంగా దిశ మొబైల్ యాప్, దిశ పెట్రోల్ వాహనాలు, 26 దిశ పోలీసుస్టేషన్లను ప్రారంభించాం. ఏకంగా కోటి మందికి పైగా మహిళలు దిశ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.



భూ హక్కులకు భద్రత

భూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు జగన్ సర్కార్ సాహసోపేత నిర్ణయం

- వందేళ్ల తర్వాత భూముల పునఃపరిశీలన కోసం రీసర్వే
- భద్రత కల్పించేందుకు భూ హక్కుల చట్టానికి రూపకల్పన
- ఇప్పటివరకు 17.53 లక్షల మందికి భూహక్కు పత్రాలు
- మూడు లక్షల ఎకరాలపై ఆంక్షలు ఎత్తివేత
- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

సాక్షి, అమరావతి: భద్రమైన భూముల వ్యవస్థ, సమర్థమైన భూ పరిపాలన కోసం ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన సంస్కరణలు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచాయి. భూముల సమస్యలను పరిష్కరించడంలో, భూ పరిపాలనలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచింది. అనేక సంవత్సరాలుగా పేరుకుపోయిన భూ సమస్యలను పరిష్కరించడానికి ఈ ఐదేళ్లలో అనేక విప్లవాత్మకమైన చర్యలు చేపట్టింది. భూ రికార్డుల్లో అస్పష్టత, సర్వే రికార్డుల్లో సమస్యలు, వివాదాలు, వ్యాజ్యాలవల్ల స్తంభించిన భూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి గతంలో ఏ ప్రభుత్వం తీసుకోని చర్యలను ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ సర్కారు సాహసోపేతంగా తీసుకుంది. భూములతో ముడిపడి ఉన్న చిక్కుముడుల్ని విప్పడంతో భూ యాజమాన్యం ఇప్పుడు సమర్థవంతంగా మారింది. భూ సమస్యలతో దశాబ్దాలుగా చితికిపోయిన వారు ఇప్పుడు ఊపిరి పీల్చుకుంటున్నారు.

- నూతన పింఛను పథకం కింద ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి జీపీఎస్ (ఏపీ హామీ పింఛను పథకం) అమలుచేయడానికి ప్రభుత్వం ముందడుగు వేసింది. ఉద్యోగులకు లాభదాయకమైన, స్థిరమైన, ప్రత్యామ్నాయ పింఛను పథకంగా ఇది ఉంది. దీనిద్వారా కేంద్ర ప్రభుత్వానికి, ఇతర రాష్ట్రాలకు మా ప్రభుత్వం ప్రత్యామ్నాయ పరిష్కారాన్ని అందించింది.

- అసెంబ్లీలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రసంగిస్తూ ఏమన్నారంటే.. వందేళ్ల తర్వాత రాష్ట్రంలో ఉన్న భూములను పునఃపరిశీలన (రీసర్వే) చేయడం కోసం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని 2020, డిసెంబర్ 21న ప్రభుత్వం ప్రారంభించింది. కొత్తగా 11,118 గ్రామ సర్వేయర్లను నియమించడం, నిరంతరాయంగా పనిచేసే సరికొత్త జియో రిఫరెన్స్ స్టేషన్ల (సీఓఆర్ఎస్) టెక్నాలజీని ప్రవేశపెట్టడం ద్వారా రీ సర్వే అత్యంత శాస్త్రీయంగా జరుగుతోంది.
- ఇప్పటివరకు 17.53 లక్షల మంది రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు ఇచ్చాం. 4.80 లక్షల మ్యుటేషన్లు జరిగాయి. రీ సర్వేలో 45వేల భూ సరిహద్దు వివాదాలు పరిష్కారమయ్యాయి.
- 1.37 లక్షల ఎకరాల గ్రామ సర్వీస్ ఈనాం భూములను నిషేధిత జాబితా 22(ఎ) నుంచి తొలగించడం ద్వారా 1.13 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరింది. 33,428.64 ఎకరాల షరతులు గల పట్టా భూములు, 2.06 లక్షల ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడం ద్వారా 1.07 లక్షల మంది రైతులకు ఆ భూములపై సర్వహక్కులు ఏర్పడ్డాయి. 1982 నుంచి 2014 వరకు భూమి కొనుగోలు పథకం కింద భూములు పొందిన 22,837 ఎకరాలకు చెందిన 22,346 మంది భూమిలేని దళితుల భూములను 22 (ఎ) జాబితా నుంచి తొలగించడం ద్వారా లబ్ధిపొందారు. భూమిలేని నిరుపేదలకు 46,463 ఎకరాల డీకేటీ పట్టాలను పంపిణీ చేశాం.

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట..

- మా ప్రభుత్వం ఐదేళ్లలో 4.93 లక్షల కొత్త ఉద్యోగాలు కల్పించింది. వీటిలో 2,13,662 ఉద్యోగాలు శాశ్వత నియామకాలు. 2014–19 మధ్యకాలంలో ఇచ్చిన 34,108 ఉద్యోగాల కంటే ఇవి ఎన్నో రెట్లు ఎక్కువ. సుమారు 10 వేల మంది ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నాం. 51,387 మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశాం. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ఆప్కాస్ సంస్థను ఏర్పాటుచేశాం.
- 27 శాతం మధ్యంతర భృతిని ఉద్యోగుల సంక్షేమానికి మంజూరు చేశాం. 11వ వేతన సవరణ సంఘం సిఫారసులను అమలుచేశాం. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాం.
- ఆశా వర్కర్లు, గిరిజన సామాజిక ఆరోగ్య కార్యకర్తలు, మున్సిపాల్టీల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్, ప్రజారోగ్య కార్మికులకు, సెర్ప్‌కి చెందిన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్‌లు, మెప్మాకు చెందిన రీసోర్స్ పర్సన్‌లు, హోమ్‌గార్డులు, మధ్యాహ్న భోజన పథకం కింద పనిచేస్తున్న సహాయకులు, అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులకు ప్రభుత్వం వేతనం పెంచింది.

సంక్షేమ వెలుగులు
ధగధగ

కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా అర్హులందరికీ సంక్షేమం

దృఢమైన సామాజిక భద్రతా వలయం ద్వారా పేదరికంపై యుద్ధం





- నాలుగున్నరేళ్లలో మారిన ప్రజల స్థితిగతులు.. గౌరవంగా జీవనం
- అగ్ర వర్ణాల్లోని పేదలకూ వివిధ పథకాల ద్వారా లబ్ధి
- 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి రూ.44,668 కోట్లు కేటాయింపు
- గృహ నిర్మాణానికి రూ.7,062 కోట్లు

సాక్షి, అమరావతి: సంక్షేమ ఆంధ్రను ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. బుధవారం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్ద పీట వేసింది. రాష్ట్రంలో అన్ని విధాలుగా అవసరమైన సంక్షేమానికి మొత్తం రూ.44,668 కోట్లు కేటాయించింది. ఇందులో బీసీ సంక్షేమానికి రూ.29,001.31 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.9,291.55 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.4,133.73 కోట్లు, మైనారిటీల సంక్షేమానికి రూ.2,242.36 కోట్లు కేటాయించడం విశేషం. సంక్షేమంతోపాటు రాష్ట్రంలో గృహ నిర్మాణానికి రూ.7,062 కోట్లు కేటాయించింది. పేదరికంపై యుద్ధం చేసి ప్రజలను గెలిపించేలా.. దృఢమైన సామాజిక భద్రతా వలయంగా సంక్షేమ అస్త్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించింది. వివక్ష లేని సంక్షేమంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆదర్శంగా నిలిచింది. రాష్ట్రంలో కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా అర్హులందరికీ సంక్షేమాన్ని వారి గడప వద్దకే చేర్చింది. అట్టడుగు వర్గాలకు అందించిన సంక్షేమ ఫలాలతో వారికి ఎంతో మేలు చేసింది. ఫలితంగా ప్రజల స్థితిగతులు మారడంతో సురక్షితమైన, గౌరవ ప్రదమైన జీవనం గడిపేలా చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికత దేశానికే దిక్సూచిగా నిలిచింది. ఇంటి స్థలాల కేటాయింపు, ఇంటి నిర్మాణం, సంక్షేమ పింఛన్లు, ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ తదితర పథకాలు, కార్యక్రమాల ద్వారా ఆర్థిక మద్దతు అందిస్తోంది. వైఎస్సార్‌సీపీ పాలనలో అందించిన సంక్షేమంతో సాధించిన అద్భుత ఫలితాలను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ 'సంక్షేమ ఆంధ్ర' థీమ్‌తో అసెంబ్లీలో వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

ఇళ్ల స్థలాలు, ఇళ్లు.. నగదు బదిలీ

- రాష్ట్రంలో గత ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చినవి 4,63,697 ఇళ్లు మాత్రమే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 నుంచి ఇప్పటి వరకు రూ.1.53 లక్షల కోట్ల విలువైన 30,65,315 ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. ప్రతి లబ్ధిదారుని ఇంటి ఖర్చుకు రూ.లక్షా 80 వేలు మంజూరు చేసింది. మౌలిక సదుపాయాల కోసం ఒక్కో ఇంటికి రూ.6.90 లక్షల చొప్పున (మొత్తంగా రూ.22,909 కోట్లు) వెచ్చిస్తోంది. ఫలితంగా 22 లక్షల ఇళ్లలో దాదాపు 9 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు 2024 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకుంది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇప్పటి వరకు 1,62,538 మంది లబ్ధిదారులు నివాసం ఉంటున్నారు.
- అవినీతి, అవకతవకలకు అవకాశం లేకుండా అర్హతే ప్రాతిపదికగా గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ పథకాన్ని అమలు చేస్తోంది. కోవిడ్ సమయంలో, ఇతరత్రా ప్రభుత్వ దార్శనికతను సాకారం చేసి దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు అవిశ్రాంతంగా పనిచేసిన సచివాలయాల సిబ్బంది, వలంటీర్లను ప్రభుత్వం అభినందించింది.
- 2019లో స్థిర ధరల సూచి ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,54,031తో దేశంలో 18వ స్థానంలో ఉండగా, ప్రస్తుతం అది రూ.2,19,518తో 9వ ర్యాంకుకు ఎగబాకింది.
- వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం లబ్ధిదారుల అర్హత వయస్సును 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించి సంతృప్త స్థాయిలో అమలు చేస్తోంది. 2019లో పింఛన్ల మొత్తం నెలకు రూ.1,385 కోట్లు ఉండగా, జనవరి నెల నాటికి అది రూ.1,968 కోట్లకు పెరిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాం లక్షల మందికి రూ.84,731 కోట్లు అందించింది.
- ప్రజల ఇంటి ముంగిటికే సరుకులు సరఫరా చేయాలనే లక్ష్యంతో 9,260 సంచార వాహనాలను ప్రవేశపెట్టింది. తద్వారా వృద్ధులు, దివ్యాంగులు, వేతన కార్మికులకు ఎంతో ఊరట కలిగింది. ఈ వాహనాల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి ఉపాధి లభించింది. సబ్సిడీ బియ్యం కోసం గత ప్రభుత్వం రూ.14,256 కోట్లు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.29,628 కోట్లు ఖర్చు చేసింది.

పెద్ద మనస్సుతో పేదలకు భరోసా



- వైఎస్సార్ బీమా కింద 49,000 కుటుంబాలకు రూ.650 కోట్లు
- అగ్ర వర్ణాల కోసం ప్రత్యేక విభాగం (కాపు, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, ఆర్య వైశ్య, క్షత్రియ వర్గాల్లో కోటి 15 లక్షల మందికి రూ.36,321 కోట్లు
- ఈబీసీ నేస్తం కింద 4.39 లక్షల మందికి రూ.1,257 కోట్లు, వైఎస్సార్ కాపు నేస్తం కింద 77 లక్షల మందికి రూ. 39,247 కోట్లు
- వైఎస్సార్ నేతన్న నేస్తం కింద 81,783 మందికి రూ.983 కోట్లు
- జగనన్న తోడు కింద 16.73 లక్షల మందికి రూ.3,374 కోట్లు, జగనన్న చేదోడు కింద 3.40 లక్షల మందికి రూ.1,268 కోట్లు
- వైఎస్సార్ వాహన మిత్ర కింద 2.78 లక్షల మందికి రూ.1,305 కోట్లు
- వైఎస్సార్ లా నేస్తం కింద 6,069 మందికి నెలకు రూ.5 వేలు చొప్పున భృతి
- వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద 46,329 మందికి రూ.350 కోట్లు
- ఉపాధి హామీ పథకం కింద 2,141 లక్షల పని దినాల ద్వారా 45 లక్షల కుటుంబాల్లోని 72 లక్షల మందికి చెల్లింపులు
- అగ్రిగోల్డ్ బాధితులకు రూ.883.5 కోట్లు సాయం

2,19,763 ఎకరాలకు 1,29,842 మంది గిరిజనులకు వ్యక్తిగత పట్టాలు, 67,946 ఎకరాలకు గాను 526 కమ్యూనిటీ పట్టాలు పంపిణీ. 39,272 ఎకరాలకు 26,287 డీకేటీ పట్టాలు పంపిణీ. ఎస్టీల గృహాలకు ఉచిత విద్యుత్ నెలకు 100 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంపు. కాఫీ తోటల పరిధి విస్తరణ. గిరిజన సహకార సంఘం ద్వారా మార్కెటింగ్ సహకారం.

- వెనుకబడిన కులాల(బీసీ)ల సంక్షేమం కోసం 56 కొత్త కార్పొరేషన్ల ఏర్పాటు. కోటి 2 లక్షల మందికి రూ.71,740 కోట్ల లబ్ధి.
- 2023–24లో దాదాపు 5 వేల మంది మైనార్టీలకు ఉద్యోగావకాశాల కోసం శిక్షణ. ఇమామ్‌లకు అందించే సహాయం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంపు.. 4,983 మందికి ప్రయోజనం. మోజన్లకు రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంపు. 4,983 మందికి మేలు.
- 2021–22 నుంచి 8,427 మంది పాస్టర్లకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయం. 2023 నుండి విజయవాడలోని ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్ర చేసే ప్రతి యాత్రికునికి రూ.80 వేలు చొప్పున 1,756 మందికి లబ్ధి. 2019 నుండి 1,178 మంది యాత్రికులు జెరూసలేం వెళ్లడానికి రూ.60 వేల చొప్పున ఆర్థిక సాయం.


ఎస్సీ విద్యార్థులకు జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ. తద్వారా 200 మంది విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ, ఇతర ప్రీమియర్ కళాశాలలలో ప్రవేశం. 'కెన్నెడీ లుగర్- యూత్ ఎక్స్ఛేంజ్' కార్యక్రమం, విదేశీ విద్యా అధ్యయన కార్యక్రమాలకు ఎనిమిది మంది విద్యార్థులకు అవకాశం. 2023 సెప్టెంబర్‌లో సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనపై న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్య సమితి సమావేశానికి ఈ వర్గానికి చెందిన ఒక విద్యార్థి ప్రాతినిధ్యం.




సాక్షి
గురువారం
। 8 । ఫిబ్రవరి । 2024
విజయవాడ
www.sakshi.com

భవిష్యత్తును అంచనా వేయడానికి అత్యంత నమ్మదగిన మార్గం, ఆ భవిష్యత్తును సృష్టించడమే

- అబ్రహం లింకన్




బడ్జెట్ 2024-25



ఇదిగో.. సామర్థ్య ఆంధ్ర!

సీఎం జగన్ పాలనలో అనతి కాలంలోనే సామర్థ్య ఆంధ్రగా ఆవిర్భావం

- మానవ వనరుల అభివృద్ధిలో దూసుకెళ్తున్న ఏపీ
- విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి రంగాలకు బడ్జెట్‌లో పెద్దపీట
- విద్యా రంగాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దిన జగన్ ప్రభుత్వం
- వైద్య రంగంలోనూ పెద్ద ఎత్తున మార్పులు



ఆంధ్రప్రదేశ్ పరిపూర్ణ మానవ అభివృద్ధి దిశగా వేగంగా పయనిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అనతి కాలంలోనే 'సామర్థ్య ఆంధ్ర'గా ఆవిర్భవించింది. విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో గణనీయమైన పురోగతితో దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఈ క్రమంలోనే ప్రభుత్వం 'సామర్థ్య ఆంధ్ర' కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో ఏకంగా రూ.53,508.04 కోట్లు కేటాయించింది. బుధవారం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శాసన సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. పాఠశాల, సాధారణ విద్యకు పెద్దపీట వేస్తూ రూ.33,898.04 కోట్లు కేటాయించారు. సాంకేతిక విద్యకు రూ.578.59 కోట్లు, కార్మిక శక్తి, ఉద్యోగాల కల్పనను పెంచేలా రూ.1,114.74 కోట్లు కేటాయించారు. ఇక గ్రామీణ పేదలకు ఇంటి వద్దనే ఆరోగ్య సేవలు అందిస్తూ వైద్య రంగాన్ని బలోపేతం చేసేలా, ఆరోగ్యశ్రీ ఉచిత వైద్యాన్ని పెంచడానికి రూ.17,916.67 కోట్లు కేటాయించడం విశేషం.

-సాక్షి, అమరావతి









ఉన్నతంగా విద్య

జగనన్న విద్యా దీవెన ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే. ఇప్పటివరకు విద్యా దీవెన కింద రూ.11,901 కోట్లు, వసతి దీవెన కింద రూ.4,276 కోట్లు ఖర్చు చేసింది. తద్వారా విద్యార్థుల కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గి ఉన్నత విద్యలో డ్రాప్ అవుట్ శాతం భారీగా తగ్గింది. ప్రపంచంలోని టాప్-50 (సబ్జెక్టుల వారీగా) విశ్వ విద్యాలయాల్లో రాష్ట్ర విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆకాంక్షతో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ప్రవేశపెట్టింది. ఇంటర్న్‌షిప్ ద్వారా చదువుతో పాటే విద్యార్థులు బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగులు పొందే అవకాశాన్ని కల్పించింది. దేశంలోనే తొలి సారిగా ఏపీలోనే ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో వైద్య, దంత వైద్య కోర్సుల్లో 50 శాతం కోటా, మిగిలిన అన్ని కోర్సుల్లో 35 శాతం సీట్లను ప్రభుత్వ కోటాలో పేదలు ఉచితంగా చదువుకునే వెసులుబాటు కల్పించింది.

గోరుముద్దతో ఆరోగ్యం..

ప్రభుత్వం జగనన్న గోరుముద్ద కింద ఏడాదికి రూ.1,910 కోట్లు ఖర్చు చేస్తూ 43 లక్షల మందికిపైగా విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తోంది. ఇది గత ప్రభుత్వం చేసిన దానికంటే నాలుగు రెట్లు ఎక్కువ. గిరిజన ప్రాంతాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్, మైదాన ప్రాంతాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో మహిళల్లో రక్తహీనత సమస్యను తగ్గిస్తోంది.

ఆరోగ్యశ్రీతో పునరుజ్జీవనం



వైఎస్ జగన్ ప్రభుత్వం నాడు-నేడు ద్వారా రూ.16,852 కోట్లతో ఉప ఆరోగ్య కేంద్రాల నుంచి బోధన ఆస్పత్రుల వరకు సమూల మార్పులు చేసి మెరుగైన వైద్యాన్ని అందిస్తోంది. గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానంతో 14 రకాల వైద్య పరీక్షలను, 105 రకాల మందులను ఇంటి వద్దనే అందిస్తోంది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఏడాదికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యాన్ని అందిస్తూ పేదల పాలిట సంజీవనిగా మారింది. కుటుంబ ఆదాయ పరిమితిని రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచి, మరింత మందికి ఆరోగ్యశ్రీ సేవలను అందిస్తోంది. ప్రొసీజర్స్‌ను పెంచి, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు పరిమితి లేని చికిత్సలు అందిస్తోంది. ఆరోగ్య ఆసరా కింద 25 లక్షల మంది రోగులకు రూ.1366 కోట్లు అందించింది. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 1.67కోట్ల కుటుంబాలకు ఉచితంగా ఆరోగ్య సేవలు, మందులు పంపిణీ చేసింది. కిడ్నీ రోగులకు కార్పొరేట్ సౌకర్యాలతో 200 పడకలతో పలాసలో వైఎస్సార్ కిడ్నీ రిసెర్చ్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించింది. వైద్య శాఖలో 53,126 మంది శాశ్వత సిబ్బందిని నియమించింది. జాతీయ స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషలిస్టు వైద్యుల పోస్టుల ఖాళీలు సగటున 61 శాతం ఉంటే.. ఏపీలో దానిని 4 శాతానికంటే తక్కువకు తగ్గించడం గమనార్హం.



'విద్య'యీ భవ

పిల్లలకు మంచి విద్య అందించి, ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నది సీఎం వైఎస్ జగన్ సంకల్పం. అందుకే ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచి ఇంగ్లిష్ మీడియం తీసుకొచ్చింది. వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ అమలు చేస్తోంది. త్వరలో ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) పాఠ్య ప్రణాళికలను అమలు చేయనుంది. ఆంగ్ల భాషా నైపుణ్యం పెంచేలా టొఫెల్ సర్టిఫికేషన్ అందిస్తోంది. విద్యా బోధనలో సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది. పిల్లలకు ఉచిత కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఉచితంగా అందిస్తోంది. 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్‌తో బోధన ప్రవేశపెట్టింది. జగనన్న విద్యాకానుక కిట్ల ద్వారా ఏటా రూ.3,367 కోట్లతో 47 లక్షల మంది విద్యార్థులకు యూనిఫామ్‌లు, బ్యాగ్‌లు, బూట్లు, పాఠ్యపుస్తకాలను అందిస్తోంది. మనబడి నాడు-నేడు ద్వారా 56,703 ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, జూనియర్ కళాశాలల రూపురేఖలను మార్చింది. నాడు - నేడు ద్వారా ఇప్పటివరకు రూ.7163 కోట్ల స్కూళ్లను అత్యాధునికంగా తీర్చిదిద్దింది.

రెడీ టు వర్క్

విద్యార్థులు చదువుల సమయంలోనే పరిశ్రమలు, ఐటీ సంస్థలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా తీర్చిదిద్దుతోంది. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో 192 స్కిల్ హబ్‌లు, పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో 27 స్కిల్ కాలేజీలు స్థాపించింది. తద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 21 రంగాల్లో 1.06 లక్షల మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వగా.. వీరిలో 95 శాతం మంది ఉద్యోగాలు పొందారు. యువతకు శిక్షణ ఇవ్వడానికి 201 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో వర్చువల్ ల్యాబ్‌లు, క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. 14 పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో (ఐటీఐ) కియా మోటార్స్, మారుతీ, టయోటా, ఇసుజు మొదలైన సంస్థల సహాయంతో అధునాతన యంత్రాలతో ల్యాబ్‌లను అభివృద్ధి చేసింది.

సంక్షేమ శకం



రూ.2,86,389.27 కోట్లతో బుగ్గన ఓటాన్ అకౌంట్ బడ్జెట్

- మన రాష్ట్రానికి ధృడమైన, ఉజ్వల భవిష్యత్తు
- ఏడు ప్రధాన అంశాలతో సీఎం జగన్ వినూత్న పాలన
- గతంలో రెవెన్యూ వృద్ధి రేటు 6 శాతం.. ఇప్పుడు 16 శాతం

ఐదేళ్లలో జీఎస్‌డీపీ వృద్ధి రేటులో 14 నుంచి 4వ స్థానానికి ఎగబాకాం

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లలో ఆర్థికాభివృద్ధితో సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పిందని ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. రానున్న కాలంలో రాష్ట్రానికి ధృడమైన, ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. బుధవారం అసెంబ్లీలో రూ.2,86,389.27 కోట్లతో 2024-25 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన బుగ్గన తనకు వరుసగా ఐదేళ్లుగా ఈ అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. సమాజంలో అత్యంత బలహీనులకు ప్రాధాన్యం ఇవ్వడంలో దివంగత వైఎస్సార్ నిబద్ధత, సామాజిక న్యాయం కోసం కృషి చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అసమానతలను రూపుమాపడం, వెనుకబడిన వర్గాలకు రక్షణ, సాధికారత, నాణ్యమైన విద్య, వైద్యం, పోషణ, జీవనోపాధి కల్పించటాన్ని నైతిక బాధ్యతగా భావిస్తూ రాష్ట్ర పునర్ నిర్మాణానికి శాయశక్తులా కృషి చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఏడు అంశాలు సుపరిపాలిత ఆంధ్ర, సామర్థ్య ఆంధ్ర, మన మహిళా మహరాణుల ఆంధ్ర, అన్నపూర్ణ ఆంధ్ర, సంక్షేమాంధ్ర, సంపన్న ఆంధ్రా, భూ భద్ర ఆంధ్ర పేరుతో సీఎం జగన్ చేపట్టిన కీలక సంస్కరణలు సత్ఫలితాలనిచ్చాయంటూ రంగాల వారీగా ప్రగతిని వివరించారు. పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ శాసన మండలిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

ఐదేళ్లలో విజయ ప్రస్థానం ఇలా..

- 2018-19లో 11% రాష్ట్ర స్థూల ఉత్పత్తి రేటుతో ఏపీ 14వ స్థానంలో ఉండగా 2023 నాటికి 16.2 శాతానికి పెరిగింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి రేటులో 4వ స్థానానికి పురోగమించాం.
- గత ఐదేళ్లలో రెవెన్యూ వృద్ధి రేటు 6 శాతం కాగా ఇప్పుడు 16 శాతానికి పెరిగింది.
- 2018-19లో మన వ్యవసాయ రంగం సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు 8.3 శాతంతో 12వ స్థానంలో ఉండగా ఈ రోజు 13% వృద్ధి రేటుతో 6వ స్థానానికి ఎగబాకింది.
- వరుసగా మూడేళ్లుగా సులభతర వాణిజ్యంలో మన రాష్ట్రం అగ్ర స్థానాన్ని కైవశం చేసుకుంటోంది.
- డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని రైతులందరికీ వర్తింపచేసిన మొదటి, ఏకైక రాష్ట్రం మనదే.
- కోట్ల మంది అన్నదాతలకు గ్రామాల్లోనే సేవలందిస్తూ మన రైతు భరోసా కేంద్రాలు ప్రపంచ బ్యాంకు ప్రశంసలు అందుకున్నాయి.
- సూక్ష్మ నీటి పారుదల అమలులో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. దేశంలోని మొదటి 15 జిల్లాలలో ఆరు జిల్లాలు మన రాష్ట్రం నుంచే ఉన్నాయి. భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్), జాతీయ అరటి పరిశోధన సంస్థల నుంచి ఎగుమతి కార్యకలాపాలకుగాను ఉత్తమ రాష్ట్రం అవార్డును ఏపీ గెలుచుకుంది.
- మన రాష్ట్రం చేపల ఉత్పత్తిలో 30% వాటాతో, మొత్తం సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులలో 31 శాతంతో దేశంలోనే ముందంజలో ఉంది. 2023లో ఉత్తమ సముద్ర తీర రాష్ట్రంగా కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డు పొందింది.
- పుంగనూరు పశువులను సంరక్షిస్తున్న తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్) నుంచి 'బ్రీడ్ కన్జర్వేషన్ అవార్డు' అందుకుంది.
- జాతీయ ఆహార భద్రతా చట్టం అమలులో మన రాష్ట్రం 3వ స్థానంలో ఉంది.
- మన రాష్ట్రం అంకుర సంస్థల (స్టార్టప్స్) అభివృద్ధికి దోహదపడే వాతావరణాన్ని కలిగి ఉంది.
- దేశంలో 5 శాతం వాటాతో మహిళా యాజమాన్యంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల అభివృద్ధిలో మన రాష్ట్రం 7వ స్థానంలో ఉంది.
- 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి' కింద ఉప్పాడ జందానీ చీరలు బంగారు బహుమతిని పొందగా చేనేత ఉత్పత్తుల్లో మన రాష్ట్రం మరో నాలుగు అవార్డులను అందుకుంది. ప్రధానమంత్రి పట్టణ ఆవాస యోజన కింద ఉత్తమ పనితీరు అవార్డును మన రాష్ట్రం సాధించింది.
- మైక్రోసాఫ్ట్, జిందాల్, రిలయన్స్, అదానీ, లారస్ సింథసిస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, హీరో మోటోకార్ప్, గ్రాసిం ఇండస్ట్రీస్, గ్రీన్‌కో ఎనర్జీ, యకహోమా లాంటి అనేక దిగ్గజ పరిశ్రమలు గత నాలుగేళ్లలో మన రాష్ట్రంలో గణనీయంగా పెట్టుబడులు పెట్టాయి.
- 2022లో ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాల జాబితాలో ఏపీకి మూడో స్థానం.
- విశాఖలోని రుషికొండ బీచ్‌కు 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపు.
- 2023 సంవత్సరానికిగాను ఉత్తమ పర్యాటక గ్రామంగా లేపాక్షి కేంద్ర ప్రభుత్వ అవార్డు పొందింది.
- స్వచ్ఛమైన పునరుత్పాదక ఇంధనం ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ప్రోత్సహించడం, పునరుత్పాదక విద్యుత్ కొనుగోలు బాధ్యతలను నెరవేర్చటం, ఇంధనం - మౌలిక సదుపాయాల వినియోగం అనే మూడు అంశాలకు గాను మన రాష్ట్రం 15వ ఎనర్షియా అవార్డు 2023 కింద మూడు అవార్డులను అందుకుంది.
- రాయలసీమలోని పాల సముద్రంలో అత్యాధునిక వసతులతో నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్ డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) ప్రాంగణాన్ని స్థాపించడంలో మా ప్రభుత్వం మద్దతు ఇచ్చింది.
- సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ కోసం పంచాయతీ రాజ్ శాఖ ఈ ఏడాది జనవరిలో తిరుపతిలో మూడు రోజుల పాటు జాతీయ శిక్షణ శిబిరాలను నిర్వహించింది.
- గతేడాది ఫిబ్రవరిలో తిరుపతిలో ఇండియా ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ అసోసియేషన్ భాగస్వామ్యంతో డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ ఇన్నోవేషన్ సమావేశాలను నిర్వహించాం.

మౌలిక వసతులతో...

రాష్ట్రం సుసంపన్నం

మౌలిక సదుపాయాల కల్పనకు రూ.43,307.21 కోట్లు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు 'ఏపీ పారిశ్రామిక విధానం 2023-27' ప్రభుత్వం తీసుకువచ్చింది. మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు 2024-25లో రూ.43 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించారు.

ప్రగతికి 'బాట'లు

పనులు	వెచ్చించిన నిధులు
రాష్ట్ర రహదారుల అభివృద్ధి	: రూ.2,626 కోట్లు
ప్రధాన జిల్లా రహదారులు	: రూ.1,955 కోట్లు
నక్సలైట్ ప్రభావిత ప్రాంత రహదారులు	: రూ.272 కోట్లు
ఎన్‌డీబీ ప్రాజెక్ట్ మొదటి దశ(1243 కి.మీ)కు	: రూ.3,014 కోట్లు
ఎన్‌ఐడీఏ మొదటి దశ (98 రాష్ట్ర రహదారులు, 132 ఎండీఆర్‌లు)	: రూ.1,158 కోట్లు
8286 కి.మీ రహదారుల నాణ్యత(ఏపీఆర్‌డీసీ)కు	: రూ.2,205 కోట్లు
19 ఆర్‌ఓబీల (సేతుబంధన్ గ్రాంట్లు) అభివృద్ధి	: రూ.992 కోట్లు
350 కి.మీ. జాతీయ రహదారుల అభివృద్ధి	: రూ.7,182 కోట్లు

రూ.24 వేల కోట్లతో తీరప్రాంతాభివృద్ధి

రాష్ట్రంలో రూ.24 వేల కోట్లతో ఓడరేవులు, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండ్ కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వేలో రూ.20 వేల కోట్లతో పర్యావరణహిత ఓడరేవులు నిర్మిస్తున్నారు. రూ.3800 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లను జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ, బుడగట్లపాలెం, కొత్తపట్నం, ఓడరేవు, పూడిమడక, బియ్యపుతిప్ప, మంచినీళ్లపేట వద్ద నిర్మిస్తున్నారు. రూ.127 కోట్లతో చింతపల్లి, భీమిలి, రాజయ్యపేట, దొండవాక, ఉప్పలంక, రాయదరువుల్లో ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలను అభివృద్ధి చేశారు. అంతర్గత జల రవాణా అభివృద్ధికి ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీని 2023లో స్థాపించి, కృష్ణానదిపై ముక్త్యాల-మద్దిపాడు మధ్య తొలి నదీ ప్రవాహ ప్రాజెక్టును రూపొందించారు. భోగాపురం విమానాశ్రయ అభివృద్ధి పనులు చేపట్టారు.

గ్రామాల అనుసంధానం

భారత్ నెట్ రెండో దశ ప్రాజెక్ట్ అమలులో భాగంగా 613 మండలాల్లోని 11,254 గ్రామ పంచాయతీలను కలుపుతూ 55 వేల కి.మీ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు.

వైద్య విద్య బలోపేతం

- రాష్ట్రంలో రూ.8480కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు
- ఉద్దానం ప్రాంత కిడ్నీ రోగులకోసం పలాసలో వైఎస్సార్ కిడ్నీ పరిశోధన కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం.

అత్యున్నత విద్యాలయాలు

- కురుపాంలో గిరిజన ఇంజినీరింగ్ కాలేజీ, సాలూరులో సెంట్రల్ గిరిజన వర్సిటీ, విజయనగరంలో గురజాడ జేఎన్‌టీయూ, ఒంగోలులో ఆంధ్రకేసరి వర్సిటీ, వైఎస్సార్ కడపలో వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ కర్నూలులో క్లస్టర్ వర్సిటీ, రెండో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం.

పోలవరం పురోగమనం

- 2019మే నాటికి 42 శాతం హెడ్ వర్క్‌లు 70 శాతానికి చేరిక
- గోదావరి నదిలో తొలి సారిగా రేడియల్ గేట్ల ఏర్పాటు.
- గతేడాది నవంబర్ 30వ తేదీన అవుకు రెండో టన్నెల్ ప్రారంభం.
- అవుకు మొదటి, రెండో టన్నెళ్ల పూర్తి. మూడో టన్నెల్ త్వరలో పూర్తి.
- గతేడాది సెప్టెంబర్ 19న 77 చెరువుల అనుసంధానం ప్రాజెక్ట్ ప్రారంభం.
- 2022 సెప్టెంబర్ 6వ తేదీన గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ, నెల్లూరు బ్యారేజీల ప్రారంభం.
- పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం పురోగతి.

పారిశ్రామిక పరుగులు

- 2019 నుంచి ఇప్పటి వరకు 311కుపైగా ఏర్పాటైన భారీ పరిశ్రమలు
- రూ.5995 కోట్లతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు
- రూ.19345 కోట్ల పెట్టుబడులతో 117 ఒప్పందాలు చేసుకున్న ఒబెరాయ్, నోవోటెల్, వంటి ప్రముఖ సంస్థలు.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు

- పట్టణాభివృద్ధిలో భాగంగా 1426 ఎకరాల్లో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ల ఏర్పాటు
- రూ.189 కోట్లతో 481 ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు
- గ్రామీణ మౌలిక సదుపాయాల కింద 10,893 గ్రామ పంచాయతీ భవనాలు, 10216 వ్యవసాయ గోదాములు, 8299 భారత్ నిర్మాణ్ సేవా కేంద్రాలు, 3734 భారీ పాల శీతలీకరణ కేంద్రాల నిర్మాణం.

పోలవరంలో విధ్వంసానికి కారణం బాబే

రాజ్యసభలో కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ స్పష్టీకరణ

- ఎగువ కాఫర్ డ్యామ్ పనులను పాక్షికంగా చేశారని వెల్లడి
- వరద ఉధృతికి డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని చెప్పిన కేంద్ర మంత్రి
- ఈ వాల్ పునరుద్ధరణకు అంతర్జాతీయ నిపుణుల సహకారం తీసుకుంటున్నామని వివరణ
- బాబు తప్పిదం వల్లే డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని తేల్చిన హైదరాబాద్ ఐఐటీ
- లేదంటే ఈ పాటికి ప్రాజెక్టును సీఎం జగన్ పూర్తి చేసేవారంటున్న అధికారులు
- కమీషన్ల కక్కుర్తితో ప్రాజెక్టు మ్యాన్యువల్‌ను తుంగలో తొక్కిన చంద్రబాబు
- ట్రాన్స్‌ట్రాయ్‌ను అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా పనులు సబ్ కాంట్రాక్టర్లకు అప్పగింత
- బాబు సోమవారం సమీక్షలు కమీషన్ల వసూలుకేనని ఇటీవల వెల్లడించిన ట్రాన్స్‌ట్రాయ్ అధినేత

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు ప్రధాన (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో జరిగిన విధ్వంసానికి, పునాది డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన డానికి చంద్రబాబు ప్రభుత్వం చేసిన తప్పిదాలే కారణమని రాజ్యసభ సాక్షిగా కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ వెల్లడించారు. గోదావరి వరదను మళ్లించేలా ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేయకుండా పాక్షికంగా పనులు చేపట్టడం వల్ల 2020లో గోదావరికి వచ్చిన భారీ వరద కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉధృతితో ప్రవహించడం వల్లే డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని తేల్చిచెప్పారు. డయాఫ్రమ్‌వాల్ పునరుద్ధరణకు వివిధ పద్ధతులను పరిశీలిస్తున్నామని, అంతర్జాతీయ నిపుణుల ఏజెన్సీ సహకారం కూడా తీసుకుంటున్నామని వివరించారు. ఈ ఏజెన్సీ సూచనల ప్రకారం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదించిన డిజైన్ల మేరకు డయాఫ్రమ్ వాల్ పునరుద్ధరణను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందన్నారు. రాజ్యసభలో టీడీపీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ మంగళవారం అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి షెకావత్ ఈ విషయాలు వెల్లడించారు

ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్న సీఎం జగన్

పోలవరం ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ ప్రణాళికాబద్ధంగా చేస్తున్నారు. కరోనా ప్రతికూల పరిస్థితులను అధిగమించి స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ పనులను పూర్తి చేసి 2021 జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని 6.1 కిమీల పొడవున మళ్లించారు. కుడి కాలువ, ఎడమ కాలువ అనుసంధానాలను పూర్తి చేశారు. తొలి దశలో 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించారు. డీడీఆర్పీ (డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్), సీడబ్ల్యూసీ సూచనల మేరకు గోదావరి వరదల ఉధృతికి ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన భారీ అగాధాలను ఇసుకతో పూడ్చి, వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెస్తున్నారు. అంతర్జాతీయ నిపుణుల ఏజెన్సీ, సీడబ్ల్యూసీ డిజైన్లు ఖరారు చేసిన వెంటనే డయాఫ్రమ్ వాల్‌ను పునరుద్ధరించి, శరవేగంగా ప్రాజెక్టును పూర్తి చేయనున్నారు. చంద్రబాబు కమీషన్ల కక్కుర్తితో చారిత్రక తప్పిదానికి పాల్పడకపోయి ఉంటే సీఎం జగన్ ఈ పాటికే ప్రాజెక్టును పూర్తి చేసి, రైతులకు ఫలాలు అందించేవారని అధికార వర్గాలు తెలిపాయి.


GOVERNMENT OF INDIA
MINISTRY OF JAL SHAKTI
DEPARTMENT OF WATER RESOURCES, RIVER DEVELOPMENT & GANGA REJUVENATION
RAJYA SABHA
STARRED QUESTION NO. *19
DAMAGE OF DIAPHRAGM WALL IN POLAVARAM IRRIGATION PROJECT
ANSWER


STATEMENT REFERRED TO IN REPLY TO PARTS (a) TO (e) OF STARRED QUESTION NO. *19 TO BE ANSWERED ON 08.02.2024 IN RAJYA SABHA REGARDING "DAMAGE OF DIAPHRAGM WALL IN POLAVARAM IRRIGATION PROJECT"

డయాఫ్రమ్‌వాల్ దెబ్బతినడానికి అప్పటి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వమే కారణమని రాజ్యసభలో తేల్చిచెప్పిన కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి షెకావత్

ఐఐటీ-హెచ్, ఎన్‌హెచ్‌పీసీ కూడా ఇదే చెప్పాయి

పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యామ్ వద్ద విధ్వంసం జరగడానికి, డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి చంద్రబాబు ప్రభుత్వ తప్పిదమే కారణమని ఐఐటీ (హైదరాబాద్) ఇప్పటికే తేల్చిచెప్పింది. నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) కూడా ఇదే అంశాన్ని స్పష్టం చేసింది. చంద్రబాబు ఈ చారిత్రక తప్పిదానికి పాల్పడకపోయి ఉంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ఉండేవారని అధికారవర్గాలు తెలిపాయి.

కమీషన్ల కక్కుర్తితో ఇష్టారాజ్యంగా పనులు

- విభజన చట్టం ప్రకారం కేంద్రమే పూర్తి చేయాల్సిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని నాటి సీఎం చంద్రబాబు పదే పదే కేంద్రాన్ని కోరారు.
- ప్రత్యేక హోదాను కూడా తాకట్టు పెట్టడానికి సిద్ధమవడంతో 2016 సెప్టెంబరు 7న ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అప్పగించింది.
- ప్రాజెక్టు చేతికొచ్చిన మరుసటి రోజే చంద్రబాబు పోలవరం హెడ్ వర్క్స్ అంచనా వ్యయాన్ని రూ.1,491 కోట్ల మేర పెంచేశారు.
- ప్రాజెక్టు మ్యాన్యువల్ ప్రకారం వరదను మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేశాక ప్రధాన డ్యామ్ పునాది డయాఫ్రమ్‌వాల్ వేయాలి. ఆ తర్వాత ప్రధాన డ్యామ్ నిర్మించాలి.
- కానీ.. కమీషన్ల కక్కుర్తితో ప్రాజెక్టు మ్యాన్యువల్‌ను చంద్రబాబు తుంగలో తొక్కారు. అప్పటి ప్రధాన కాంట్రాక్టర్ ట్రాన్స్‌ట్రాయ్‌ని అడ్డుపెట్టుకుని అధికంగా లాభాలు వచ్చే పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించారు. ప్రతి సోమవారం సమీక్ష చేస్తూ చంద్రబాబు కమీషన్లు వసూలు చేసుకున్నారని ట్రాన్స్‌ట్రాయ్ అధినేత రాయపాటి రంగారావు ఇటీవల వెల్లడించడమే అందుకు నిదర్శనం.
- స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండానే ప్రధాన డ్యామ్ గ్యాప్-2లో 1750 మీటర్ల మేర పునాది డయాఫ్రమ్ వాల్ పనులను ఎల్అండ్‌టీ- బావర్ సంస్థకు సబ్ కాంట్రాక్టు కింద అప్పగించారు. ఆ పనులకు రూ.400 కోట్లు బిల్లులు చెల్లించి చంద్రబాబు కమీషన్లు వసూలు చేసుకున్నారు.
- ట్రాన్స్‌ట్రాయ్ దివాలా తీయడంతో 2017-18లో రూ.2917 కోట్ల విలువైన పనులను 'ఈనాడు' రామోజీరావు వియ్యంకుడికి చెందిన నవయుగకు నామినేషన్ పద్ధతిలో అప్పగించారు. ఆ సంస్థ 2019 ఫిబ్రవరి నాటికి ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులను పాక్షికంగా చేసింది. నిర్వాసితులకు పునరవాసం కల్పిస్తూ పనులు చేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) తేల్చిచెప్పింది. ఇలా చేస్తే కమీషన్లు రావనే కారణంతో కాఫర్ డ్యామ్‌ల పనులను మధ్యలోనే వదిలేశారు.
- 2019 ఎన్నికల్లో టీడీపీ ఘోరంగా ఓడిపోయింది. 2019 మే 30న సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేశారు. జూన్ రెండో వారంలోనే గోదావరికి వరదలు ప్రారంభమయ్యాయి. ఆ ఏడాది, 2020లో వచ్చిన వరదలకు ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా నీరు అధిక ఉధృతితో ప్రవహించడం వల్ల ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతం భారీగా కోతకు గురైంది. డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది.

గవర్నర్ ప్రసంగాన్ని ఆమోదించిన కేబినెట్

2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు మంత్రిమండలి ఆమోద ముద్ర


కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: శాసనసభలో ఈ నెల 5న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగాన్ని బుధవారం ఉదయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశం ఆమోదించింది. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. నంద్యాల జిల్లా డోన్‌లో కొత్తగా హార్టికల్చర్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కాలేజీ, వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలో హార్టికల్చర్ పాలిటెక్నికల్ కళాశాల, నంద్యాల జిల్లా డోన్‌లో రెండేళ్ల డిప్లొమా కోర్సుతో వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ పరిధిలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ యూనివర్సిటీస్ (ఎస్టాబ్లిష్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్-2016కు సవరణలు చేయడం ద్వారా బ్రౌన్‌ఫీల్డ్ కేటగిరీలో మూడు ప్రైవేట్ యూనివర్సిటీలను మంత్రిమండలి అనుమతించింది. అన్నమయ్య జిల్లా రాజంపేటలో అన్నమాచార్య యూనివర్సిటీ, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ, కాకినాడ జిల్లా సూరంపాలెంలో ఆదిత్య యూనివర్సిటీ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. కాగా, అట్టడుగు ప్రజల అభ్యున్నతికి బడ్జెట్‌లో పెద్దపీట వేసినట్టు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. సచివాలయంలోని తన కార్యాలయంలో బడ్జెట్ ప్రతులకు మంత్రి బుగ్గన పూజలు నిర్వహించారు. అనంతరం సచివాలయంలోని సీఎం చాంబర్‌లో సీఎం వైఎస్ జగన్‌కు బడ్జెట్ ప్రతులను అందజేశారు.

ఏపీలో 5 గ్రీన్‌ఫీల్డ్ కారిడార్లు

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రహదారి ప్రయాణాన్ని సుగమతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన భారత్‌మాల పరి యోజన-1లో గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని కేంద్ర రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరి తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ మీదుగా ఐదు, తెలంగాణ మీదుగా మూడు గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ల నిర్మాణం జరుగుతోందని రాజ్యసభలో బుధవారం బీఆర్ఎస్ ఎంపీ లింగయ్యయాదవ్ అడిగిన ప్రశ్నకు జవాబిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో బెంగళూరు-చెన్నైల మధ్య 262 కి.మీ. ఎక్స్‌ప్రెస్ వే, రాయ్‌పూర్-విశాఖపట్టణం మధ్య 465 కి.మీ., చిత్తూరు-తట్చూర్ మధ్య 116 కి.మీ., బెంగళూరు-కడప-విజయవాడ మధ్య 342 కి.మీ. యాక్సెస్ కంట్రోల్డ్ కారిడార్ల నిర్మాణం జరుగుతున్నట్లు వివరించారు. భారత్‌మాల పరియోజన-1లో ఏపీకి రూ.71,842 కోట్లతో 2,525 కి.మీ., తెలంగాణలో రూ.38,279 కోట్లతో 1,719 కి.మీ.రహదారుల నిర్మాణానికి ఆమోదం తెలిపామన్నారు. ప్రస్తుతం ఏపీలో రూ.63,022 కోట్లతో 1,936 కి.మీ. పొడవైన రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు.

విశాఖలో సముద్ర కాలుష్యాన్ని అరికట్టండి

- రాజ్యసభలో బీజేపీ ఎంపీ జీవీఎల్

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖలో సముద్ర కాలుష్యాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కోరారు. డ్రైనేజీల ద్వారా సముద్రంలో కలు స్తోన్న పారిశుధ్య నీటిని రీసైక్లింగ్ చేయడం సహా పలు పద్ధతుల ద్వారా కాలుష్యాన్ని అరికట్టేందుకు రూ.500 కోట్లతో ఏదైనా ఒక ప్రాజెక్ట్‌ను విశాఖలో ప్రారంభించాలని అభ్యర్థించారు. ఈ కాలుష్యాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తగిన ఆర్థిక సహాయాన్ని చేయాలని కోరారు. బుధవారం రాజ్యసభలో జీరో అవర్ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ..మూడేళ్లుగా క్లీన్ సిటీగా విశాఖ నాలుగో ర్యాంక్ తెచ్చుకుంటోందని గుర్తుచేశారు. ఇటీవల విశాఖలో సముద్ర కాలుష్యం పెరుగుతోందని మత్స్యకారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోందని చెప్పారు.

ఒక్క కేసులోనైనా సీబీఐ విచారణకు సిద్ధమా?

చంద్రబాబుకు మంత్రి కాకాణి సవాల్



సాక్షి, అమరావతి: స్టేలతో కాలం గడిపే చంద్రబాబుకు, ఆయన నేల టిక్కెట్ గాళ్లకు తనను విమర్శించే నైతిక అర్హత లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. '24 గంటలు సమయం ఇస్తున్నా. దమ్ముంటే నీపై నమోదైన కేసుల్లో ఒక్కటంటే ఒక్క కేసులోనైనా సీబీఐ విచారణకు సిద్ధమని ప్రకటించగలవా?' అని ఆయన బాబుకు సవాల్ విసిరారు. తన సవాల్‌ను స్వీకరించకపోతే చంద్రబాబు అవినీతిపరుడని ఆయనే ఒప్పుకున్నట్టని స్పష్టం చేశారు. మంత్రి బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'నెల్లూరు కోర్టులో జరిగిన చోరీ ఘటనలో నాపై ఆరోపణలు వచ్చిన మరుక్షణం స్వచ్ఛందంగా సీబీఐ విచారణ కోరుతూ కోర్టుకు లేఖ రాశాను. ప్రభుత్వం కూడా ఈ ఘటనపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాసింది. 11 నెలలు విచారణ జరిపిన సీబీఐ.. ఆ ఘటనలో నా ప్రమేయం లేదని క్లీన్ చిట్ ఇచ్చింది. దీన్ని వ్యతిరేకిస్తూ కోర్టులో రిట్ వేస్తామని చంద్రమోహన్‌రెడ్డి చెబుతున్నాడు. నేను దేనికైనా సిద్ధం. 'చంద్రబాబుపై ఎన్నో కేసులున్నాయి. ప్రతిసారీ కోర్టుకెళ్లి స్టేలు తెప్పుకోవడమే తప్ప ఒక్క కేసులోనైనా విచారణ ఎదుర్కొన్నావా? టీడీపీ హయాంలో రైతు రథాల పేరిట జరిగిన దోపిడీపై విచారణకు సిద్ధమా అని ఆయన ప్రశ్నించారు.

కాంగ్రెస్, అవినీతి పర్యాయపదాలు

- ఆర్థికవ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది
- ఆ పార్టీని ప్రజలు ఎప్పటికీ క్షమించరు
- కాంగ్రెసేతర పాలనతో పేదరికం తగ్గింది
- రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్, అవినీతి పర్యాయపదాలుగా మారాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి చెప్పారు. కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజాధనాన్ని సొంత ఏటీఎంగా పరిగణిస్తుందని ఎద్దేవా చేశారు. యూపీఏ హయాంలో జరిగిన కుంభకోణాల జాబితా ఎప్పటికీ అంతంకాదన్నారు. యూపీఏ దశాబ్ద పాలనలో రూ.12 లక్షల కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. మధ్యంతర బడ్జెట్‌పై రాజ్యసభలో బుధవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఈ బడ్జెట్‌లో చాలా సానుకూల పరిణామాలున్నాయని తెలిపారు. గతేడాది కంటే ఆరుశాతం అధికంగా రూ.47.65 లక్షల కోట్లు ఖర్చుచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించిందని, రూ.30.8 లక్షల కోట్లుగా అంచనా వేసిన వసూళ్లు గతేడాది కంటే 12 శాతం ఎక్కువని చెప్పారు. మొత్తంగా ఇది దేశంలో అభివృద్ధి వ్యయాలకు నిధులు సమకూరుస్తుందన్నారు. ప్రభుత్వం ద్రవ్యలోటును 5.8 శాతం నుంచి 5.1 శాతానికి తగ్గించాలన్న యోచన ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్ఠంగా మార్చేందుకు తోడ్పడుతుందని తెలిపారు. కొత్త పథకాల కోసం ఆర్థికశాఖకు మూలధన వ్యయంగా రూ.70,449 కోట్లు కేటాయించారని, ఇది మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహాయపడుతుందని పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాల్లో.. పదేళ్లు కాంగ్రెస్ వల్ల నష్టపోయామని, తదనంతర పదేళ్లలో దేశం వృద్ధి చెందిందని చెప్పారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ దుష్పరిపాలన కారణంగా భారత ఆర్థికవ్యవస్థ ఛిన్నాభిన్నం అయిందని గణాంకాలు చూస్తే అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు దేశం ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఉండేదన్నారు. కాంగ్రెసేతర ప్రభుత్వాలతో యూకే, ఫ్రాన్స్, కెనడా వంటి దేశాలను అధిగమించి ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించిందని చెప్పారు. కాంగ్రెస్ దుష్పరిపాలన వల్లే దేశ ఆర్థికాభివృద్ధి వెనకంజ వేసినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. గడిచిన పదేళ్లలో జరిగిన అభివృద్ధిని అప్రతిష్టపాలు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆర్థికవేత్తలుగా మన్ననలు పొందిన వారు దేశం ఐదుశాతం జీడీపీ సాధిస్తే గొప్పని చెప్పినప్పటికీ.. ఇప్పటికే ఏడుశాతాన్ని దాటిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెసేతర పాలనలో ఆదాయ అసమానతలు తగ్గాయని, సుమారు 25 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని చెప్పారు. దేశప్రజల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ పెద్ద శాపంగా ఉందనడానికి ఇవన్నీ సంకేతాలని, ప్రజల అభివృద్ధికి ఆటంకంగా ఆ పార్టీ నిలిచిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడల్లా ద్రవ్యోల్బణం గరిష్టస్థాయి చేరుకుందని, యూపీఏ-1 కాలంలో 5.8 శాతం, యూపీఏ-2 హయాంలో 10.4 శాతంగా ఉండగా.. ప్రస్తుత ప్రభుత్వంలో 4.8 శాతంగా ఉందని వివరించారు. ద్రవ్యోల్బణం యూపీఏ హయాంలో 2010-11లో అత్యధికంగా 12.2 శాతం ఉంటే కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడు అత్యధికంగా 6.7 శాతంగా ఉందన్నారు. కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లోను అత్యధిక ద్రవ్యోల్బణం నమోదైందని, ద్రవ్యోల్బణంపై ఉపన్యాసాలు ఇచ్చే హక్కు కాంగ్రెస్‌కు లేదని చెప్పారు.

కాంగ్రెస్ హయాంలో మరచిపోలేని కుంభకోణాలు

కాంగ్రెస్ హయాంలో నాటి బోఫోర్స్, 2జీ, కామన్వెల్త్, బొగ్గు, ఆదర్శ్, నేషనల్ హెరాల్డ్, డీఎల్ఎఫ్, దాణా కుంభకోణాలు ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని తెలిపారు. కాంగ్రెసేతర ప్రభుత్వ హయాంలో రహదారులు, జాతీయ రహదారుల వృద్ధి రేటు 5.3 శాతం నుంచి 8.25 శాతానికి పెరిగిందన్నారు. రహదారులపై రాబడి కూడా రూ.32 వేల కోట్ల నుంచి రూ.1.12 లక్షల కోట్లకు, నిర్మాణవేగం రోజుకు 12 కిలోమీటర్ల నుంచి 28 కిలోమీటర్లకు పెరిగాయని వివరించారు. యూపీఏ హయాంలో రైల్వేల అభివృద్ధికి రూ.46 వేలకోట్ల పెట్టుబడులు పెడితే ప్రస్తుత ప్రభుత్వం దాన్ని మూడురెట్లు పెంచిందన్నారు. 2004-14 మధ్య 44 కొత్త విమానాశ్రయాలు నిర్మించగా పదేళ్ల ఎన్డీయే హయాంలో 74 విమానాశ్రయాలు నిర్మించిందని చెప్పారు. 2014లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇండెక్స్‌లో భారతదేశం 142వ స్థానంలోఉంటే ప్రస్తుతం 63వ స్థానంలో ఉందని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ కరప్షన్ అనే కాంగ్రెస్ యుగం తొలగిపోవడంతో గత పదేళ్లుగా చిన్న, పెద్ద వ్యాపారాలకు బహుళ ప్రయోజనాలు సమకూరాయని చెప్పారు. గడిచిన 20 ఏళ్లు గమనిస్తే.. 2004-14 మధ్య కాంగ్రెస్ దేశప్రజలను మోసం చేసిన విషయం స్పష్టంగా అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ దేశ ప్రయోజనాల కంటే స్వప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చిందని, ఆర్థిక నిరాశను పెంచిందని చెప్పారు. తప్పుడు వాగ్దానాలతో ఖజానాను కొల్లగొట్టి దేశ ఆర్థికవ్యవస్థను తిరోగమనంలోకి నెట్టిందన్నారు. కాంగ్రెస్ లేకుంటే దేశం ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశంగా మారి ఉండేదని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఆర్థికవ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిన కాంగ్రెస్ పాలనను ప్రజలు ఎప్పటికీ క్షమించరని విజయసాయిరెడ్డి చెప్పారు.



దోచుకోవడమే చంద్రబాబు విజన్

అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థలను అప్పుల పాలు చేసింది చంద్రబాబేనని, గత ప్రభుత్వంలో దోచుకోవడంపైనే చంద్రబాబు తన విజన్ అంతా ఉపయోగించారని ప్రజాప్రతినిధులు ఆరోపించారు. అసెంబ్లీ, మండలిలో ప్రజా సమస్యలపై చర్చించాలని టీడీపీకి లేదని, పబ్లిసిటీ కోసమే అనవసర రాద్ధాంతాలు చేస్తున్నారని మండిపడ్డారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం మాట్లాడారు.

టీవీల్లో కనబడటానికే టీడీపీ ఆందోళన: మంత్రి చెల్లుబోయిన



ప్రతిపక్షం ప్రజల కోసం మాట్లాడటానికి ఇష్టపడటం లేదు. వెళ్లిపోవడానికే అసెంబ్లీకి వచ్చి గందరగోళం సృష్టిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ పాఠశాలకు ఇష్టానుసారంగా చంద్రబాబు అనుమతులిచ్చారు. పేదరికం నిర్మూలన జరగాలంటే విద్యే కీలకం..ఆ విద్యకు సీఎం జగన్ పెద్ద పీట వేస్తున్నారు. మీడియాలో కనిపించాలని టీడీపీ సభ్యులు అసెంబ్లీలో ఆందోళన చేస్తున్నారు.

ఎర్ర స్మగ్లర్లకు నాయకుడు బాబే: డిప్యూటీ సీఎం నారాయణ స్వామి



దొంగే..దొంగా దొంగా అని అరిచిన చందంగా ఎర్రచందనం స్మగ్లర్లకు నాయకుడైన చంద్రబాబు మా పార్టీ నేతల్ని విమర్శిస్తున్నారు. చంద్రబాబు అధికారంలో ఉండగానే నారావారి పల్లెలో ఎర్రచందనం దుంగల్ని పట్టుకున్నది నిజం కాదా? మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి తమ్ముడు కిషోర్‌కుమార్ రెడ్డి పెద్ద ఎర్రచందనం స్మగ్లరని బాబే ప్రతీసారి చెప్పేవారు కదా? స్మగ్లింగ్, దోపిడీల్లో చంద్రబాబును మించినోళ్లు ఎవరూ లేరు.

దోచుకోవడమే బాబు విధానం: ఎమ్మెల్యే మద్దాళి గిరి



చంద్రబాబు అధికారంలో నుంచి దిగిపోయే నాటికి రూ.4.5 లక్షల కోట్లు అప్పు పెరిగింది. అభివృద్ధి లేకపోతే ఇన్ని కోట్ల రూపాయలు ప్రజల అకౌంట్‌ల్లో ఎలా వేస్తాం? రాష్ట్ర విభజన నాటికి 2014లో ఏపీ ఎస్పీడీసీఎల్‌కు రూ.3 వేల కోట్లు అప్పు ఉంటే బాబు దిగిపోయే (2019) నాటికి రూ.25 వేల కోట్లకు చేరింది. కేవలం రూ.1.50 పైసలు, రూ.2 కు దొరికే గ్రీన్ ఎనర్జీని రూ.4.85కు కొని ఆ సొమ్మును బాబు దోచుకున్నాడు.

జగన్‌తోనే నా ప్రయాణం: పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



నేను కాంగ్రెస్‌లోకి వెళ్తున్నానని దుష్ప్రచారం చేస్తున్నారు. అలా ఎన్నటికీ జరగదు. నేను జగన్‌తోనే ప్రయాణం చేస్తాను. ఇది మా కుటుంబం. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలకు కృతజ్ఞతలు.

కేటాయింపులు ఎక్కువ..ఖర్చు తక్కువ: పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



డీబీటీ ద్వారా ప్రజలకు బదిలీ చేసిన నిధుల గురించే బడ్జెట్‌లో ఎక్కువగా చెప్పుకున్నారు. విభజన సమస్యలు పరిష్కారం అవుతున్నాయని వెల్లడించారు. కానీ అవన్నీ ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. కేటాయింపుల కంటే ఖర్చు చేసింది తక్కువ. వైఎస్సార్‌సీపీ పాలనలో ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారు.

లెక్కలు పెంచి చూపించారు: పీడీఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు



బడ్జెట్‌లో లెక్కలన్నీ పెంచి చూపించారు. వాస్తవ లెక్కలు వేరుగా ఉంటాయి. కేటాయింపులు కూడా ఖర్చు జరగడం లేదు. సంక్షేమం అనే మాట చెబుతున్నారు. మరి అభివృద్ధి మాటేమిటి. చంద్రబాబు అమరావతి రాజధాని అన్నారు. జగన్ మూడు రాజధానులన్నారు. కానీ శాశ్వత రాజధాని లేదు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

అంగన్‌వాడీలకు అత్యధిక వేతనం ఇచ్చే రాష్ట్రాల్లో ఏపీ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు అత్యధిక గౌరవ వేతనం అందించే ఐదురాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటని కేంద్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. దేశంలోని మొత్తం 36 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో అంగన్‌వాడీలకు సగటున నెలకు రూ.ఏడు వేల చొప్పున అత్యధిక వేతనం చెల్లిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ, హరియాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక ఉన్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లకు నెలకు రూ.7 వేలు, హెల్పర్లకు రూ.4,750 చొప్పున అదనపు గౌరవ వేతనం ఇస్తున్నట్లు తెలిపారు. అత్యధిక గౌరవ వేతనం చెల్లిస్తున్న రాష్ట్రాల్లో మొదటి రెండు స్థానాల్లో తెలంగాణ, హరియాణ ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ మూడోస్థానంలో ఉందని చెప్పారు. మధ్యప్రదేశ్‌లో అంగన్‌వాడీ వర్కర్లకు రూ.7 వేల అదనపు గౌరవ వేతనం ఇస్తున్నా.. అక్కడ హెల్పర్లకు రూ.3,500 మాత్రమే చెల్లిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ హెల్పర్లకు అత్యధిక గౌరవ వేతనం ఇస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండుస్థానాల్లో ఉన్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని 2018 అక్టోబర్ 1 నుంచి పెంచినట్లు తెలిపారు. వర్కర్లకు రూ.3 వేల నుంచి రూ.4,500కు, మినీ సెంటర్ల వర్కర్లకు రూ.2,250 నుంచి రూ.3,500కు, హెల్పర్లకు రూ.1,500 నుంచి రూ.2,250కు పెంచినట్లు వివరించారు. ప్రతిభ ఆధారిత ప్రోత్సాహం కింద హెల్పర్లకు నెలకు రూ.250, వర్కర్లకు రూ.500 ఇస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ సేవలు, పారదర్శకత ప్రోత్సహించేలా అంగన్‌వాడీలకు ట్యాబ్‌లు అందించి ఇంటర్నెట్ సౌకర్యం కోసం ఏడాదికి రూ.2 వేలు ఇస్తున్నట్లు చెప్పారు. దేశంలో గత డిసెంబర్ 31 నాటికి 13,48,135 అంగన్‌వాడీ వర్కర్లు, 10,23,068 హెల్పర్లు ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో 55,188 మంది వర్కర్లు, 42,097 మంది హెల్పర్లు ఉన్నట్లు మంత్రి తెలిపారు.

తిరుపతి ఐఐటీకి రూ.1,091 కోట్లు విడుదల

తిరుపతి ఐఐటీ క్యాంపస్ శాశ్వత భవనం నిర్మాణానికి సంబంధించిన సివిల్ వర్క్స్, ఎక్విప్‌మెంట్, ఫర్నిచర్ కొనుగోలుకు రూ.1,091.75 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుభాష్ సర్కార్ చెప్పారు. విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రికరింగ్, నాన్ రికరింగ్ ఖర్చుల కోసం ఇప్పటివరకు రూ.190.17 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. తొలిదశ కింద చేపట్టిన శాశ్వత భవనాల నిర్మాణం పూర్తిచేసి యాజమాన్యానికి అప్పగించినట్లు చెప్పారు.

బద్వేలు-గురువిందపూడి భూసేకరణకు రూ.37 కోట్లు ఖర్చు



బద్వేలు-గురువిందపూడి నాలుగు లేన్ల రహదారికి భూసేకరణకు సుమారు రూ.37 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఆత్మకూరు-నెల్లూరు మధ్య ఈ రహదారిని రూ.297.98 కోట్లతో ఆధునీకరించామని, ఆ పనులు 2017లోనే పూర్తయ్యాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

లోక్‌సభ

1,318 అమృత్ భారత్ స్టేషన్ల ఎంపిక



సాక్షి, న్యూఢిల్లీ: జోనల్ రైల్వేలు, ప్రధాన నగరాలు, పట్టణాల్లోని రైల్వేస్టేషన్ల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా 'అమృత్ భారత్ స్టేషన్' పథకం కింద దేశవ్యాప్తంగా 1,318 స్టేషన్లను ఎంపిక చేసినట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. లోక్‌సభలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లోను పలు స్టేషన్లను ఈ పథకానికి ఎంపిక చేశామన్నారు. రాష్ట్రంలోని ఆదోని, అనకాపల్లి, అనంతపురం, అనపర్తి, అరకు, బాపట్ల, భీమవరం టౌన్, బొబ్బిలి జంక్షన్, చీపురుపల్లి, చీరాల, చిత్తూరు, కడప, కంభం, ధర్మవరం, డోన్, దొనకొండ, దువ్వాడ, యలమంచిలి, ఏలూరు, గిద్దలూరు, గుత్తి, గుడివాడ, గూడూరు, గుండాల, గుంటూరు, హిందూపురం, ఇచ్చాపురం, కదిరి, కాకినాడ టౌన్, కొత్తవలస, కుప్పం, కర్నూలు సిటీ, మాచర్ల, మచిలీపట్నం, మదనపల్లి రోడ్, మంగళగిరి, మార్కాపురం రోడ్, మంత్రాలయం రోడ్, నడికుడి జంక్షన్, నంద్యాల, నరసరావుపేట, నరసాపురం, నౌపాడ జంక్షన్, పార్వతీపురం, పిడుగురాళ్ల, పీలేరు, రాజంపేట, రాజమండ్రి, రాయనపాడు, రేణిగుంట, రేపల్లె, సామర్లకోట, సత్తెనపల్లి, సింహాచలం, సింగరాయకొండ, శ్రీకాళహస్తి, శ్రీకాకుళం రోడ్, సూళ్లూరుపేట, తాడేపల్లిగూడెం, తాడిపత్రి, తెనాలి, తిరుపతి, తుని, విజయవాడ, వినుకొండ, విశాఖపట్నం, విజయనగరం జంక్షన్ రైల్వేస్టేషన్లను ఈ పథకానికి ఎంపిక చేసినట్లు వివరించారు.

రాష్ట్రంలో 6,594మందికి 'సమర్థ' శిక్షణ



టెక్స్‌టైల్ రంగంలో నైపుణ్యాభివృద్ధి కోసం అమలుచేస్తున్న 'సమర్థ' పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 6,594 మంది శిక్షణ తీసుకుని ఉత్తీర్ణత సాధించారని కేంద్ర జౌళిశాఖ సహాయమంత్రి దర్శన జర్దోష్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ ప్రశ్నకు జవాబిచ్చారు.

ఏపీలో 130 కిలోమీటర్ల కవచ్ రూట్



ఆంధ్రప్రదేశ్‌లో 130 కిలోమీటర్ల 'కవచ్' రూట్ ఉందని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బి.వి.సత్యవతి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. దక్షిణమధ్య రైల్వేలో మొత్తం 1,465 కిలోమీటర్ల కవచ్ రూట్ ఉందని చెప్పారు. రాష్ట్రంలో నాలుగు రైల్వేజోన్ల పరిధిలో పలు అభివృద్ధి పనులకు 2020 నుంచి రూ.4,124 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 18 ఓవర్ బ్రిడ్జిలు, 207 అండర్ బ్రిడ్జిలు నిర్మించామని, 2023 నుంచి రెండు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లతో కలిపి నాలుగు ఇతర కొత్త రైళ్లు నడిపిస్తున్నామని వివరించారు.

ఏపీకి సత్వరమే ప్రత్యేకహోదా ఇవ్వాలి



ఆంధ్రప్రదేశ్‌కు సత్వరమే ప్రత్యేకహోదా మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని భర్తీచేయాల్సిన బాధ్యత కేంద్రంపైనే ఉందన్నారు. ప్రత్యేకహోదా ఆంధ్రప్రజల హక్కుగా గుర్తించాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ ప్రాముఖ్యముందని, ఏపీ ప్రజలకు జీవనాడి లాంటిదని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తొలిదశ పనులకు రూ.17,144.06 కోట్లుగా సవరించి పంపించిన అంచనా ప్రతిపాదనను ఆమోదించాలని కోరారు. దీంతోపాటు ఏపీ ప్రభుత్వం పునరావాసం, పరిహారం నిమిత్తం వెచ్చించిన రూ.4,222.91 కోట్ల అదనపు వ్యయాన్ని కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలోని ఎన్‌టీసీ మిల్లులో కోవిడ్ కారణంగా నిలిచిపోయిన ఉత్పత్తి కార్యక్రమాలను తిరిగి ప్రారంభిస్తే వందలాది కుటుంబాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. యువత, మహిళలు, రైతులు, పేదల సంక్షేమం, అభివృద్ధిని అందించే సిద్ధాంతాలపై యువజన శ్రామిక రైతు (వైఎస్సార్) కాంగ్రెస్ పార్టీ ఏర్పాటైందని చెప్పారు. ఇదే కేంద్ర వికసిత్ భారత్‌కు ఆదర్శమైందని ఆయన పేర్కొన్నారు.





* ద్విజ్

చాలామంది వృథా కాలక్షేపాలతో సమయాన్ని వ్యర్థం చేస్తుంటారు.
అతి కొద్దిమంది మాత్రమే వ్యర్థాలను కూడా ఉపయుక్తంగా మలచి, తమ జీవితాన్ని కూడా అర్థవంతంగా మార్చుకుంటారు.
ఆ కొద్దిమంది జాబితాలో నిలుస్తుంది సౌమ్య కల్లూరి.
ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వాసి అయిన సౌమ్య ముంబైలో సోషల్ ఎంటర్‌ప్రైజ్ 'ద్విజ్' అనే సంస్థను ఏర్పాటు చేసి దాని ద్వారా వాడి పడేసే డెనిమ్ దుస్తులను తిరిగి ఉపయోగించుకునేలా బ్యాగులు, టోపీలు, జ్యువెలరీ, క్లచ్‌లు, ఇతర యాక్సెసరీస్.. తయారు చేస్తోంది.
ఈ పని ద్వారా 40 మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.
హైదరాబాద్ గచ్చిబౌలిలోని నిథిమ్‌లో జరుగుతున్న దస్తకారి హాత్ సమితి క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన డెనిమ్ స్టాల్‌లో తన ఉత్పత్తుల ద్వారా వ్యర్థాలతో కొత్త అర్థాలను మనకు పరిచయం చేస్తోంది.

రెండోసారి మరింత కొత్తగా!

సౌమ్య కల్లూరి

"ద్విజ్ అంటే రెండవది అని అర్థం వచ్చేలా ఈ రీయూజ్ కాన్సెప్ట్‌ను ఎంచుకున్నాను. డెనిమ్ లేదా జీన్స్ అని పిలిచే క్లాత్ చాలా గట్టిగా ఉంటుందని మనకు తెలుసు. కొంత కాలం వాడాక పాతబడి పోవడమో, బోర్ అనిపించడమో, రంగు వెలిసిందనో పిల్లలవైతే పొట్టిగా అయ్యాయనో .. ఇలా రకరకాల కారణాలతో డెనిమ్ దుస్తులను ఎవరికైనా ఇచ్చేస్తుంటారు. అవి తీసుకున్నవాళ్లు వాటిని వాడతారు అనే నమ్మకం లేదు. ఎందుకంటే, అవి వారి సైజుకు సరిపోకపోవచ్చు. వారు వాటిని చెత్తలో పడేయచ్చు. ప్రపంచమంతటా విరివిగా ఉపయోగిస్తూ, వాడి పడేసే జీన్స్‌ను తిరిగి ఉపయుక్తంగా మార్చేలా చేసిన ప్రయోగాలు మంచి ఫలితాలను ఇచ్చాయి. దీంతో 2018లో ఈ ప్రాజెక్ట్‌ను 6 లక్షల రూపాయలతో ఆరంభించాను.






పర్యావరణ హితంగా..

మెకానికల్ ఇంజినీరింగ్ చేసి, ఎమ్మెస్ కోసం జర్మన్ వెళ్లాను. అక్కడ కార్బన్ ఉద్గారాలు, వ్యర్థాలపై పరిశోధన చేస్తున్నప్పుడు చాలా విషయాలు పరిశీలనకు వచ్చాయి. పర్యావరణ హితంగా ఏదైనా వర్క్ చేయాలనుకున్నాను. ఏడాదిన్నర పాటు ఉద్యోగం చేసినా నా ఆలోచనలు మాత్రం రీ సైక్లింగ్ చుట్టూతానే తిరుగుతూ ఉండేవి. వాడేసిన డెనిమ్‌పైన దృష్టి మళ్లి వాటిని సేకరించడం మొదలుపెట్టాను. వాడేసిన వాటర్ బాటిల్స్‌ను సేకరించి, రీ సైకిల్ చేసి, బ్యాగ్ లోపలివైపు వచ్చేలా డిజైన్ చేశాను. దీనివల్ల ఏదైనా పదార్థాన్ని బ్యాగ్‌లో తీసుకెళుతున్నప్పుడు డబ్బా మూతలు లీక్ అయినా సమస్య ఉండదు. ఈ బ్యాగ్‌లు ఎక్కడా పాతవిగా అనిపించవు. మొదటిసారి వాడుతున్నట్టుగానే ఉంటాయి. ఈ తరం కోరుకునే బ్యాక్ ప్యాక్స్, క్లచ్‌లు, ల్యాప్‌టాప్ బ్యాగ్‌లు.. కూడా మా దగ్గర అందుబాటులో ఉన్నాయి.





చిన్న పీస్‌ను కూడా వదలం

వాడేసిన జీన్స్‌ను సెకండ్ హ్యాండ్ మార్కెట్లో బల్క్‌లో కొనుగోలు చేస్తాం. కొందరు నేరుగా వచ్చి డొనేట్ చేస్తారు. ముందు వాటిని శుభ్రం చేయిస్తాం. ఆ తర్వాత వాటి సైజ్, షేడ్, సన్నం, మందం.. క్లాత్‌ని బట్టి దేనిని ఎలా మలచాలి అనే ఆలోచనకు వస్తాం. పదిమంది ఫుల్ టైమ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. 30 మంది మహిళలు వాళ్ల ఇంటి నుంచే పని చేస్తారు. బాగా మందంగా ఉండి, పెద్ద పెద్ద జీన్స్ వస్తే వాటిని బ్యాగ్‌లుగా తయారు చేస్తాం. కొంచెం మీడియం సైజు వాటితో చిన్న బ్యాగ్స్.. పలుచటి, చిరిగిన జీన్స్‌తో హ్యాండ్‌మేడ్ జ్యువెలరీ తయారు చేస్తాం. ఇంకా, బొమ్మలు, ఎంబ్రాయిడరీ చేసి హోమ్ డెకార్ ఐటమ్స్ కూడా ఇందులో ఉంటాయి. మా దగ్గరకు వచ్చిన జీన్స్‌లో చిన్న ముక్కను కూడా వృథాగా పోనివ్వం. ఈ రోజుల్లో పర్యావరణం ఎలా ఉంటుందో చూస్తున్నాం. కాలానుగుణంగా వర్షాలు పడవు, భూతాపం పెరిగిపోతుంటుంది. కాలుష్యం కంపెనీల నుంచో, వాహనాల నుంచో వస్తుందనే అనుకుంటాం. కానీ, మనం రోజూ వాడే బట్టలు కూడా కాలుష్యానికి పెద్ద కారకం. ఈ సమస్య నివారణకు చేసిన చిన్న ప్రయత్నమే ద్విజ్.

మీ దగ్గర ఉపయోగించని జీన్స్ ఉంటే, వాటిని తీసుకువచ్చి ఈ నెల 11వ తేదీ వరకు హైదరాబాద్‌లోని నిథిమ్‌లో జరిగే దస్తకారీ హాత్ సమితి హ్యాండ్‌క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌లోని మా స్టాల్‌లో ఇవ్వచ్చు. లేదంటే, మీరే సేకరించి 'ద్విజ్' అప్ సైకిల్డ్ ఇండియా అడ్రస్‌కు తెలియజేయవచ్చు. ద్విజ్ పేరుతో మా వెబ్‌సైట్ ఉంది. అందులో పూర్తి వివరాలు ఉంటాయి.

స్వచ్ఛంద సంస్థలతో కలిసి

మిషన్ గ్రీన్ ముంబయ్ స్వచ్ఛంద సంస్థతో కలిసి ప్రభుత్వ స్కూల్ పిల్లలకు హ్యాండ్ బ్యాగ్‌లను కానుకగా ఇచ్చాం. దీని ద్వారా అటు చదువుకునే పిల్లలనూ, ఇటు ఈ పనిలో భాగం పంచుకుంటున్న మహిళలనూ ప్రోత్సహిస్తున్నాం. అనిమేధ్ చారిటబుల్ ట్రస్ట్ వారితో కలిసి మహిళలకు డెనిమ్ రీ యూజ్ ప్రాజెక్ట్‌లో భాగంగా వర్క్‌షాప్స్ ఏర్పాటు చేసి, శిక్షణ ఇస్తున్నాం. 2022లో సర్వోదయ ట్రస్ట్ ద్వారా తెలంగాణలోని వికారాబాద్ ప్రభుత్వ పాఠశాల పిల్లలకు హ్యాండ్ బ్యాగ్‌లను కానుకగా ఇచ్చాం. ఇండియా మొత్తంలో క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్స్ ఎక్కడ జరిగినా అక్కడ మా స్టాల్ ఏర్పాటుకు కృషి చేస్తుంటాం. దీనికి విడిగా షాప్ అంటూ ఏమీ లేదు. ఆన్‌లైన్ మార్కెటింగ్ చేస్తుంటాం" అని వివరిస్తారు సౌమ్య.

– నిర్మలారెడ్డి
ఫొటోలు: అనిల్ కుమార్ మోర్ల

కిచెన్‌టిప్స్



- యాపిల్‌ను కట్ చేసి, ఆ ముక్కలను ప్లేట్‌లో అమర్చి సర్వ్ చేసే లోపే ముక్కలు రంగు మారుతుంటాయి. కాబట్టి కట్ చేసిన వెంటనే ఆ ముక్కల మీద నిమ్మరసం చల్లితే ముక్కలు తాజాగా ఉంటాయి. చాకును నిమ్మరసంలో ముంచి కట్ చేయడం కూడా మంచి ఫలితాన్నిస్తుంది.





- కొత్తిమీరను పలుచని క్లాత్ బ్యాగ్‌లో పెట్టి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచితే ఆకులు ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి.
- పకోడీలు మెత్తబడకుండా ఎక్కువసేపు కరకరలాడుతూ ఉండాలంటే పావు కేజీ శనగపిండిలో గుప్పెడు మొక్కజొన్న పిండి కలపాలి.
- పూరీలు నూనె తక్కువ పీల్చుకుని, పొంగి కరకరలాడాలంటే పూరీలు వత్తేటప్పుడు బియ్యప్పిండి చల్లుకోవాలి.
- కూరగాయలను తొక్క తీసి, తరిగిన తర్వాత నీటిలో శుభ్రం చేస్తే అందులోని పోషకాలు నీటిలో కరిగిపోతాయి. ముఖ్యంగా నీటిలో కరిగే విటమిన్‌లను నష్టపోతాం. కాబట్టి తొక్క తీయడమైనా, తరగడమైనా నీటితో శుభ్రం చేసిన తర్వాత మాత్రమే చేయాలి. అలాగే తరిగిన వెంటనే వండాలి.



పై నియమాన్ని వంకాయలకు పాటించడం కష్టం. ఎందుకంటే తరిగిన వెంటనే నీటిలో వేయకపోతే వంకాయ ముక్కలు నల్లబడడంతోపాటు చేదుగా మారతాయి. కాబట్టి ముందుగా వంకాయలను ఉప్పు నీటిలో కడిగి ఆ తర్వాత తరిగి మళ్లీ నీటిలో వేయాలి.

జెఎల్‌ఎఫ్ 2024



'క్షమించకపోతే మీరు గతంలోనే ఉండిపోతారు' అంటారు **సాధ్వి భగవతి సరస్వతి.**
అమెరికాలో పుట్టి పెరిగిన ఈ యూదురాలు పాతికేళ్లుగా హృషికేశ్‌లో జీవిస్తూ ఆధ్యాత్మికత సాధన చేయడమే కాదు సామాజిక సేవలో విశేష గుర్తింపు పొందారు.
'ఆధునిక జీవితంలో పరుగు పెడుతున్నవారు ఆనందాలంటే ఏమిటో సరిగ్గా నిర్వచించుకోవాలి' అన్నారామె.
'హాలీవుడ్ టు హిమాలయాస్' పేరుతో వెలువడి బెస్ట్ సెల్లర్‌గా నిలిచిన తన ఆత్మకథ గురించి 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో మాట్లాడారు.

హాలీవుడ్ టు హిమాలయాస్


ఆమె ఒక కథతో మొదలెట్టింది.

'ఒక ఊరిలో కోతుల బెడద ఎక్కువైంది. వాటిని పట్టుకుని అడవిలో వదిలిపెట్టాలి. ఏం చేశారంటే కొబ్బరి బోండాలకి కోతి చేయి పట్టేంత చిన్న చిల్లి చేసి వాటిలో కోతులకు ఇష్టమైన హల్వాను పెట్టారు. కోతులు ఆ హల్వా కోసం లోపలికి చేయి పెట్టి పిడికిలి బిగిస్తాయి. కాని చేయి బయటకు రాదు. కొబ్బరి బోండాంలో ఇరుక్కున్న చేతితో అది ఎక్కువ దూరం పోలేదు. అప్పుడు దానిని పట్టుకుని అడవిలో సులభంగా వదలొచ్చు. ఇక్కడ తెలుసుకోవాల్సిందేమంటే కోతి గనక పిడికిలి వదిలేస్తే చేయి బయటకు వచ్చేస్తుంది. కాని అది వదలదు. హల్వా కావాలి దానికి. మనిషి కూడా అంతే. తనే వెళ్లి జంజాటాల్లో చిక్కుకుంటాడు. పిడికిలి వదిలితే శాంతి పొందుతాడు' అందామె.

హృషికేశ్‌లోని గంగానది ఒడ్డున పరమార్థ్ ఆశ్రమ్‌లో గత పాతికేళ్లుగా జీవిస్తున్న సాధ్వి భగవతి సరస్వతి నిజానికి భారతీయురాలు కాదు. భారతదేశంతో ఏ సంబంధమూ లేదు. ఆమె అమెరికాలో జన్మించిన యూదురాలు (అసలు పేరు చెప్పదు). స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీలో గ్రాడ్యుయేషన్ చేసి ఆ తర్వాత సైకాలజీలో పీహెచ్‌డీ చేసింది. హాలీవుడ్ ఉండే లాస్ ఏంజిలస్‌లో ఎక్కువ కాలం నివసించిన ఆమె హాలీవుడ్‌లో పని చేసింది కూడా. కాని 1997లో భర్తతో కలిసి తొలిసారి ఇక్కడకు వచ్చినప్పుడు గంగానది చూసి ఆమె పొందిన ప్రశాంతత అంతా ఇంతా కాదు. ప్రశాంతమైన జీవన విధానం భారతీయ తత్త్వ చింతనలో ఉందని విశ్వసించి అప్పటి నుంచి ఇక్కడే ఉండిపోయింది. విచిత్రమేమంటే ఈ దేశ జీవన విధానాన్ని మరచి ఆధునికవేగంలో కూరుకుపోయిన వారికి ఆమె పరిష్కార మార్గాలు బోధిస్తున్నది.

సంతోషానికి నిర్వచనం ఏమిటి?

'బిడ్డ పుట్టినప్పటి నుంచి తల్లిదండ్రులు ఆ బిడ్డ సంతోషంగా ఉండాలంటే ఏం చేయాలో చెబుతుంటారు. బాగా చదవాలి, బాగా మార్కులు తెచ్చుకోవాలి, ఈ కోర్సులోనే చేరాలి, ఈ దేశమే వెళ్లాలి, ఫలానా విధంగా పెళ్లి చేసుకోవాలి, ఫలానా విధంగా డబ్బు వెనకేసుకోవాలి... ఇంత ప్రయాస పడితే తప్ప మనిషి



'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో మాట్లాడుతున్న సాధ్వి భగవతి సరస్వతి

సంతోషంగా ఉండలేడన్న భావన తలలో నిండిపోయి ఉంది. అయితే డబ్బు ఎక్కువగా ఉంటే సంతోషంగా ఉండగలమా? సంతృప్తిగా జీవించడంలో సంతోషం ఉంది. జీవితంలో అనుక్షణం సంతోషం పొందడం నేర్చుకోవడం లేదు. ఎప్పుడో ఏదో సంతోషం దొరుకుతుందనే తాపత్రయంతో ఈ క్షణంలోని సంతోషం పొందకుండా మనిషి పరిగెడుతున్నాడు' అంటుందామె.

హాలీవుడ్‌ను వదిలి

సాధారణంగా చాలామంది అమెరికాలో స్థిరపడి సంతోషకరమైన జీవితం గడపాలనుకుంటారు. కాని సాధ్వి భగవతి అమెరికాను విడిచి గంగానది ఒడ్డున ప్రశాంతంగా జీవించడంలో సంతోషం ఉందని ఇక్కడ ఉండిపోయింది. 'నా భర్త నాకు భారతదేశం గురించి చెప్పాడు. అతనే నన్ను ఇక్కడకు తీసుకొచ్చాడు. కానీ ఒక్కసారి ఇక్కడ గంగానదిని చూశాక, గురువును పొందాక ఇక ఎక్కడికీ వెళ్లకూడదనుకుని ఉండిపోయాను' అని తెలిపిందామె. ఆధునిక జీవితం నుంచి ఆధ్యాత్మిక జీవనంలో తాను ఎందుకు, ఎలా ప్రయాణించిందో తెలిపే ఆత్మకథను 'హాలీవుడ్ టు హిమాలయాస్' పేరుతో రాసిందామె. అది బెస్ట్ సెల్లర్‌గా ఉంది. గత పాతిక సంవత్సరాలుగా హిమాలయాల్లో పేదవారి కోసం సామాజిక సేవ చేస్తున్నదామె. అందుకే అమెరికా ప్రెసిడెంట్ బైడన్ ఆమెను 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు'తో గౌరవించాడు.

ఆ పిల్లల కళ్లల్లో నిశ్చింత

'హిమాలయాలకు మొదటిసారి వచ్చినప్పుడు ఇక్కడ ఒంటి మీద చొక్కా లేకపోయినా పిల్లల కళ్లల్లో నిశ్చింత చూశాను. లాస్ ఏంజిలస్‌లో అలాంటి నిశ్చింతతో పిల్లలు ఉండరు. ఆ నిశ్చింత, సంతోషం ఎందుకు పోగొట్టుకుంటున్నాం మనం? ఫిర్యాదులు, ప్రతీకారం, క్షమించకపోవడం... మనల్ని ముందుకు పోనీకుండా చేస్తాయి. ఎదుటివాళ్లు చేసిన తప్పులను మనం అంగీకరించకపోవచ్చు. కాని వాటిని దాటి ముందుకెళ్లాలంటే క్షమించడమే మార్గం. లేదంటే మనం గతంలోనే కూరుకుపోతాం. జీవితానికి ఏం మేలు చేస్తున్నావన్నది కాదు... జీవితం ద్వారా ఏం మేలు పొందుతున్నావన్నదే ముఖ్యం' అన్నారామె.

ఇంటర్వ్యూ: జైపూర్ నుంచి 'సాక్షి' ప్రతినిధి

కొత్త జీవితం

ఎడారి చీకటి నుంచి వెన్నెల వెలుగులోకి...

'మీ బిడ్డ నాలుగు-అయిదు సంవత్సరాలకు మించి బతకడు' అని వైద్యులు చెప్పినప్పుడు ఎత్తైన చోటు నుంచి చీకటిలోయల్లో పడిపోయినట్లు తల్లడిల్లి పోయింది మౌష్మి కపాడియా.
మూడు సంవత్సరాలు డిప్రెషన్ చీకట్లో కూరుకుపోయిన మౌష్మి ఒక్కొక్క అడుగు వేస్తూ వెలుగుదారిలోకి వచ్చింది.
ఆట-పాటలతో తనలో ఉత్సాహాన్ని నింపుకొంది.
ఆ ఉత్సాహాన్ని శక్తి చేసుకుంది.
బైకర్‌గా దేశాన్ని చుట్టి వచ్చింది.
ట్రెక్కర్‌గా ఎన్నో సాహసాలు చేసింది.
ఇంటి గడప దాటలేడు అనుకున్న కుమారుడికి ప్రపంచం చూపుతూ ఉత్సాహాన్ని, శక్తిని ఇస్తోంది మౌష్మి కపాడియా...

మౌష్మి కపాడియా కుమారుడు వేదాన్ష్‌కు రిజిడ్ స్పైన్ మస్క్యులార్ డిస్ట్రఫీ(ఆర్‌ఎస్‌ఎమ్‌డీ) అని నిర్ధారించిన వైద్యులు 'ఇది నయం చేయలేని వ్యాధి' అన్నారు.

ఆ బాధ మాటలకు అందనిది. తట్టుకోలేనిది.

తనలో తాను ఎంతో కుమిలిపోయింది మౌష్మి.

పిల్లాడికి సంబంధించి ఏం చేయాలి? ఏం చేయకూడదు, ఎలా కేర్ తీసుకోవాలో వివరించారు వైద్యులు. వేదాన్షును తీసుకొని దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్న భర్త ప్రియేష్ దగ్గరకు వెళ్లింది. మూడేళ్ల వయసులో వేదాన్ష్ న్యుమోనియా ఎటాక్‌కు గురయ్యాడు. ఐసీయూలో ఉన్న తన బిడ్డను చూసి కుప్పకూలిపోయింది మౌష్మి. ఆ భయానకమైన రోజు ఇప్పటికీ తన కళ్లముందే కదలాడుతున్నట్టు ఉంటుంది.

బిడ్డ పరిస్థితి ఎలా ఉండబోతుందో తెలియదు. తాను చేయగలిగిందల్లా దూరం నుంచి బిడ్డను చూస్తూ మనసులో ఏడ్వడం మాత్రమే.

ఆశ కోల్పోయిన వైద్యులు...

'దేవుడిని ప్రార్థించండి. మేము మా వంతు ప్రయత్నం చేశాం' అన్నారు. ఈ మాటలు తనను మరింత కృంగిపోయేలా చేశాయి.

వెంటిలేటర్‌పై అయిదురోజులు ఉన్నాడు వేదాన్ష్. ఆ హాస్పిటల్‌లో పనిచేసే డాక్టర్ ఒకరు మెరుగైన చికిత్స కోసం ఇండియాకు వెళితే మంచిది అని సలహా ఇచ్చాడు. అతడి సలహా ప్రకారం బిడ్డను తీసుకొని భర్తతో కలిసి ముంబైకి వచ్చింది మౌష్మి.

అబ్బాయిని ఇంటికి తీసుకువెళ్లిన రోజును గుర్తు తెచ్చుకుంటే ఇప్పటికీ వణికిపోతుంది మౌష్మి.

'ఇరవై ఏళ్ల క్రితం దుబాయ్‌లో వైద్యసదుపాయాలు అంత బాగాలేవు. శ్వాస తీసుకోవడానికి అవసరమైన ప్రత్యేక యంత్రాలు లేవు' అని దుబాయ్‌లో ఆనాటి పరిస్థితులను గుర్తు తెచ్చుకుంటుంది మౌష్మి.

ముంబైలోని హాస్పిటల్‌లో కొన్నిరోజులు ఉన్న తరువాత వేదాన్ష్ పరిస్థితి మెరుగుపడింది.

ఆశాదీపం ఏదో కనిపించి ఆ క్షణంలో ధైర్యం ఇచ్చింది. అయితే వైద్యులు మాత్రం...

'నాలుగు-అయిదు సంవత్సరాలకు మించి బతకడు' అని చెప్పారు.

బలహీనమైన ఊపిరితిత్తుల వల్ల వేదాన్ష్ ఎన్నోసార్లు నిమోనియా బారిన పడ్డాడు. 'ఇంటి నుంచి ఆస్పత్రి-ఆస్పత్రి నుంచి ఇంటికి' అన్నట్లు ఉండేది పరిస్థితి. కొంత కాలం తరువాత మరో బిడ్డకు జన్మనిచ్చింది మౌష్మి. ఇది మౌష్మి జీవితాన్ని మరింత కష్టాల్లోకి నెట్టింది. డిప్రెషన్ అనే చీకట్లోకి తీసుకెళ్లింది.

'అకారణంగా కోపం వచ్చేది. చీటికిమాటికి చిరాకు పడేదాన్ని. తలుపులు గట్టిగా వేసేదాన్ని. నేను డిప్రెషన్‌లో ఉన్నాను అనే విషయం అప్పుడు తెలియదు. ఇలా ఎందుకు చేస్తున్నాను? అని నా గురించి నేను ఆలోచించే పరిస్థితిలో లేను. ఆ సమయంలో నా ఫ్రెండ్ ఒకరు కౌన్సిలింగ్‌కు వెళ్లమని సలహా ఇచ్చారు' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది మౌష్మి.

అయితే మందుల ప్రభావంతో ఆమె బరువు పెరిగింది. ఆ బరువు మోకాళ్లపై ప్రతికూల ప్రభావం చూపింది.



వేదాన్ష్

సవాళ్లను అధిగమించేలా...

వేదాన్ష్‌లో వయసుకు మించిన పరిణతి కనిపిస్తుంది. ఓటమికి తలవంచని వేదాన్ష్ నోటి నుంచి తరచుగా వచ్చే మాట 'హ్యాపీ ఎబౌట్ ఎవ్రీ థింగ్ అండ్ శాడ్ ఎబౌట్ నథింగ్'

'జీవితం మన ముందు ఎన్నో సవాళ్లు పెడుతుంది. వాటిని అధిగమిస్తామా లేదా అనేదానిపైనే మనం ముందుకు వెళ్లే దారి నిర్ణయం అవుతుంది' అంటాడు వేదాన్ష్

కుమారుడితో మౌష్మి కపాడియా



సాహసాలకు సై



'ఫిజికల్ యాక్టివిటీ ఉండాలి' అని చెప్పారు వైద్యులు. అలా తన ఫిట్‌నెస్ జర్నీ మొదలైంది. కొత్త జీవితానికి మొదటి అడుగు పడింది. తనకు ఇష్టమైన టెన్నిస్ ఆడడం మొదలు పెట్టింది. ఆడుతున్న సమయంలో తన మూడ్ చేంజ్ అవుతున్నట్లు, ఉత్సాహం వచ్చి చేరుతున్నట్లు అనిపించింది. జుంబా క్లాసులలో కూడా చేరి మరింత ఉత్సాహాన్ని పెంచుకుంది.

మూడేళ్లపాటు డిప్రెషన్‌తో పోరాడి బయట పడిన మౌష్మి ఇద్దరు బిడ్డలను కంటి పాపల్లా చూసుకోవాలనుకుంది. 'గత చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రపంచంలోని బెస్ట్ మామ్ కావాలనుకున్నాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది మౌష్మి.

మూడు సంవత్సరాలుగా తనను వెంటాడిన నిరాశాని స్పృహలు, విషాదం కోపం లాంటి వాటి నుంచి బయటపడిన తరువాత పిల్లలతో హాయిగా గడిపే కాలం, పిల్లలే నా ప్రపంచం అనే కల కన్నది.

బైక్‌పై దేశాన్ని చుట్టి రావాలి... ఎత్తైన పర్వతశిఖరాలను అధిరోహించాలి అనేది తన కల.

పీడకలలాంటి జీవితం నుంచి బయటపడ్డ మౌష్మి కపాడియా తన కలను నిజం చేసుకుంది. పర్వతారోహణకు సంబంధించి ఎన్నో సాహసాలు చేసింది. ఇంటికే పరిమితం అవుతాడనుకున్న వేదాన్ష్‌కు ప్రపంచాన్ని చూపింది. 'విషాదం తప్ప అతడికి తోడు ఏదీ లేదు' అని ఇతరులు సానుభూతి చూపే సమయంలో 'నిరంతరం ఆనందమే నా బలం' అని ధైర్యంగా ముందుకువెళ్లేలా చేసింది. బిడ్డతో కలిసి 21 దేశాలకు వెళ్లి వచ్చిన మౌష్మి కపాడియా ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకుంది.



రెండో సీడ్ జోడీకి అనిరుధ్ ద్వయం షాక్

డాలస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్ విభాగంలో సంచలన విజయంతో శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో అనిరుధ్–విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) ద్వయం 6–4, 7–6 (7/2)తో రెండో సీడ్ నథానియల్ లామోన్స్–జాక్సన్ విత్రో (అమెరికా) జంటకు షాక్ ఇచ్చింది. 85 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్ జోడీ మూడు ఏస్‌లు సంధించి, ఒకసారి ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసింది.



భారత ట్రాప్ షూటర్లకు నిరాశ

ప్రపంచకప్ షాట్‌గన్ షూటింగ్ టోర్నీలో తొలిరోజు భారత షూటర్లకు నిరాశ ఎదురైంది. మొరాకోలో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల, పురుషుల ట్రాప్ వ్యక్తిగత విభాగాల్లో భారత షూటర్లెవరూ ఫైనల్‌కు చేరుకోలేకపోయారు. మహిళల ట్రాప్ క్వాలిఫయింగ్‌లో రాజేశ్వరి 113 పాయింట్లతో 8వ ర్యాంక్‌లో నిలిచింది. టాప్–6లో నిలిచినవారు ఫైనల్ చేరుకుంటారు. భారత్‌కే చెందిన భవ్య 19వ ర్యాంక్‌లో, మనీషా 24వ ర్యాంక్‌లో నిలిచారు. పురుషుల ట్రాప్ క్వాలిఫయింగ్‌లో భౌనీష్ 17వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.



పోరాడి ఓడిన రష్మిక

సాక్షి, హైదరాబాద్: ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ–125 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం ముగిసింది. ముంబైలో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 520వ ర్యాంకర్ రష్మిక 7–5, 4–6, 4–6తో రష్యా టీనేజర్, ప్రపంచ 134వ ర్యాంకర్ అలీనా కోర్నివా చేతిలో పోరాడి ఓడిపోయింది. 2 గంటల 24 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఐదు ఏస్‌లు సంధించి, ఏకంగా 14 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. మరో వైపు డబుల్స్ తొలి రౌండ్‌లో సహజ యామలపల్లి–వైష్ణవి (భారత్) జోడీ 3–6, 6–7 (1/7)తో రెండో సీడ్ సబ్రీనా (అమెరికా)–దలీలా జకుపోవిచ్ (స్లొవేనియా) జంట చేతిలో ఓటమి చవిచూసింది.

భారత్‌కు మూడో ఓటమి



భువనేశ్వర్: మహిళల ప్రొ లీగ్ హాకీ టోర్నీలో సొంతగడ్డపై భారత జట్టుకు వరుసగా మూడో పరాజయం ఎదురైంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 0–3 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి చవిచూసింది. ఆస్ట్రేలియా తరఫున గ్రేస్ స్టీవర్ట్ (19వ ని.లో), టాటుమ్ స్టీవర్ట్ (23వ ని.లో), కైట్లిన్ నాబ్స్ (55వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. శుక్రవారం జరిగే మ్యాచ్‌లో అమెరికాతో భారత్ ఆడుతుంది. తొమ్మిది జట్లు పాల్గొంటున్న ఈ లీగ్‌లో ఇప్పటి వరకు భారత్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి ఎనిమిదో స్థానంలో ఉంది.

బుమ్రా నంబర్‌వన్



ఐసీసీ టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం అందుకున్న తొలి భారత పేసర్‌గా గుర్తింపు

తాజా ఘనతతో మూడు ఫార్మాట్‌లలో నంబర్‌వన్‌గా నిలిచిన తొలి బౌలర్‌గా రికార్డు

దుబాయ్: భారత్ నుంచి ఎంతోమంది పేస్ బౌలర్లు టెస్టుల్లో పలుమార్లు అత్యుత్తమ ప్రదర్శనతో అలరించారు. కానీ ఏనాడూ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకోలేకపోయారు. అయితే ఆ లోటును తీరుస్తూ జస్‌ప్రీత్ బుమ్రా ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానాన్ని అందుకున్న తొలి భారతీయ పేస్ బౌలర్‌గా అవతరించాడు. బుధవారం విడుదల చేసిన ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 30 ఏళ్ల బుమ్రా మూడు స్థానాలు ఎగబాకి తన కెరీర్‌లో తొలిసారి ఈ ఫార్మాట్‌లో టాప్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. విశాఖపట్నంలో ఇంగ్లండ్ జట్టుతో జరిగిన రెండో టెస్టులో బుమ్రా తన పేస్ పదునుతో తొమ్మిది వికెట్లు (6/45; 3/46) పడగొట్టి భారత విజయంలో కీలకపాత్ర పోషించడంతోపాటు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పురస్కారం గెల్చుకున్నాడు. బుమ్రా ఖాతాలో ప్రస్తుతం 881 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. గత ర్యాంకింగ్స్‌లో 'టాప్' ర్యాంక్‌లో ఉన్న భారత స్పిన్నర్ అశ్విన్ రెండు స్థానాలు పడిపోయి 841 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానానికి చేరుకున్నాడు. దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబడ 851 రేటింగ్ పాయింట్లతో రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు.

ఇప్పటి వరకు భారత్ నుంచి నలుగురు బౌలర్లు మాత్రమే ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచారు. గతంలో భారత స్పిన్నర్లు బిషన్‌సింగ్ బేడీ, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ ఈ ఘనత సాధించగా... పేస్ బౌలర్ రూపంలో బుమ్రా తొలిసారి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇప్పటి వరకు 34 టెస్టులు ఆడిన బుమ్రా 155 వికెట్లు తీసుకున్నాడు. తాజా టాప్ ర్యాంక్‌తో బుమ్రా మరో రికార్డు కూడా నెలకొల్పాడు. క్రికెట్ చరిత్రలో మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) ప్రపంచ నంబర్‌వన్‌గా నిలిచిన తొలి బౌలర్‌గా గుర్తింపు పొందాడు. బుమ్రా 2017 నవంబర్ 4న తొలిసారి టి20 ఫార్మాట్‌లో... 2018 ఫిబ్రవరి 4న తొలిసారి వన్డే ఫార్మాట్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. ప్రస్తుతం బుమ్రా వన్డేల్లో ఆరో ర్యాంక్‌లో, టి20ల్లో వందో ర్యాంక్‌లో ఉన్నాడు. మరోవైపు టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ 37 స్థానాలు ఎగబాకి 29వ ర్యాంక్‌లో నిలిచాడు.

తదుపరి టెస్టులకూ దూరం!



న్యూఢిల్లీ: వ్యక్తిగత కారణాలరీత్యా భారత స్టార్ కోహ్లి ఇంగ్లండ్‌తో జరిగిన తొలి రెండు టెస్టులకు దూరంగా ఉన్నాడు. అయితే తదుపరి మూడు టెస్టులకూ కోహ్లి సేవలు జట్టుకు అందుబాటులో ఉండే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. భారత్, ఇంగ్లండ్ మధ్య మూడో టెస్టు ఈనెల 15 నుంచి 19 వరకు రాజ్‌కోట్‌లో, నాలుగో టెస్టు ఈనెల 23 నుంచి 27 వరకు రాంచీలో జరగనున్నాయి. చివరిదైన ఐదో టెస్టు మార్చి 7 నుంచి 11 వరకు ధర్మశాలలో జరుగుతుంది. తాను జట్టుకు ఎప్పుడు అందుబాటులో ఉంటాననే విషయంపై కోహ్లి బీసీసీఐకి ఇంకా సమాచారం ఇవ్వలేదని తెలిసింది.

'టాప్'లోకి జైపూర్ పింక్ పాంథర్స్



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో ఇప్పటికే ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధించిన జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు మళ్లీ అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో పింక్ పాంథర్స్ 27–22తో దబంగ్ ఢిల్లీని ఓడించింది. జైపూర్ తరఫున అర్జున్ దేశ్వాల్ 10 పాయింట్లు స్కోరు చేశాడు. ఈ లీగ్‌లో పింక్ పాంథర్స్‌కిది 13వ విజయం కావడం విశేషం. ప్రస్తుతం పింక్ పాంథర్స్ 77 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లోకి వచ్చింది. పుణేరి పల్టన్ 76 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 40–31తో బెంగళూరు బుల్స్‌పై గెలిచింది. నేడు విశ్రాంతి దినం. శుక్రవారం జరిగే మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్‌తో గుజరాత్ జెయింట్స్; హరియాణా స్టీలర్స్‌తో యూపీ యోధాస్ తలపడతాయి.

281 పరుగులతో కివీస్ ఘనవిజయం



జేమీసన్, సౌతీ

తొలి టెస్టులో దక్షిణాఫ్రికా పరాజయం

మౌంట్ మాంగనుయ్: నాలుగు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్టులో టిమ్ సౌతీ సారథ్యంలోని న్యూజిలాండ్ 281 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం సాధించింది. పరుగుల పరంగా న్యూజిలాండ్‌కిది రెండో అతిపెద్ద విజయం. న్యూజిలాండ్ నిర్దేశించిన 529 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. బెడింగమ్ (96 బంతుల్లో 87; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా మిగతావారు విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జేమీసన్ (4/58), సాన్‌ట్నర్ (3/59) రాణించారు. అంతకుముందు న్యూజిలాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌ను ఓవర్‌నైట్ స్కోరు 179/4 వద్దే డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ సాధించిన కివీస్ బ్యాటర్ రచిన్ రవీంద్రకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. చివరిదైన రెండో టెస్టు ఈనెల 13 నుంచి హామిల్టన్‌లో జరుగుతుంది.

క్వార్టర్స్‌లో సాకేత్ జోడీ



సాక్షి, హైదరాబాద్: చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టెన్నిస్ టోర్నీలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని పురుషుల డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. బుధవారం చెన్నైలో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సాకేత్–రామ్‌కుమార్ (భారత్) జోడీ 7–6 (7/3), 6–4తో రే హో (చైనీస్ తైపీ)–మతు జెమ్స్కీ (పోలాండ్) జంటను ఓడించింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్–రామ్‌కుమార్ మూడు ఏస్‌లు సంధించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ–నికీ పునాచా (భారత్) జంట 6–2, 6–1తో నపోలిటానో (ఇటలీ)–రొకా బటాలా (స్పెయిన్) ద్వయంపై గెలిచింది.

ఫైనల్లో ఖతర్, జోర్డాన్

దోహా: ఆసియా కప్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఖతర్, జోర్డాన్ జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. బుధవారం జరిగిన రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఖతర్ 3–2తో ఇరాన్ జట్టును ఓడించింది. ఖతర్ తరఫున అబ్దుల్ సలామ్ (17వ ని.లో), అక్రమ్ అఫీఫ్ (43వ ని.లో), అల్మోజ్ అలీ (82వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. తొలి సెమీఫైనల్లో జోర్డాన్ 2–0తో దక్షిణ కొరియాకు షాక్ ఇచ్చి ఈ టోర్నీలో తొలిసారి ఫైనల్‌కు చేరింది. ఫైనల్ ఈనెల 10న జరుగుతుంది.

సినిమా



రవితేజ

విధ్వంసాల జాతర

'మ్యాప్స్‌కి.. రీసెర్చ్‌కి అందని విషయం ఒకటి ఉంది సార్... అక్కడొకడుంటాడు' అనే డైలాగ్‌తో విడుదలైంది 'ఈగల్' సినిమా ట్రైలర్. రవితేజ హీరోగా నటించిన చిత్రమిది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం రేపు రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ''ఇప్పుడు పద్ధతైన దాడి.. ఫిబ్రవరి 9 నుంచి విధ్వంసాల జాతర' అంటూ 'ఈగల్' సినిమా రిలీజ్ ట్రైలర్‌ను రవితేజ 'ఎక్స్'లో షేర్ చేశారు. ''దళం.. సైన్యం కాదు.. దేశం వచ్చినా ఆపుతాను' (రవితేజ) 'ఇక్కడ పదేళ్ల నుంచి ఓ గాడ్జిల్లా ఉన్నాది రా' అనే డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి.



విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్

హృదయాన్ని గిచ్చీ గిచ్చకా...

'గీత గోవిందం' (2018) వంటి హిట్ సినిమా తర్వాత హీరో విజయ్ దేవరకొండ, డైరెక్టర్ పరశురామ్ పెట్ల కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 5న విడుదల కానుంది. చిత్ర సంగీతదర్శకుడు గోపీ సుందర్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'నంద నందనా...' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించిన ఈ పాటను సిద్ శ్రీరామ్ పాడారు. 'ఏమిటిది చెప్పీ చెప్పనట్టుగా ఎంత చెప్పిందో.. సూచనలు ఇచ్చీ ఇవ్వనట్టుగా ఎన్నెన్ని చ్చిందో.. హృదయాన్ని గిచ్చీ గిచ్చకా.. ప్రాణాన్ని గుచ్చీ గుచ్చకా.. చిత్రంగా చెక్కింది దేనికో..' అంటూ ఈ పాట సాగుతుంది. ''ఫ్యామిలీ స్టార్'ని హోల్‌సమ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు పరశురామ్. 'నంద నందనా..' పాట ఈ మూవీకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది'' అన్నారు మేకర్స్.



రజనీకాంత్

ఇండియన్‌గా నేర్చుకోవాల్సింది అదే!

'ఊర్లో ఒక్క మగాడు లేడ్రా.. మందిని మొత్తాన్ని తీసుకుపోయి బొక్కలో తోసుండారు.. సక్కగా ఉన్న ఊర్ని స్మశానం చేసినారు కదరా!' అనే డైలాగ్స్‌తో విడుదలైంది 'లాల్ సలామ్' సినిమా తెలుగు ట్రైలర్. రజనీకాంత్, కపిల్ దేవ్, జీవితా రాజశేఖర్ ప్రధాన పాత్రల్లో విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా నటించిన చిత్రం 'లాల్ సలామ్'. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించారు. ఇందులో ముంబైకి చెందిన మొయిద్దీన్ భాయ్ పాత్ర చేశారు రజనీకాంత్. రేపు 'లాల్ సలామ్' సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన తెలుగు ట్రైలర్‌లో 'ముంబై భాయ్ బాషాలాంటోడురా!', 'మీరే కోర్టును గౌరవించకపోతే ఎలా భాయ్?', 'బిడ్డ సంపాదిస్తే ఇంటికి గౌరవం.. బిడ్డ సాధిస్తే దేశానికే గౌరవం.. మనవాడు దేశాన్నే గర్వపడేలా చేస్తాడు', 'మతాన్ని నమ్మితే మనసులో ఉంచుకో.. మానవత్వాన్ని అందరితో పంచుకో. ఇండియన్‌గా నేర్చుకోవాల్సింది అదే' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.

కొంచెం క్రాక్



'టిల్లు స్క్వేర్'లో సిద్ధు జొన్నలగడ్డ

'డీజే టిల్లు' వంటి హిట్ మూవీతో యూత్‌లో మంచి క్రేజ్ సొంతం చేసుకున్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. బుధవారం (ఫిబ్రవరి 7) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా సిద్ధు నటిస్తున్న రెండు చిత్రాల (టిల్లు స్క్వేర్, జాక్) అప్‌డేట్స్ ఇచ్చారు మేకర్స్. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'జాక్' అనే టైటిల్ ఖరారు చేసి, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'కొంచెం క్రాక్' అనేది ట్యాగ్‌లైన్. ''ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే మరిన్ని వివరాలను వెల్లడిస్తాం'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్.

త్వరలో ట్రైలర్: 'డీజే టిల్లు'కి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. ఈ సినిమా నుంచి స్పెషల్ బర్త్‌డే గ్లింప్స్‌ను విడుదల చేసింది యూనిట్. ఈ మూవీ ట్రైలర్ ఈ నెల 14న రిలీజ్ కానుంది. మార్చి 29న సినిమా రిలీజవుతోంది.



వర్ష బొల్లమ్మ

నా ప్రేమ వార్త నిజం కాదు

''పాత్ర నిడివి కాదు... నా పాత్ర ప్రాముఖ్యతను బట్టి కథలు ఓకే చేయడానికి ఆసక్తి చూపిస్తాను. ఇప్పటి వరకు నేను చేసిన పాత్రలన్నీ అలా ఎంచుకున్నవే'' అన్నారు వర్షా బొల్లమ్మ. సందీప్ కిషన్ హీరోగా నటించిన చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. ఈ చిత్రంలో కావ్యా థాపర్, వర్షా బొల్లమ్మ హీరోయిన్లు. వీఐ ఆనంద్ దర్శకత్వంలో అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ– ''ఊరు పేరు భైరవకోన' సినిమాలో నేను ట్రైబల్ అమ్మాయి భూమి పాత్రలో కనిపిస్తాను. తన ఊర్లో చదువుకున్న అమ్మాయి ఒక్క భూమి మాత్రమే. అందంగా, అమయాకంగా కనిపించే ఈ పాత్రలో స్ట్రెంత్, పవర్ ఉన్నాయి. ఈ సినిమాలో ఉన్న సందేశం కూడా నా పాత్రతోనే వస్తుంది. నా రియల్ లైఫ్ క్యారెక్టర్‌కు భూమి పాత్ర కాస్త దగ్గరగా అనిపించింది. వీఐ ఆనంద్ గారు ఈ సినిమా కథ చెప్పినప్పుడు అలా ఎలా ఆలోచించి కథలు రెడీ చేస్తారు? అనుకున్నాను. కథ అంత బాగా అనిపించింది. ప్రస్తుతం తమిళ, తెలుగు, మలయాళంలో సినిమాలు చేస్తున్నాను. తెలుగులో ఓ కొత్త ప్రాజెక్ట్ సైన్ చేశాను. ఇక హీరో బెల్లంకొండ గణేశ్‌తో నేను ప్రేమలో ఉన్నానన్న వార్తల్లో ఏ మాత్రం నిజం లేదు'' అని చెప్పుకొచ్చారు.



విశ్వక్ సేన్, చాందినీ చౌదరి

అఘోరా అనుకొని ధర్మం చేశారు!

''గామి' సినిమా షూటింగ్‌ని వారణాసిలోని కుంభమేళాలో జరిపినప్పుడు నేను నిజమైన అఘోరా అనుకొని కొందరు ధర్మం చేశారు. అక్కడ చలికి వణుకుతూ ఓ మూలన కూర్చున్నప్పుడు ఓ వృద్ధురాలు భోజనం పెట్టి, టీ ఇచ్చింది. 'గామి' ట్రైలర్ అత్యద్భుతంగా ఉంది. ఈ చిత్రం ప్రేక్షకులకు మునుపెన్నడూ కలిగించని సరికొత్త అనుభూతిని పంచుతుందనే నమ్మకం ఉంది'' అని విశ్వక్ సేన్ అన్నారు. ఆయన హీరోగా విద్యాధర్ కాగిత దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'గామి'. చాందినీ చౌదరి కథానాయిక. వి సెల్యులాయిడ్ సమర్పణలో కార్తీక్ శబరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని మార్చి 8న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''గామి' కోసం దాదాపు నాలుగున్నరేళ్లు పని చేశాం. ఇంత సమయం పట్టింది కాబట్టే మంచి గ్రాఫిక్స్‌ని రాబట్టుకున్నాం'' అన్నారు. ''మానవ స్పర్శ లేని జీవితాన్ని ఊహించలేం. అలాంటి సమస్య ఎదుర్కొంటున్న అఘోరా శంకర్ (విశ్వక్ సేన్) హిమాలయాల్లో చేసే సాహసోపేత ప్రయాణమే ఈ చిత్రం. ఈ సినిమా కోసం వారణాసిలో కుంభమేళా షూటింగ్ చేశాం. మైనస్ 40 డిగ్రీల్లో కూడా గ్లౌజులు లేకుండా నటించాడు విశ్వక్'' అన్నారు విద్యాధర్ కాగిత. ''2018లో 'గామి' మొదలు పెట్టాం. క్రౌడ్ ఫండ్ మోడల్‌లో చేశాం'' అన్నారు కార్తీక్ శబరీష్.



గౌతమ్ కృష్ణ

సోలో బాయ్

'బిగ్ బాస్' తెలుగు సీజన్ 7 ఫేమ్ గౌతమ్ కృష్ణ హీరోగా నటిస్తున్న చిత్రం 'సోలో బాయ్'. పి. నవీన్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్వేతా అవస్థి, రమ్య పసుపులేటి నాయికలు. సెవెన్ హిల్స్ సతీష్ నిర్మాత. ఈ చిత్రానికి 'సోలో బాయ్' టైటిల్ ప్రకటించి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. సెవెన్ హిల్స్ సతీష్ మాట్లాడుతూ– ''కోవిడ్ టైమ్‌లో 'బట్టల రామస్వామి బయోపిక్' సినిమా తీసి, వినోదం అందించాం. ఇప్పుడు 'సోలో బాయ్' నిర్మిస్తున్నాను. రెండు పాటలు మినహా షూటింగ్ పూర్తయింది'' అన్నారు. ''గతంలో నేను చేసిన 'ఆకాశ వీధిలో' సినిమాకి నటుడిగా మంచి గుర్తింపు వచ్చింది. 'బిగ్ బాస్'లోనూ ప్రేక్షకులు నన్ను బాగా ఆదరించారు. 'సోలో బాయ్'ని కూడా ఆశీర్వదించాలి'' అన్నారు గౌతమ్ కృష్ణ. ''యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను మా చిత్రం అలరించేలా ఉంటుంది'' అన్నారు పి. నవీన్ కుమార్.

ఆరేళ్ల ప్రేమతో..



శ్రీ గౌరి ప్రియ

మణికందన్, శ్రీ గౌరీప్రియ, కన్న రవి లీడ్ రోల్స్‌లో నటించిన తమిళ చిత్రం 'ట్రూ లవర్'. ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం రేపు తమిళంలో విడుదలవుతోంది. ఈ సినిమాను 'ట్రూ లవర్' టైటిల్‌తో ఈ నెల 10న తెలుగులో దర్శక–నిర్మాత మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ విడుదల చేస్తున్నారు. ఈ చిత్ర కథానాయిక శ్రీ గౌరి మాట్లాడుతూ– ''నేను హైదరాబాద్ అమ్మాయిని. 2018లో మిస్ హైదరాబాద్‌గా ఎంపికైనా నాకు ఇండస్ట్రీ నుంచి ఆఫర్స్ వచ్చాయి. ప్రియదర్శితో చేసిన 'మెయిల్' వెబ్ సిరీస్, సుహాస్ 'రైటర్ పద్మభూషణ్', 'మ్యాడ్' సినిమాలు నాకు నటిగా గుర్తింపు తీసుకువచ్చాయి. తమిళంలో 'మోడ్రన్ లవ్ చెన్నై'లో నటించి, అక్కడి ప్రేక్షకులకు దగ్గరయ్యా. అలా 'ట్రూ లవర్'లో చాన్స్ వచ్చింది. ఓ జంట మధ్య ఆరేళ్ల కాలంలో జరిగే కథే ఈ చిత్రం. ఇందులో డిఫరెంట్ షేడ్స్ ఉన్న దివ్య పాత్రలో కనిపిస్తాను. ఈ సినిమాని ప్రేమికులు బాగా రిలేట్ చేసుకుంటారు'' అన్నారు.

థ్రిల్లర్ ఆరంభం



ప్రశాంత్, ఇషా యాదవ్

ప్రశాంత్ గురువాన హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'తిమిరం'. ఈ చిత్రంలో ఇషా యాదవ్ కథానాయిక. రాహుల్ అయ్యర్, ప్రసన్న, వేణుగోపాల్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభమైంది. తొలి సీన్‌కి నిర్మాతల్లో ఒకరైన వేణుగోపాల్ కెమెరా స్విచ్చాన్ చేయగా, పారిశ్రామికవేత్త ప్రసాద్ క్లాప్ ఇచ్చారు. ప్రశాంత్ గురువాన మాట్లాడుతూ– ''ఓ ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌తో రూపొందుతున్న సరికొత్త హారర్ థ్రిల్లర్ చిత్రమిది. హీరోగా, దర్శకుడిగా ఇది నా మొదటి చిత్రం'' అన్నారు. ''మూఢ నమ్మకాల నేపథ్యంలో నడిచే హారర్ చిత్రమిది. వేసవిలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: తరుణ్ రానా ప్రతాప్, కెమెరా: మహేష్.

సాక్షి బిజినెస్
గురువారం
8-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	34	72,152
నిఫ్టీ △	1	21,930

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	15,710	△	101
డోజోన్స్	38,666	△	145
ఎఫ్‌టీఎస్ఈ 100	7,629	▽	52
డాక్స్	16,922	▽	111
షాంఘై	2,830	△	40
నికాయ్	36,120	▽	41

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	62,646 △	167
బంగారం (99.5 స్వచ్ఛత)	62,395 △	96
వెండి (కిలో)	69,866 ▽	118

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.64	83.66
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.57	106.14
€	యూరో	ఎస్‌బీఐ	88.33	90.68
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.10	57.38
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.40	55.31
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.68	6389
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.17	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.70	23.48
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.39

'బీ న్యూ'లో రియల్‌మీ 12 ప్రో 5జీ స్మార్ట్ ఫోన్లు



హైదరాబాద్: మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చెయిన్ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్లలో రియల్‌మీ 12 ప్రో 5జీ సిరీస్ స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ బీ న్యూ స్టోర్‌లో బుధవారం నటి ప్రియాంక జవాల్కర్ ఈ మోడల్ స్మార్ట్‌ఫోన్ విడుదల చేశారు. ''అద్భుతమైన ఫీచర్లున్న రియల్‌మీ 12 ప్రో 5జీ స్మార్ట్ ఫోన్లను బీ న్యూ ఉత్తమ ఆఫర్లకు అందిస్తుంది. ఈ అవకాశాన్ని కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలి'' అని సంస్థ సీఎండీ బాలాజీ చౌదరి కోరారు. ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ సీఈఓ సాయి నిఖిలేశ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితేష్‌తో పాటు రియల్‌మీ సేల్స్ డైరెక్టర్ తరిని ప్రసాద్, సేల్స్ హెడ్ పునీత్, నరసింహాలు పాల్గొన్నారు.

టాటా కన్జ్యూమర్ లాభాలకు కోత

రూ.301 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ కన్సాలిడేటెడ్ నికర లాభం డిసెంబర్ త్రైమాసికంలో 17 శాతం క్షీణించి రూ.301 కోట్లకు పరిమితమైంది. ఒక అసాధారణ అంశానికి తోడు, అసోసియేట్, జాయింట్ వెంచర్ల నుంచి లాభాల వాటా తగ్గడం ఇందుకు కారణమని సంస్థ తెలిపింది. వీటిని మినహాయించి చూస్తే నికర లాభం 27 శాతం వృద్ధితో రూ.513 కోట్లుగా ఉంది. ఆదాయం 9 శాతానికి పైగా వృద్ధితో రూ.3,804 కోట్లకు చేరుకుంది. దేశీ బ్రాండెడ్ ఆదాయం 10% పెరిగి రూ.2,375 కోట్లుగా నమోదైంది. ప్యాకేజ్డ్ బేవరేజెస్ విక్రయాలు 4 శాతం, టాటా సంపన్న్ బ్రాండెడ్ అమ్మకాలు 40 శాతం చొప్పున పెరిగాయి. టాటా స్టార్‌బక్స్ బ్రాండ్‌పై కొత్తగా 22 స్టోర్లను ప్రారంభించగా, 55 పట్టణాల్లో మొత్తం స్టోర్లు 392కు పెరిగాయి.

ఈ–లూనా వచ్చేసింది

ఆరంభ ధర రూ.69,990



న్యూఢిల్లీ: దేశీ మార్కెట్లోకి ఈ–లూనా అడుగు పెట్టింది. కేంద్ర రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ దీన్ని ఆవిష్కరించారు. కర్బన ఉద్గారాలను తగ్గించడంతోపాటు, ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ–లూనా ఎలక్ట్రిక్ రవాణాకు వీలు కల్పిస్తుందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో లక్ష ఈ–లూనాలను విక్రయించనున్నట్టు కినెటిక్ గ్రీన్ వ్యవస్థాపకురాలు, సీఈవో సులజ్జా ఫిరోదియా మోత్వానీ తెలిపారు. బీటూబీ కస్టమర్లు, ఈ–కామర్స్ సంస్థల నుంచి మంచి స్పందన వచ్చిందని, వారికి 50,000 యూనిట్లు విక్రయిస్తామనే అంచనాతో ఉన్నట్టు చెప్పారు. ఈ–లూనా ఆరంభ ధర రూ.69,990 (ఎక్స్‌షోరూమ్). 2 కిలోవాట్ లిథియం అయాన్ బ్యాటరీతో వచ్చే ఈ–లూనా ఒక్కసారి చార్జింగ్‌తో 110 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1,200 కోట్ల టర్నోవర్ సాధించాలని.. ఇందులో రూ.800 కోట్ల ఆదాయం ఈ–లూనా నుంచే వస్తుందన్న అంచనాతో కంపెనీ ఉంది.

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ రూ. 4.50 డివిడెండ్

నికర లాభంలో 11 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి పనితీరు పరంగా రాణించింది. క్రితం ఏడాది ఇదే కాలంలోని లాభం రూ.3,645 కోట్లతో పోల్చి చూసినప్పుడు 11 శాతం పెరిగి రూ.4,028 కోట్లకు చేరింది. ఆదాయం సైతం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.11,530 కోట్ల నుంచి రూ.11,820 కోట్లకు పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో రూ.7,690 కోట్ల మూలధన వ్యయాలను వినియోగించింది. డిసెంబర్ త్రైమాసికంలో ఆరు అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ ప్రాజెక్టులను బిడ్డింగ్‌లో గెలుచుకుంది. వీటి నిర్మాణ అంచనా వ్యయం రూ.20,479



కోట్లుగా ఉంది. డిసెంబర్ చివరికి పవర్‌గ్రిడ్ సంస్థ నిర్వహణలోని ట్రాన్స్‌మిషన్ ఆస్తుల నిడివి 1,76,530 సర్క్యూట్ కిలోమీటర్లుగా ఉంది. అలాగే, 276 సబ్ స్టేషన్లు, 5,17,860 మెగావోల్ట్ యాంపియర్స్ ట్రాన్స్‌ఫార్మేషన్ సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుకు రెండో మధ్యంతర డివిడెండ్ కింద రూ.4.50 చొప్పున పంపిణీ చేయాలని నిర్ణయించింది.

ఆర్‌బీఐ పాలసీ అప్రమత్తత

- ఆరంభ లాభాలు ఆవిరి
- ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి
- ఇంట్రాడేలో ఒడిదుడుకుల ట్రేడింగ్
- స్వల్ప నష్టాల ముగింపు



ముంబై: ఆరంభ లాభాలు కోల్పోయిన స్టాక్ సూచీలు బుధవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఆర్‌బీఐ ద్రవ్య కమిటీ సమావేశ నిర్ణయాల వెల్లడి (నేడు)కి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఐటీ షేర్లలో లాభాల స్వీకరణతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో బలహీన సంకేతాలు సైతం సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఇంట్రాడేలో 621 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 34 పాయింట్ల స్వల్ప నష్టంతో 72,152 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 71,938 వద్ద కనిష్టాన్ని, 72,559 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 22,053 – 21,860 రేంజ్ లో కదలాడింది. చివరికి ఒక పాయింటు లాభపడి 21,930 వద్ద నిలిచింది. ఐటీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఫార్మా, రియల్టీ షేర్లకు డిమాండ్ నెలకొంది. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.31%, 0.38% చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,691 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,096 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియాలో హాంగ్‌కాంగ్, ఇండోనేసియా, చైనా తప్ప మిగిలిన అన్ని దేశాల సూచీలు ఒకశాతం మేర లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 0.50% – 0.10% నష్టపోయాయి. అమెరికా మార్కెట్లు 0.25% లాభాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- అమెరికా దిగ్గజ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ క్యూ4 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో పాటు ఇటీవల ర్యాలీ నేపథ్యంలో ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. టెక్ మహీంద్రా 2.31%, ఇన్ఫోసిస్ 2%, టీసీఎస్, విప్రో, హెచ్‌సీఎల్ షేర్లు ఒకశాతం చొప్పున నష్టపోయాయి.
- పేటీఎం రికవరీ ప్రయాణం బుధవారం కొనసాగింది. బీఎస్ఈలో ట్రేడింగ్ ప్రారంభంలో 10% పెరిగి రూ.496 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకి లాకైంది. రెండు రోజుల్లో షేరు 13% బౌన్స్‌బ్యాక్‌తో కంపెనీ మార్కెట్ విలువ రూ.3,720 కోట్లు పెరిగి రూ.31,548 కోట్లకు చేరింది.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వాటా కొనుగోలుకు ఆర్‌బీఐ అనుమతినివ్వడంతో యస్‌బ్యాంక్, సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ షేర్లు వరుసగా 17%, 7% చొప్పున లాభపడ్డాయి.

20 లక్షల మందికి ఏఐలో శిక్షణ

- ఏఐ నియంత్రణపై సహకారం అత్యవసరం
- మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల



ముంబై: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతపై రెండేళ్లలో 20 లక్షల మంది భారతీయులకు నైపుణ్యం కల్పిస్తామని అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల బుధవారం తెలిపారు. శ్రామికశక్తి అభివృద్ధి చెందడానికి నైపుణ్యాలను పెంపొందించడం అనేది ఒక సంస్థ చేయగలిగే అత్యంత ముఖ్యమైన విషయమని అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా నాదెళ్ల భారత్‌లో అడుగుపెట్టారు. కన్సల్టెన్సీలు, చట్టపర సంస్థలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంపెనీలకు చెందిన వ్యాపారవేత్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఏఐపై నిబంధనలను రూపొందించడంలో భారత్, యూఎస్ సహకరించుకోవడం అత్యవసరం అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. కొత్త తరం సాంకేతికత వృద్ధిని సమానంగా పంపిణీ చేయగలదని అన్నారు. శక్తివంతమైన సాధారణ ప్రయోజన సాంకేతికతగా ఏఐని పేర్కొన్న ఆయన.. ఏఐ నిబంధనల విషయంలో ఏకాభిప్రాయం బహుపాక్షిక స్థాయిలలో కూడా చాలా అవసరమని నాదెళ్ల తెలిపారు.

జీడీపీ వృద్ధిలో ఏఐ..

సాంకేతికత వేగంగా విస్తరించడం వల్ల ఆర్థిక వృద్ధిలో సమాన పంపిణీకి సహాయపడుతుందని సత్య నాదెళ్ల అన్నారు. జీడీపీ వృద్ధిని పెంచడంలో ఏఐ సహాయపడుతుందని చెప్పారు. భారత్‌ను ప్రపంచంలోని అత్యధిక వృద్ధి మార్కెట్లలో ఒకటిగా పేర్కొన్నారు. 2025 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల జీడీపీలో ఏఐ జీడీపీ 500 బిలియన్ డాలర్లుగా ఉంటుందన్న మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నివేదికను ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు. పునరుత్పాదక వనరుల నుంచి విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, భారత్ కూడా గ్రిడ్ స్థిరత్వంపై దృష్టి సారించాల్సి ఉందని చెప్పారు. సాంకేతికత కూడా ఇందులో కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. భారత పర్యటనలో భాగంగా టాటా గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌ను తాను కలిశానని, ఎయిర్ ఇండియా ఏఐ వినియోగాన్ని ప్రారంభించిందని గుర్తు చేశారు. ఐటీసీ, అరవింద్, లాభాపేక్ష లేని ఇతర భారతీయ సంస్థలు, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వంటి ఐటీ కంపెనీలు అనేక సంస్థాగత కార్యక్రమాల కోసం ఏఐ సాధనాలను ఉపయోగిస్తున్నాయని నాదెళ్ల వివరించారు.

కెనరా బ్యాంక్ షేరు విభజన!

ఈ నెల 26న నిర్ణయం

న్యూఢిల్లీ: కెనరా బ్యాంక్ షేరు ముఖ విలువని విభజించాలని అనుకుంటున్నట్టు ప్రకటించింది. దీనిపై నిర్ణయం తీసుకునేందుకు ఈ నెల 26న బోర్డ్ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపింది. ప్రస్తుతం కెనరా బ్యాంక్ షేరు ముఖ విలువ రూ.10గా ఉంది. ఆర్‌బీఐ, ఇతర చట్టబద్ధమైన ప్రభుత్వరంగ సంస్థల ముందస్తు అనుమతి మేరకు ఈక్విటీ షేర్ల సబ్ స్ప్లిట్‌పై బోర్డు ఆఫ్ డైరెక్టర్ల నుంచి సూత్ర ప్రాయ ఆమోదం తీసుకోనున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు కెనరా బ్యాంక్ తెలియజేసింది. స్టాక్ లిక్విడిటీ (మరిన్ని షేర్ల లభ్యత) పెంచేందుకు వీలు గా కెనరా బ్యాంక్ ముఖ విలువ విభజనకు మొగ్గు చూపుతున్నట్టు తెలిపింది. ఈ వార్త నేపథ్యంలో బీఎస్ఈలో కెనరా బ్యాంక్ షేరు 6% లాభపడి రూ.554 వద్ద ముగిసింది.

ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ జేవీ



గోవా: దేశీ చమురు–గ్యాస్ ఉత్పత్తి దిగ్గజం ఓఎన్‌జీసీ, అతిపెద్ద విద్యుత్ సంస్థ ఎన్‌టీపీసీ జాయింట్ వెంచర్ ఒప్పందంపై ఇండియా ఎనర్జీ వీక్ కార్యక్రమం వేదికగా బుధవారం సంతకం చేశాయి. ఈ జేవీ ద్వారా భారత్‌తోపాటు విదేశాల్లో పవన విద్యుత్ ప్రాజెక్టులను ఇరు సంస్థలు కలిసి ఏర్పాటు చేస్తాయి. స్టోరేజ్, ఈ–మొబిలిటీ, కార్బన్ క్రెడిట్, గ్రీన్ క్రెడిట్, గ్రీన్ హైడ్రోజన్ వ్యాపారంతోపాటు గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మిథనాల్ వంటి విభాగాల్లోకి ప్రవేశించే అవకాశాలను పరిశీలిస్తాయి.

హోటల్ రంగ అభివృద్ధి బడ్జెట్‌లో ప్రస్ఫుటం


సాక్షి, అమరావతి: ఏపీలో వాణిజ్య రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు బడ్జెట్‌లో ప్రస్ఫుటించాయని ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి ప్రకటనలో తెలిపారు. 311కుపైగా భారీ, మెగా పరిశ్రమల ఏర్పాటు, తద్వారా 1.30 లక్షల మందికి ఉపాధి కల్పించడం శుభపరిణామమన్నారు. ఏపీలో హోటల్ రంగానికి ఇండస్ట్రీ స్టేటస్ కల్పిస్తే లక్షల కుటుంబాలకు ఉపాధి మరింత మెరుగు పడుతుందని తెలిపారు.

సీఎం నిర్ణయం హర్షణీయం



తాడికొండ/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): వికేంద్రీకరణతో రాష్ట్రానికి ఎంతమేర లబ్ధి చేకూరుతుందో సీఎం జగన్ అసెంబ్లీ సాక్షిగా పేర్కొనడం అభినందనీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,228వ రోజు కొనసాగుతున్న రిలే దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. ఈపూరి ఆదాం, ఇందుపల్లి సుభాషిణి, పులి దాసు, పెరికే వరప్రసాద్, కారుమూరి పుష్పరాజు, పల్లె బాబు, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి పాల్గొన్నారు. పేదల పక్షాన నిలిచిన సీఎం జగన్‌కు మద్దతుగా నిలిచేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్‌డీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం మీడియాతో మాట్లాడారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుందాం: ఎంపీ ఎంవీవీ



సాక్షి, న్యూఢిల్లీ: కలసికట్టుగా పోరాడి విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుందామని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఎంవీవీ మాట్లాడుతూ.. సీఎం జగన్ ఆదేశాల మేరకు ఇప్పటికే విశాఖతో పాటు పార్లమెంట్‌లోనూ ఆందోళన తెలిపామన్నారు. మద్దతుగా 123 మంది ఎంపీలు సంతకాలు చేశారని.. వాటిని ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు, హోం మంత్రి అమిత్‌షాకు అందజేశామన్నారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ జై భారత్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణలు ప్రసంగించారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి స్నేహ రఫీ, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జిత్ కౌర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

6,100 పోస్టులతో డీఎస్సీ

▶ మొదటి పేజీ తరువాయి

పరీక్ష నిర్వహించామని తెలిపారు. ఈ నేపథ్యంలో బీఈడీ, డీఈడీ పూర్తిచేసినవారికి, గతంలో టెట్ అర్హత సాధించలేని వారికి అవకాశం కల్పించేందుకు టెట్ కూడా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గతంలో తలెత్తిన ఇబ్బందుల దృష్ట్యా పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌లో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు.

వివిధ విద్యా సంస్థల పరిధిలో 6,100 పోస్టులు..

ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి ఖాళీ అయ్యే పోస్టులతో కలిపి మొత్తం 6,100 పోస్టులను భర్తీ చేసేందుకు డీఎస్సీ నిర్వహిస్తున్నట్టు మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. జిల్లా, మండల పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్, ఏపీ మోడల్ స్కూళ్లు, ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఆశ్రం), ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థల్లో మొత్తం అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు 14,219 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందన్నారు. విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిందని గుర్తు చేశారు. ఈ ఐదేళ్లల్లో విద్యపై రూ.73 వేల కోట్లు ఖర్చు చేసినట్టు వివరించారు. రాష్ట్రంలో పేదింటి పిల్లలకు ఎలాంటి విద్యను అందిస్తే వారు ఉజ్వల భవిష్యత్‌ను అందుకుంటారో సీఎం వైఎస్ జగన్‌కు బాగా తెలుసని చెప్పారు. అందుకే ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ, టోఫెల్‌ను అందుబాటులోకి తెచ్చారన్నారు. కొద్దిరోజుల క్రితం ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) సంస్థతో ఒప్పందం కూడా చేసుకున్నామని గుర్తు చేశారు.

విద్యార్థుల మేలు కోసం కొత్త నిర్ణయం


ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మేలు చేసే మరో మంచి నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యా సంవత్సరం మధ్యలో రిటైర్ అయితే విద్యార్థులకు బోధన సమస్య తలెత్తుతోందన్నారు. కొత్తవారిని నియమించినా విద్యార్థులు అలవాటు పడేందుకు సమయం పడుతోందని వివరించారు. ఈ ప్రభావం విద్యార్థుల ఫలితాలపై పడుతున్నట్టు గుర్తించామన్నారు. దీన్ని అధిగమించేందుకు విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయులు రిటైర్ అయితే, ఆ విద్యా సంవత్సరం మొత్తం వారినే కొనసాగించే యోచన చేస్తున్నామన్నారు. దీనివల్ల విద్యార్థులకు ఆ విద్యా సంవత్సరం మొత్తం ఒకే టీచర్ బోధన అందుతుందని చెప్పారు. ఇప్పటికే ఈ విధానం కేరళలో అమల్లో ఉందని, త్వరలో దీనిపై విధివిధానాలు ప్రకటిస్తామన్నారు.

కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో టెట్, డీఎస్సీ..

పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ.. ఏపీ టెట్, డీఎస్సీ పరీక్షలు రెండింటినీ ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)గా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రోజుకు రెండు సెషన్లలో నిర్వహిస్తామన్నారు. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఉంటుందని చెప్పారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 185 కేంద్రాలను ఎంపిక చేశామని తెలిపారు. రాష్ట్రం బయట ఉన్నవారి కోసం మరో 22 సెంటర్లను హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, బరంపురంల్లో ఏర్పాటు చేస్తామన్నారు. డీఎస్సీ రాయాలనుకునే జనరల్ అభ్యర్థులకు 44 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 49 ఏళ్ల వయోపరిమితి ఉంటుందని చెప్పారు. ఈసారి డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు నాలుగు దశల్లో ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ), టెక్నాలజీ ట్రైనింగ్, టోఫెల్, బోధన సామర్థ్యంపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇందులో సర్టిఫికెట్లు సైతం ప్రదానం చేస్తామన్నారు. కమిషనర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 7 లక్షల మంది పరీక్ష రాసేలా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పి.భాస్కర్, విద్యాశాఖ జేడీలు మేరీ చంద్రిక, మొవ్వా రామలింగం, డాక్టర్ ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ టెట్, డీఎస్సీ-2024 షెడ్యూల్..

అంశం	టెట్	డీఎస్సీ
నోటిఫికేషన్	ఫిబ్రవరి 8	12
ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు	ఫిబ్రవరి 17 వరకు	21 వరకు
దరఖాస్తు ప్రక్రియ	ఫిబ్రవరి 18 వరకు	22 వరకు
ఆన్‌లైన్ నమూనా పరీక్ష	ఫిబ్రవరి 19	24
హాల్‌టికెట్లు	ఫిబ్రవరి 23 నుంచి	మార్చి 5 నుంచి
పరీక్ష నిర్వహణ	ఫిబ్రవరి 27 నుంచి మార్చి 9 వరకు	మార్చి 15 నుంచి 30 వరకు
ప్రాథమిక కీ	మార్చి 10	31
తుది కీ	మార్చి 13	ఏప్రిల్ 2
ఫలితాల ప్రకటన	మార్చి 14	ఏప్రిల్ 7



పోలవరంపై పూర్తి వివరాలతో కౌంటర్లు వేయండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తిచేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర జల వనరుల శాఖను ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోలవరం ప్రాజెక్టుకు ఎగువన కాఫర్ డ్యామ్ నిర్మించకుండానే డయాఫ్రం వాల్ నిర్మాణానికి అనుమతులిచ్చిన అధికారులపై విచారణకు ఆదేశించకపోవడాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ అమలాపురానికి చెందిన న్యాయవాది వి.రమేష్‌చంద్రవర్మ హైకోర్టులో ఇటీవల పిల్ దాఖలు చేశారు. దీనిపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది మంగెన శ్రీరామారావు వాదనలు వినిపిస్తూ.. పోలవరం ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వం మొదట కాఫర్ డ్యామ్ నిర్మించిందన్నారు. సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని తెలిపారు. దీనివల్ల రూ.700 కోట్ల ప్రజాధనం వృథా అయిందన్నారు. నిపుణుల పర్యవేక్షణలో ఈ ప్రాజెక్టును నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. దీనిపై వాదనలు విన్న ధర్మాసనం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ప్రాజెక్టుకు సంబంధించి మరిన్ని వివరాలను తమ ముందుంచాలని పిటిషనర్‌ను కూడా ధర్మాసనం ఆదేశించింది.

రుషికొండ నిర్మాణాలపై నివేదికకు గడువు కోరిన కేంద్రం

అంగీకరించిన హైకోర్టు ధర్మాసనం



సాక్షి, అమరావతి: విశాఖపట్నంలోని రుషికొండపై ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీ టీడీసీ) చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన ఉల్లంఘనలను పరిశీలించేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక సిద్ధం చేసిందని కేంద్ర ప్రభుత్వం ఏపీ హైకోర్టుకు నివేదించింది. కమిటీ గుర్తించిన అంశాలన్నింటినీ ఆ నివేదికలో పొందుపరిచిందని, అయితే కమిటీ చైర్మన్ కుప్పుస్వామి గౌరప్పన్ ఆకస్మికంగా గుండెపోటుతో చనిపోయారని తెలిపారు. ఆ నివేదికపై చైర్మన్ సంతకాలు చేయలేదని, అందువల్ల నివేదికను కోర్టు ముందుంచేందుకు జాప్యం జరుగుతోందని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జూపూడి వెంకట యజ్ఞదత్ హైకోర్టుకు వివరించారు. నివేదికలో కమిటీ చైర్మన్ వ్యక్తం చేసిన అభిప్రాయాలపై మిగిలిన సభ్యుల అభిప్రాయం ఏమిటో తెలుసుకుంటున్నామన్నారు. రెండు వారాలు గడువిస్తే పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతామని కోరారు. దీంతో విచారణను రెండు వారాలకు హైకోర్టు వాయిదా వేసింది. రిషికొండపై అటవీ శాఖ అనుమతులకు, మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయంటూ విశాఖ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ వేర్వేరుగా ప్రజాప్రయోజనం వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం విదితమే. వీటిపై ధర్మాసనం ఈ వ్యాజ్యాలపై హైకోర్టు ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపి.. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

హోదా కోసం పోరు

ఢిల్లీ ఏపీ భవన్‌లో సాధన సమితి ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చే వరకు తాము పోరాటం చేస్తూనే ఉంటామని పలువురు తెలిపారు. 'ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి' ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఏపీ భవన్‌లో బుధవారం ధర్నా చేపట్టారు. చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. హోదా వచ్చే వరకు నిరసనలు తెలియజేస్తూనే ఉంటామన్నారు. సాధన సమితి ప్రధాన కార్యదర్శి జేడీ లక్ష్మీనారాయణ, సమితి నేత సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సమితి ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ప్రసంగించారు.

'ఎన్నికల కరపత్రంలా ఏపీ బడ్జెట్'

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ బడ్జెట్ ఎన్నికల కరపత్రంలా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. బుధవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌లో అప్పులు కూడా తక్కువగా ఉన్నట్లు ఆర్థిక మంత్రి బుగ్గన చూపించడం విడ్డూరంగా ఉందన్నారు.

క్లుప్తంగా...

వలంటీర్‌పై టీడీపీ కౌన్సిలర్ దాడి

తాడిపత్రి అర్బన్: వలంటీర్‌ను కులం పేరుతో దూషించి టీడీపీ కౌన్సిలర్ దాడి చేశారు. ఈ ఘటన అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగింది. తాడిపత్రి అర్బన్ ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు..36వ వార్డులో మంగళవారం విధి నిర్వహణలో భాగంగా వలంటీర్ అనిల్ సెబ్ కార్యాలయ సమీపంలో ఉండగా.. టీడీపీ కౌన్సిలర్ జింకా లక్ష్మీదేవి ఇక్కడ ఎందుకు తిరుగుతున్నావంటూ అతడిని అడ్డుకున్నారు. తాను విధి నిర్వహణలో భాగంగా రోజూ ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజల యోగ క్షేమాలు తెలుసుకుంటూ.. ప్రభుత్వం నుంచి పథకాలు అందుతున్నాయా, లేదా అని ఆరా తీస్తుంటానని, ఇందులో భాగంగా ఈ రోజూ వచ్చానని వలంటీర్ సమాధానమిచ్చాడు. అయినప్పటికీ కౌన్సిలర్ వినకుండా వలంటీర్ నుంచి ఫోన్ లాగేసుకుని..గొంతు పట్టుకుని కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. బాధితుడు తాడిపత్రి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కౌన్సిలర్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

పలువురు ఐఏఎస్‌ల బదిలీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ డైయిరీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న ఏ బాబును మార్కెటింగ్ శాఖ కార్యదర్శిగా నియమించారు. మార్కెటింగ్ శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న చిరంజీవి చౌదరిని తప్పించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఏపీ డైయిరీ మేనేజింగ్ డైరెక్టర్ అమూల్ ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్, కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న అభిషేక్ గౌడను గ్రామవార్డు సచివాలయ అడిషనల్ డైరెక్టర్‌గా నియమించారు. ఏపీ సీడ్స్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న శేఖర్‌బాబు గద్దంను మార్క్‌ఫెడ్ ఎండీగా నియమించారు. ఎండీగా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్న రాహుల్ పాండేను రిలీవ్ చేశారు. ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న ఎం.శివప్రసాద్‌ను ఏపీ సీడ్స్ వీసీఎండీగా నియమించారు. ఇంగ్లిషు మీడియం అమలుకు స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న వెట్రిసెల్విని మహిళా, శిశుసంక్షేమ శాఖ స్పెషల్ డ్యూటీ ఆఫీసర్‌గా బదిలీ చేశారు.

దిగజారుడు రాతలు మానుకో



కర్నూలులో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వలంటీర్లు



విశాఖ జిల్లా చిట్టివలసలో ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలను దహనం చేస్తున్న వలంటీర్లు



నరసరావుపేట మండలం లింగంగుంట్లలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వలంటీర్లు

రామోజీపై మండిపడ్డ వలంటీర్లు

- ఈనాడులో తమను హంతకులు, సంఘ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరించడంపై ఆగ్రహజ్వాలలు
- ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంటే చూడలేక మాపై విషం కక్కుతున్నారు
- ఈనాడును ఎవరూ చదవద్దంటూ ఊరూరా ఆ పత్రిక ప్రతుల దహనం

సాక్షి నెట్‌వర్క్: వలంటీర్లను హంతకులు, సంఘ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరిస్తూ దుష్ట రామోజీ పత్రిక ఈనాడు ప్రచురించిన కథనంపై రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లు మండిపడుతున్నారు. ప్రజలకు స్వచ్ఛందంగా సేవలందించేందుకు ముందుకొచ్చిన వలంటీర్లపై కిడ్నాపర్లని ముద్ర వేస్తూ అత్యంత నీచానికి దిగజారడంపై ఆగ్రహ జ్వాలలు వ్యక్తం చేస్తున్నారు. 'ఊరూరా వలంటీర్లు.. అన్ని చోట్లా జగన్ అరాచకాలు' అంటూ వలంటీరు వ్యవస్థను కించపరుస్తూ మరోసారి రామోజీ తన నీచబుద్ధిని చాటుకున్నారంటూ ఊరూవాడా నిరసనలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే తీసుకెళ్లడమే కాకుండా.. ఎవరికైనా పథకాలు అందకపోతే వారికి లబ్ధి అందేవరకూ శ్రమిస్తున్న వలంటీర్లపై విషం కక్కిన రామోజీ.. చంద్రబాబుకు ప్రయోజనం కోసమే తమను నేరస్తులుగా చూపుతున్నారంటూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. వాడవాడలా ఈనాడు ప్రతులను దహనం చేశారు.

స్వచ్ఛందంగా సేవ చేస్తున్న మాపై నిందలా?

బుధవారం కడప 20వ డివిజన్ సచివాలయం వద్ద ఈనాడు పత్రికల్ని వలంటీర్లు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను వలంటీర్లు ప్రజలకు చేరువ చేస్తున్నారని, ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందిస్తున్న తమపై గూఢచారులని ముద్ర వేయడంపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఈనాడులో కథనంపై శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం బూరగాం సచివాలయం పరిధిలోని వలంటీర్లు తీవ్ర నిరసన తెలిపారు. ఈనాడు ప్రతులను దహనం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామ వలంటీర్లు ఈనాడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు. వెంటనే ఆ కథనాన్ని వెనక్కు తీసుకోవాలని, ప్రజాస్వామ్యవాదులు అందరూ ఖండించాలని వలంటీర్లు కోరారు.

రామోజీ వెన్నులో వణుకు

వీరఘట్టం మండలం కత్తులకవిటి, చిదిమి గ్రామాల్లో ఈనాడు ప్రతులను దహనం చేశారు. ప్రతిపక్షాలతో పచ్చమీడియా కుమ్మక్కై వలంటీర్ల సేవలను ప్రజలకు దూరం చేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. ఈనాడులో కథనంపై బుధవారం భీమిలి వలంటీర్లు చిట్టివలసలో ఆందోళన నిర్వహించారు. తమ సేవలను ఓర్వలేని రామోజీ రావు తాము నేరాలకు, ఘోరాలకు పాల్పడుతున్నట్టు విషంకక్కడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై దుష్ప్రచారం తగదని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని రాజవోలు గ్రామ వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాజవోలులో ఈనాడు ప్రతులను దగ్ధం చేశారు. వలంటీర్లను అరాచక శక్తులుగా అభివర్ణించడంపై బుధవారం పిఠాపురంలో పలువురు వలంటీర్లు భగ్గుమన్నారు. ఈనాడు ప్రతులను తగులబెట్టారు. కర్నూలు నగరపాలక పరిధిలోని 23వ వార్డు 58, 59 సచివాలయాలకు చెందిన వలంటీర్లు ఈనాడు కథనాన్ని తీవ్రంగా ఖండించారు. ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కొడమంచిలిలో వలంటీర్లు ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేశారు. నెల్లూరు నగరంలోని 39, 40వ డివిజన్ల వలంటీర్లు స్థానిక సచివాలయం ఎదుట ఈనాడు ప్రతులను దహనం చేశారు.

సీఎం చిత్రపటానికి వీఆర్‌ఏల క్షీరాభిషేకం

సాక్షి, అమరావతి: గ్రామ రెవెన్యూ సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 డీఏ మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఏపీ రెవెన్యూ జేఏసీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీఆర్‌ఏలు జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్ నేతృత్వంలో తాడేపల్లిలో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. డీఏ మంజూరు చేస్తూ జీవో ఎంఎస్ నంబర్ 40ని విడుదల చేయడంపై వీఆర్‌ఏలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వీఎస్ దివాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామ రెవెన్యూ సహాయకులందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఉంటామని చెప్పారు. రెవెన్యూ శాఖకు సంబంధించి సుమారు నాలుగు వేల మంది వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా, వీఆర్వోలను సీనియర్ సహాయకులుగా, అలాగే వివిధ తరగతుల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఆయన్ను మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న, ధైర్యం, ప్రధాన కార్యదర్శులు సత్తిరాజు, గణేష్, కృష్ణాజిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

12 రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్ పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని బోధనాసుపత్రుల్లో 12 రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఈనెల 19న వాకిన్ రిక్రూట్‌మెంట్ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సభ్య కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన అర్హతా ప్రమాణాలు, మార్గదర్శకాలు http://apmsrb.gov.in/msrb /https://dme.ap.nic.in వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 19న విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో నిర్వహించే వాకిన్ రిక్రూట్‌మెంట్‌కు హాజరు కావాలని సూచించారు.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

వృద్ధాప్యంలో ఓ గూడు దొరికింది



ఇరవై సంవత్సరాల క్రితం ప్రకాశం జిల్లా ఇరాచర్ల మండలం ఆకవీడులో వ్యవసాయం చేసుకుని బతికేవాళ్లం. అక్కడి నుంచి బేస్తవారిపేటకు వలస వచ్చి ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకున్నాం. మాకు ముగ్గురు కుమార్తెలు. ముగ్గురికీ పెళ్లిళ్లు అయ్యాయి. వృద్ధాప్యంలో ఏ పనీ చేయలేని మేము ఆరు నెలల కిందటి వరకు అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. గత ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం చాలాసార్లు దరఖాస్తు చేసినా ఫలితం దక్కలేదు. ఇక సొంతింటి కల నెరవేరదేమోనని మదనపడ్డాం. ఆ తర్వాత వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చింది. ఉచితంగా ఇంటి స్థలం ఇస్తుందని వలంటీర్, సచివాలయ సిబ్బంది చెప్పారు. వారే స్వయంగా దరఖాస్తు పూర్తి చేశారు. పందిళ్లపల్లె టోల్‌ప్లాజా వద్ద జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఒకటిన్నర సెంటు స్థలం ఇచ్చి పట్టా అందించారు. ప్రభుత్వం నుంచి రూ.1.80 లక్షలు విడుదల చేశారు. దానికి తోడు మేము పొదుపు చేసుకున్న మరికొంత డబ్బులు కలిపి ఇంటిని మాకు నచ్చిన విధంగా నిర్మించుకున్నాం. నిర్మాణ సామగ్రి సబ్సిడీ ధరలకు సమకూర్చారు. ఏ ఇబ్బంది లేకుండా ఇల్లు కట్టుకున్నాం. లేఅవుట్‌లో విశాలమైన రోడ్లు, మంచినీటి పైపులైన్, విద్యుత్ వసతి కల్పించారు. నాకు ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ అందుతోంది. సొంతింట్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో సంతోషంగా ఉంటున్నాము.

– పోతిరెడ్డి పద్మావతి, బేస్తవారిపేట
(పెరుమారెడ్డి హనుమంతారెడ్డి, విలేకరి, బేస్తవారిపేట)

ప్రభుత్వమే నా ప్రాణం నిలబెట్టింది



మా చిన్న కుమారుడు తాయన్న ఆరు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెద్ద కొడుకు గిడ్డయ్య బేల్దారిగా పని చేస్తున్నాడు. రోజుకు రూ.500 నుంచి రూ.600 వస్తుంది. కర్నూలు జిల్లా కోసిగిలోని దుర్గమ్మవ్వ గుడి సమీపంలో నివసిస్తున్న నాకు కిడ్నీ వ్యాధి ఉంది. నాలుగేళ్ల కిందట మోకాళ్ల నొప్పులకు మాత్రలు విపరీతంగా వాడడం వల్ల కిడ్నీలు పాడైపోయాయి. గత ప్రభుత్వంలో రూ.3 లక్షల వరకు ఖర్చు చేసి, ఆపరేషన్ చేయించుకున్నా ఫలితం లేకపోయింది. వైద్యాధికారులు డయాలసిస్ చేయించాలని చెప్పారు. ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగా ఉండడంతో ఏం చేయాలో తోచలేదు. ఈ తరుణంలో అప్పుడే అధికారంలోకి వచ్చిన జగనన్న ప్రభుత్వం దేవుడిలా ఆదుకుంది. ప్రతి నెల రూ.10 వేలు పింఛన్ మంజూరు చేసింది. నాలుగేళ్లుగా ఈ ఆర్థిక సాయాన్ని వలంటీర్ ఇంటికి వచ్చి ఇస్తున్నారు. ఈ సొమ్ముతో వైద్యులు సూచించిన మందులు కొనుక్కుంటున్నా. రోజు విడిచి రోజు కొడుకు సాయంతో ఆదోనిలో ప్రభుత్వాస్పత్రికి వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నా. మా కోడలు మరియమ్మ పొదుపు సంఘంలో ఉండడంతో వైఎస్సార్ ఆసరా కింద రూ.9000 లబ్ధి పొందింది. నాకు ముగ్గురు మనవలు, ఒక మనవరాలు. ఆరో తరగతి చదువుతున్న ఆకాష్‌కు అమ్మఒడి పథకం కింద ఏటా రూ.15,000 అందుతోంది. దీంతో పిల్లల చదువులకు ఇబ్బంది లేదు. రైతు భరోసా కింది ఏటా రూ.13,500 పడుతోంది. ప్రభుత్వం పుణ్యమా అని ఉన్నంతలో ఆనందంగా బతుకుతున్నాం.

– సూరిపోగు నరసింహులు, కోసిగి
(నీలి ఈరేష్, విలేకరి, కోసిగి)

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.